171
అక్టోబర్
1995

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

నిర్బంధంలో ఒక కవి

ఏకాంతవాస శిక్ష

జైలునుండి జైలుకు లేఖ

రేపటి సూర్యునికోసం (కథ)

ఫ్రాయిడిజంపై సారధి వ్యాసం

తెహ్రీడామ్ నిర్మాణం- మరో ప్రళయానికి సన్నాహం

'ద్రోహకాల్' తో ముఖాముఖి

మద్దూరు దళిత మహిళల పోరాటం (సమీక్ష)

విషయసూచిక

సంపాదకీయం 1

కవిత : నిజం — మేఘ 7

చింతచెట్టు — ఉదయమిత్ర 8

ఒరే! అబద్ధం చెప్పవుకదూ! — అక్షర్త 10

పల్లె పరిస్థితి — రమణ 13

సాహిత్యమేమిటి — ఎస్వెస్సీజీ 23

సంతాప రాక్షసులు — తొలిపొద్దు 16

అమ్మను కాదు అగ్నిని — చంద్రవంక

సెంట్రీ --- సమశిల్పి

నిర్బంధం :

నిర్బంధంలో ఒక కవి 11

ఏకాంతవాస శిక్ష 14

జైలునుండి జైలుకు లేఖ 15

కథ : రేపటి సూర్యుని కోసం — సంపశ 17

గల్పిక : అక్షరాలు ఆయుధాలై భయపెడితే --- తస్నీమ్

చర్చ : త్రిపురనేని వ్యాసం-దొడ్డిదారిలో ఫ్రాయిడిజం — సారధి 24

జైలుకవిత : నాల్గు నెలలు గడిచాక — అనామధేయుడు 36

వ్యాసం : తెహ్రీడామ్ నిర్మాణం-మరో ప్రళయానికి సన్నాహం — సముద్రం 37

సమీక్ష :

ఆధునిక యుద్ధక్షేత్రం 'ద్రోహకాల్'తో ముఖాముఖి — వసీరా 43

యుద్ధం కవిత్వమైనపుడు — రాము 47

మద్దూరు దళిత మహిళల పోరాటం — వాణి 50

లేఖలు 54

విరసం విశేషాలు 59

విరసం కార్యదర్శి :
జి. కళ్యాణరావు
పార్వతమ్మ గుడివద్ద
గంటాపాలెం
ఒంగోలు

'అరుణతార' వర్కింగ్ ఎడిటర్ :
వి. చెంచయ్య
6-5-13
కావలి - 524 201
నెల్లూరు (జిల్లా)

రచనలు, చందాలు వర్కింగ్ ఎడిటర్ అడ్రసుకు పంపాలి

KLVA101M109

సంపాదకీయం

స్వేచ్ఛ అంటే పురోగమనమే!

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం (28.5.95) అనుబంధంలో "స్వేచ్ఛ అంటే ఏమిటి ?" అనే పేరుతో ఓల్గా వ్యాసం అచ్చయింది. ఇది చలం శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ప్రచురింపబడ్డ వ్యాసం. చలం చెప్పిన స్వేచ్ఛ ఎవరికీ అర్థం కాలేదనీ, ఈ విషయంలో ఆయన్ని అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారనీ ఓల్గా నిర్ధారణ చేశారు. చలాన్ని అర్థం చేసుకోలేకపోవడం వల్లనే ఆయనలో వైరుధ్యాలున్నాయని విమర్శకులు భ్రమ పడ్డారనీ తేల్చేశారు.

ఓల్గా వ్యాసానికి రెండు లక్ష్యాలున్నాయి. ఒకటి, స్త్రీవాదిగా ఓల్గా చలం స్వేచ్ఛను వివరించడం. రెండు, మార్క్సిజంపైన దాడి చెయ్యడం లేదా దాన్ని వక్రీకరించడం. మొదటి లక్ష్యం పైకి స్పష్టంగా కనిపిస్తుంది. రెండోది చాప కింది నీరులాగా వ్యాసం అంతా వ్యాపించి ఉన్నా అంత స్పష్టంగా పైకి కనిపించనిది.

"స్వేచ్ఛ ఎంత బయటదో, అంతకన్నా ఎక్కువగా మన లోపలిది" అని ఓల్గా అభిప్రాయపడ్డారు. అంతేగాదు, చలం చెప్పిన స్వేచ్ఛ కూడా ఇదేనన్నారు. స్వేచ్ఛ బయటిది, లోపలిది అని రెండు రకాలుగా కనిపించడం వాస్తవమే. అయితే ఇలా రెండు రకాలుగా ఎందుకు కనిపిస్తుంది? ఓల్గా ఈ ప్రశ్న వేసుకోలేదు. బయటి స్వేచ్ఛ ముఖ్యమే అయినా, అంతటితో ఆగకుండా అంతకంటే ముఖ్యమైన లోపలి స్వేచ్ఛను చూడాలనీ, దాన్నెవ్వరూ పట్టించుకోరనీ, దాన్ని పట్టించుకోడానికి భయపడతారనీ, చలం నిర్భయంగా ఈ లోపలి స్వేచ్ఛ గురించి తపన పడ్డాడనీ, ఇది గొప్ప సాహసమనీ ఓల్గా అభిప్రాయం.

పాలకులు తమ సౌఖ్యం కోసం ప్రజలపైన విధించే నిర్బంధాన్ని అధిగమించే ప్రయత్నాన్ని స్వేచ్ఛ కోసం కోరికగా భావిస్తాం. దీన్నే ఓల్గా బయటి స్వేచ్ఛ అన్నారు. 'అనివార్యంగా' మన లోపల పుట్టుకొచ్చే ఒక కాంక్షా లాలసత్వాన్ని లోపలి స్వేచ్ఛగా వివరించారు. అనివార్యంగా ఎందుకు పుట్టుకొస్తుందో వివరించలేదు. ఈ అనివార్యతను నిర్ణయించే పరిస్థితుల్ని ఓల్గా పట్టించుకోలేదు. పాలక వర్గంగానీ, ఇతర ప్రజానీకం గానీ, ప్రకృతి శక్తులు గానీ మనం కావాలనుకునే స్వేచ్ఛకు అడుగడుగునా అడ్డం పడుతునే ఉంటాయి. అందువల్ల అనివార్యంగా మనం స్వేచ్ఛ కోసం తపిస్తాం. ఈ అనివార్యతను నిర్ణయిస్తున్నది బయటి పరిస్థితులే అనే విషయాన్ని మర్చిపోతే స్వేచ్ఛ బయటిది, లోపలిది అని రెండు రకాలుగా కనిపిస్తుంది. ఒక్కోసారి బయటి పరిస్థితులు అనుకూలంగా ఉన్నా మనపై మనమే కొంత నిర్బంధాన్ని విధించుకుని స్వేచ్ఛను కోల్పోతాం. మనపై మనమే నిర్బంధాన్ని విధించుకోడానికి కూడా బయటి పరిస్థితులే అంతిమంగా కారణమవుతాయి. చిరకాలంగా ఉన్న ఈ బయటి పరిస్థితుల ప్రభావం మనలో జీర్ణించుకుపోయి మనపై మనమే నిర్బంధాన్ని విధించుకునే స్వభావాన్ని కలిగిస్తుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తే ఇబ్బందుల పాలవుతామని ఒక రచయిత

తనంతట తాను అనుకుని 'జాగ్రత్త' పడడానికి కారణం ఇదే. తాను రాస్తున్న సమయంలో ఆ ప్రభుత్వం ఆ రచయిత పైన ఏ నిబంధనలూ పెట్టకపోవచ్చు. కానీ గతంలోనూ, వర్తమానంలోనూ, ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించిన రచయితలపై ప్రభుత్వం అమలుపర్చిన నిర్బంధం గురించి ఆ రచయితకు ఎంతో కొంత తెలుసు. అందుచేతనే తనకు తాను నిర్బంధాన్ని విధించుకొని ప్రభుత్వ విధానాల జోలికి పోకుండా లేదా ప్రభుత్వ విధానాల్ని సమర్థిస్తూ రచనలో తనకు స్వేచ్ఛ ఉందనుకుంటాడు. కొందరి విషయంలో ఇది తెలిసీ, మరికొందరి విషయంలో ఇది తెలియకా జరుగుతుంది. తెలిసీ ఈ పని చేసేవాడు అవకాశవాది, తెలియక ఈ పని చేసే వాడు అజ్ఞాని. ఇదే గతి తార్కిక పరిశీలనా విధానం.

దౌర్జన్యంగా ప్రత్యేక ప్రయోజనాల్ని పొందుతున్న పాలక వర్గం, తమపై తిరగబడకుండా ఉండడం కోసం ప్రజల్ని ఎప్పుడూ భ్రమల్లో పెడుతూనే ఉంటుంది. సమస్యల్ని సులభంగా అర్థం చేసుకోడానికి వీల్లేకుండా క్లిష్ట వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తుంది. తరతరాలుగా సాగిన ఈ ప్రయత్నమే స్వేచ్ఛ లోపలిది, బయటిది అని రెండు రకాలుగా భ్రమింప చెయ్యడం. సాధారణంగా ఈ లోపలి స్వేచ్ఛ గురించి ఆధ్యాత్మికవాదులు చెప్తుంటారని ఓల్గా కూడా గుర్తించారు. తనను గురించి తాను తెలుసుకోవాలి. మనిషి అంతర్ముఖుడు కావాలి- ఇలాంటి మాటల ద్వారా ఆధ్యాత్మికవాదులు ఈ లోపలి స్వేచ్ఛ గురించి ప్రస్తావిస్తారు. ఆధ్యాత్మికవాదం కూడా వాస్తవాన్ని మరుగుపర్చి, భ్రమల్లో ఉంచేదేగదా ! పరిస్థితులు మారి, బయటి స్వేచ్ఛ, లోపలి స్వేచ్ఛ అనే తేడా పోయి, ఆ రెండూ ఒకటయినప్పుడు నిజమైన స్వేచ్ఛను అనుభవించగలం. అప్పుడు స్వేచ్ఛ ఒకటే. అంటే అంతవరకు లోపలిది, బయటిది అని రెండు రకాలుగా కనిపిస్తున్న ద్వంద్వ స్థితి పోయిందన్న మాట. వర్గ వ్యవస్థ ఉన్నంతవరకూ ఇది సాధ్యం కాదు. వర్గాలు నశించిపోయిన వ్యవస్థలోనే ఇది సాధ్యం అవుతుంది. కాబట్టి స్వేచ్ఛను రెండు రకాలుగా చెప్పడం వర్గ వ్యవస్థ మనకు కలిగించిన భ్రమ. ఇది అమార్క్సీయం. ఎందుకంటే అవాస్తవం కాబట్టి.

ఇంతకూ ఈ స్వేచ్ఛ గురించి చలం దృక్పథం ఏమిటి ? "లోపల స్వేచ్ఛ ఉన్నవాడికి బైట స్వేచ్ఛతో పనిలేదు. అతనికి అంతా స్వేచ్ఛే. బైట స్వేచ్ఛ కావాలంటే ముఖ్యమైన అవసరం డబ్బు". "అందరం సమానం కావాలంటే బయట ఉన్న వ్యత్యాసాలతో కాదు మీరు పోట్లాడవలసింది, మీలో ఉన్న వ్యత్యాసం- ధనవంతుడికి, బీదవాడికి ఉన్న, మీ మనస్సులో ఉన్న వ్యత్యాసంతో మీరు పోట్లాడాలి"- ఇదీ చలం అభిప్రాయం. ఇందులో మన దృష్టిని ఆకర్షించేవి మూడు అంశాలున్నాయి. మొదటిది లోపల స్వేచ్ఛ ఉన్నవాడికి బైట స్వేచ్ఛతో పని లేదనేది. రెండోది బైట స్వేచ్ఛను డబ్బుతో సంపాదించుకోవచ్చునేది. మూడోది ధనవంతుడికి, బీదవాడికీ ఉన్న వ్యత్యాసాన్ని పోగొట్టాలంటే బయట ఉన్న వ్యత్యాసాలతో కాదు పోట్లాడవలసింది, మనస్సులో ఉన్న వ్యత్యాసాలతోననేది. ఓల్గా వ్యాసాన్ని బట్టి చలం చెప్పిన ఈ మూడంశాలతోనూ ఓల్గా ఏకీభవించడం లేదు. అదే సమయంలో స్వేచ్ఛ విషయంలో చలం అభిప్రాయాలూ, తన అభిప్రాయాలూ ఒకటే అని కూడా భ్రమింపజేస్తున్నారు. చలం బైట స్వేచ్ఛను పూర్తిగా కొట్టేస్తున్నాడు. ఓల్గా బయట స్వేచ్ఛను అంగీకరిస్తూనే, లోపల స్వేచ్ఛను కావాలంటున్నారు. బైట స్వేచ్ఛను డబ్బుతో సంపాదించుకోవచ్చని చలం అంటున్నాడు. బైట స్వేచ్ఛను పోరాడి సాధించుకోవాలని ఓల్గా అంటున్నారు. బయట వ్యత్యాసాలతో కంటే మనసులో ఉన్న వ్యత్యాసాలతో పోట్లాడాలని చలం. వ్యత్యాసాల విషయం ప్రస్తావన సూటిగా రాకపోయినా, రెండు రకాల వ్యత్యాసాలతో పోట్లాడాలనే అభిప్రాయాన్ని కలిగించారు ఓల్గా. కాబట్టి చలం స్వేచ్ఛ వేరు, ఓల్గా స్వేచ్ఛ వేరు అనిపిస్తుంది. మరికాస్త

లోతుగా ఆలోచిస్తే ఇది కూడా నిజం కాదని అర్థమవుతుంది. వాస్తవానికి చలం అభిప్రాయాలే ఓల్గా అభిప్రాయాలు. బైట స్వేచ్ఛను పూర్తిగా కాదనగల 'సాహసం' చలానికుంది. ఆ 'సాహసం' ఓల్గాకు లేదు. అందుకే ఈ డొంకతిరుగుడు.

దేవుడు, బ్రహ్మ సమాజం, నిరీశ్వరవాదం, నాస్తికత్వం, జాతీయోద్యమం, కమ్యూనిజం - చలం వీటన్నిటినీ పరీక్షించి వదిలేశాడనీ, ఏ ఒక్క ఆధారమూ లేకుండా స్వతంత్రంగా ఆలోచించాడనీ, దానికి చాలా సాహసం కావాలనీ ఓల్గా అంటున్నారు. చలం పై ఆధారాలన్నిటినీ వదిలేశాడన్నది నిజం. అందుకే చలంలో గందరగోళం ఏర్పడింది. అందుకే అంత సులభంగా చలం అర్థంగాడు. ఓల్గా కూడా ఈ విషయాన్ని గుర్తించారు. అయితే అలా ఉండడం సరైందని ఓల్గా నమ్ముతున్నారు. ఇక్కడ చలంతోనూ, ఓల్గాతోనూ పూర్తిగా విభేదించాల్సి వస్తుంది. ఏ ఆధారమూ లేకుండా ఆలోచించడమంటే ఏ దృక్పథమూ లేకుండా ఆలోచించడమనే. ఏ దృక్పథమూ లేకుండా ఆలోచించడం అరాచకవాదానికి దారి తీస్తుంది. నిత్యజీవితంలో మనం చేసే చిన్న చిన్న పనులకే ఒక లక్ష్యం, పద్ధతి ఉంటాయి. ఇక సామాజిక, తాత్విక విషయాలను గూర్చి ఆలోచించేటప్పుడు దృక్పథం లేకుండా ఎలా ఉంటుంది? ఇక్కడ మరో విషయం స్పష్టం చెయ్యాలి. ఏదో ఒక దృక్పథంతో ప్రపంచాన్ని పరిశీలించమని నేననడం లేదు. ఆ దృక్పథం గతితార్కిక దృక్పథం అయి ఉండాలి. ఈ గతితార్కికం అనేది మార్క్స్ సొంతంగా కనిపెట్టింది కాదు. ప్రకృతిలో ఉన్న వాస్తవం. తన నాటికున్న విజ్ఞాన శాస్త్ర ఫలితాలనాధారంగా, ఫ్రాన్స్‌లో జరిగిన వర్గ పోరాటాలు భూమికగా, జర్మన్ తత్వ శాస్త్రానికి గుణాత్మకమైన మార్పుగా అదివరకే లోపభూయిష్టంగా ఉన్న గతితర్కాన్ని సమాజానికి సరిగ్గా అన్వయింపజేసిన గొప్ప తాత్వికుడు మార్క్స్. ఇప్పటికి మార్క్సిజం పుట్టి ఒకటిన్నర శతాబ్దాలే అయినా ప్రపంచవ్యాప్తంగా విశేషంగా ప్రభావాన్ని కలిగించింది. ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోవాలో నేర్పింది. ఎలాంటి చిక్కుముడినైనా విప్పగలిగే నైపుణ్యాన్ని మానవజాతికి అందించింది. పీడిత వర్గమైన శ్రామిక వర్గం చేతిలో బలమైన ఆయుధమయింది. తన విముక్తినేగాక అన్ని వర్గాల ప్రజల విముక్తినీ సాధించగలిగిన శక్తి శ్రామికవర్గానికుందని నేర్పింది. అందువల్ల అనేక దృక్పథాలలో గతితార్కిక దృక్పథం ఒకటి కాదు అన్ని దృక్పథాలలోని మంచి చెడ్డల్నీ, పరిస్థితుల్నీ, ఉద్దేశాల్నీ విశ్లేషించి వివరించగలిగింది గతితార్కిక దృక్పథం. మానవజాతి చరిత్రలో ఇదొక్కటే శాస్త్రీయ దృక్పథంగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. కాబట్టి ప్రపంచాన్ని పరిశీలించడానికి ఈ ఆధారం తప్పనిసరి. ఇలా ఆధారం ఉండాలని చెప్పడం వల్ల విప్లవాన్ని మతంతో సమానంగా పోలుస్తున్నారు ఓల్గా. మతాన్ని నమ్మేవాళ్ళు ఎంత గుడ్డిగా ఉంటారో, విప్లవాన్ని చేసేవాళ్ళూ అంత గుడ్డిగా ఉంటారని ఓల్గా అభిప్రాయం. మతానికున్న ఆధారాన్నీ, విప్లవానికున్న ఆధారాన్నీ ఒకటిగా భావించడం ఓల్గా అవగాహన లేని పెద్ద లోపం. చలంలోనూ, స్త్రీవాదుల్లోనూ ఈ సిద్ధాంత వ్యతిరేకత సామాన్య అవలక్షణం.

కమ్యూనిజం భౌతిక బాధల్ని పోగొడుతుందని చలం అంగీకరిస్తాడు. అయితే దానికంటే ఇతరమైన విలువల్ని గుర్తించదంటాడు. ఆ ఇతరమైన విలువలలో వ్యక్తి స్వాతంత్ర్యం ఒకటి. ఈ వ్యక్తి స్వాతంత్ర్యానికీ, భౌతిక బాధలకీ సంబంధమే లేదనుకోవడం అశాస్త్రీయం. తన భావాలనీ, శరీరాన్నీ పాలక వర్గానికి తాకట్టుపెట్టినవాడికి వ్యక్తి స్వాతంత్ర్యం ఉన్నట్టే అనిపిస్తుంది. ఆనంతట తాను తాకట్టు పెట్టవలసిన దుస్థితిలో ఉండడం స్వాతంత్ర్యం లేకపోవడం అనే విషయం కాస్త ఆలోచిస్తే తెలియంది కాదు. తిండికీ, ఓటుకీ, మాటకీ కాదు స్వాతంత్ర్యం కావలసింది, వాటికి మించిన స్వాతంత్ర్యం

కావాలంటాడు చలం. అదెలాంటిదో కూడా వివరిస్తాడు. "నా తోవన నేనుంటే, నా జోలికి ఎవరూ రాని, దేనికీ బలవంతం లేని స్వతంత్రం కావాలి". ఈ వర్గ వ్యవస్థలో ఇది సాధ్యమవుతుందా ? పోనీ దీన్ని ఎలా సాధించుకోవాలో చెప్పాడా చలం? అసంతృప్తికీ, అశాంతికీ ఉన్న భౌతిక కారణాలను తెలుసుకోలేనప్పుడు మనిషి ఖచ్చితంగా అంతర్ముఖుడవుతాడు. ఆ స్థితిలో ఉన్న మనుషులకు ఏ 'ఆధారమూ' లేకుండా చలం చెప్పిన విషయాలు బాగా నచ్చుతాయి. ఆ మనుషుల్లో ఉన్న అసంతృప్తికీ, అశాంతికీ ఇవి పరిష్కారాన్ని చూపలేవు. చలం నిజంగానే ఆ అసంతృప్తికీ, అశాంతికీ గురయ్యాడు. కానీ ఓల్గా అలా గురయ్యిందని చెప్పలేం. ఒక అసంతృప్తితో, అశాంతితో, భావావేశంతో కొట్టుకుపోయి చలం మార్క్సిజాన్ని వ్యతిరేకిస్తే తెలిసీ, సాలోచనగా ఓల్గా మార్క్సిజాన్ని వ్యతిరేకిస్తున్నారు. మార్క్సిజాన్ని వ్యతిరేకించే హక్కు ఆమెకుండవచ్చు. కానీ ఏ ఆధారమూ లేకుండా ప్రపంచాన్ని పరిశీలించిన చలాన్ని ఆధారంగా చేసుకుని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు.

స్వేచ్ఛతో దగ్గరి సంబంధం ఉన్న మరో భావం ఆనందమనీ, ఈ ఆనందాన్ని పొందటమంటే నేరం చేసినట్టుగా భావిస్తారనీ, మన శరీరాలతో, మనసులతో ఎంతో ఆనందాన్ని పొందవచ్చుననీ, ఈ ఆనందం గూర్చి తెలియజెప్పిన మొదటి తెలుగు రచయిత చలం అనీ ఓల్గా అన్నారు. చలం ఈ విషయాన్ని చెప్పాడనడంలో సందేహం లేదు. ఏ లక్షణం చలం బలంగా ఓల్గా చెప్తున్నారో నిజానికి ఆ లక్షణమే చలం బలహీనత. మన మనసులతో మనం ఎంత ఆనందాన్ని పొందినా అది ఇతరుల ఆనందానికి భంగకరం కాదు. కానీ మన శరీరాలతో పొందే ఆనందం ఈ వర్గ వ్యవస్థలో ఖచ్చితంగా ఏదో మేరకు ఇతరుల ఆనందానికి భంగకరం అయి తీరుతుంది. తనకిష్టమైన వాటిని అనుభవించాలనే కోరిక చాలా మందికి ఉండవచ్చు. కానీ అందరి కోరికలూ తీరవు. ఆ తీర్చుకునే క్రమంలో మనుషుల మధ్య ఘర్షణ ప్రారంభమవుతుంది. ఈ ఘర్షణలో అమాయకులూ, బలహీనులూ నష్టపోతారు. మన చట్టాలు కూడా ఎక్కువ సందర్భాల్లో బలవంతులకే ఉపయోగపడతాయి. భౌతిక సుఖాలతో సంబంధం లేని మానసిక సుఖాలు ఊహలకు సంబంధించినవే అయి ఉండాలి. ఆ ఊహల వల్ల పొందే ఆనందం భ్రమాజనితమైందైనా కావాలి లేదా ఒకనాటి భౌతిక సుఖాలను స్మరించుకోవడం వల్ల కలిగేదైనా కావాలి. తన మనసులో కలిగిన కోరికను ధర్మాధర్మ, న్యాయాన్యాయ విచక్షణ లేకుండా తీర్చుకోవడాన్నే రసికత అని రాయలనాటి రసికతను వివరిస్తూ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చెప్పిందానికీ, చలం ఓల్గాలు చెప్తున్న దానికీ తేడా కనిపించడం లేదు. ఇందులోని సామంజస్యాన్ని ఓల్గా ఇంకా వివరించవలసే ఉంది. ఎవరికీ కష్టం కలగకుండా చెయ్యగలిగిన పని ఒక్కటుందా ఈ లోకంలో ? అని చలమే మరో సందర్భంలో అంటాడు. దీన్ని ఓల్గా ఒప్పుకుంటారా ? సమాజం, వ్యవస్థ, ఉత్పత్తి విధానం, మానవ సంబంధాలు, పరిసరాలు, ప్రకృతి పరిణామాలు, పరస్పర విరుద్ధమైన మానవ స్వభావాలూ, కోరికలూ - వీటన్నిటిని దృష్టిలో పెట్టుకోకుండా అసలు ఆనందమనే దాన్ని ఎలా నిర్వచిస్తాం ? ఏ కండిషనూ లేని ఆనందం ఎక్కడయినా ఉంటుందా ? ఉండదనేది వాస్తవం. ఈ వాస్తవాన్నే మార్క్సిజం చెబుతుంది.

"ఇది నాకుబాగుంది ఆనందాన్నిస్తుంది ఈ పనిచేయాలనే ఆపుకోలేని కాంక్ష పుట్టుకొస్తోంది" అని చెప్పడానికి భయపడనవసరం లేదని చెబుతూ, అది మన ఆనందం కోసంగాక బాధ్యత పేరుతో, త్యాగం పేరుతో చెయ్యడానికి అలవాటుపడి ఆ పనిలోని ఆనందాన్ని చంపేసుకుంటున్నామని అంటారు ఓల్గా. ఇక్కడ చాలా తెలివిగా విషయాన్ని తిరగేసి చూపించారు. పాలక వర్గం హింస చేస్తుంటే దాన్ని ఆపడానికి విప్లవకారులు ప్రతిహింస చేస్తారని సాధారణంగా చెప్పే విషయాన్ని 'పీపుల్స్

ఎన్‌కౌంటర్' సినిమాలో రామోజీరావు, విప్లవకారులు చేసే హింసను ఆపడానికి పాలక వర్గం ప్రతిహింస చేస్తుందని తిరగేసి చెప్పినట్టుగా ఇక్కడ ఓల్గా చెబుతున్నారు. బాధ్యత, త్యాగాలతో సంబంధం లేకుండా మన ఆనందం లక్ష్యంగా చేసే పనివల్ల స్వేచ్ఛకూ, బాధ్యతకూ, ఆనందానికీ, త్యాగానికీ ఉన్న సంబంధం వ్యక్తం అవుతుందంటారు ఓల్గా. దీన్ని ఇలా కాదు చెప్పవలసింది. బాధ్యతతో, త్యాగంతో చేసే పని విధానంలో నిజమయిన ఆనందం, నిజమైన స్వేచ్ఛా ఉంటాయని చెప్పాలి. మార్క్సిజం ఇలా చెబుతుంది. మార్క్సిజం ఇలా చెప్పడం వల్ల అది నిజమయిన ఆనందాన్నీ, స్వేచ్ఛనీ గుర్తించడం లేదని చెప్పడం సరికాదు. నిజమయిన ఆనందం, స్వేచ్ఛ కోసమే మార్క్సిజం అలా చెబుతుందని గ్రహించాలి. త్యాగం పేరుతో ఒక పనిని చెయ్యడాన్ని ఓల్గా చిన్న చూపు చూస్తున్నా, చలం అలా చూడ్డంలేదు. కమ్యూనిస్టులు చెప్పే "గుడ్డి చిలుక పలుకులు" ఏవగింపుగా భావించే చలం కూడా వాళ్ల త్యాగాన్ని చూసినపుడు వాళ్ళ పాదాల ముందు తన శిరసు వొంగుతుందంటాడు. కమ్యూనిస్టుల్లోని ఇతర అన్ని విషయాలనూ తిరస్కరించినా, కనీసం వాళ్ళ త్యాగానికి విలువిస్తున్నాడు చలం. ఓల్గా ఆ త్యాగానికి కూడా విలువివ్వడం లేదు.

"నా కిప్పుడిది మంచిదనిపిస్తుంది" అని చలం చాలాసార్లు అనేక విషయాల గురించి అంటే అది మనకు వైరుధ్యంలా కనిపించినా, నిజమైన జ్ఞాన సాధనలో బలం అక్కడి నుంచే వస్తుందని ఓల్గా అంటారు. అంతేగాదు జ్ఞానాన్ని పోషించేదీ, పెంచేదీ ఈ స్వేచ్ఛా ప్రియత్వమే నంటారు కూడా. అంటే ఎప్పటికేది మంచిదనిపిస్తే, అది చెయ్యడమే స్వేచ్ఛా ప్రియత్వమని ఓల్గా అభిప్రాయం. ఎప్పటికేది మంచిదనిపించడానికి ప్రాతిపదిక ఏమిటో చెప్పడంలేదు. ఊరికే రోజు రోజుకూ అభిప్రాయాలు మారవు గదా ? అలా మారడానికి కొన్ని భౌతిక పరిస్థితులుండాలి. భౌతిక పరిస్థితుల్లో ఏ మార్పూ లేకుండా కేవలం మన మనస్సులోనే మార్పు రావడం పాక్షికమే. మన మనసులో వచ్చే మార్పులకు బయటి పరిస్థితుల ప్రమేయంలేకుండా ఎలాఉంటుంది ? సమాజానికి దూరంగా ఎక్కడో లేముగదా మనం ? సమాజంలో భాగంగా ఉన్న మనలో వచ్చే మార్పులకు తప్పనిసరిగా సమాజంలోని అనేక అంశాలు ఆ యా సందర్భాలలో ప్రేరణలవుతాయి. మరొక విషయం ఏమిటంటే జ్ఞానానికి మూలం ఆచరణ. యుగయుగాలుగా మానవుడి ఆచరణ కారణంగానే అతని జ్ఞానం పెరుగుతూ వచ్చింది. ఆచరణ, జ్ఞానం అనేవి పరస్పర ప్రభావితాలు. జ్ఞానం గూర్చి మాట్లాడేటప్పుడు ఓల్గా ఆచరణ గురించి చెప్పకుండా, కేవలం 'మనసుకు మంచిదనిపించటం' అనే అంశాన్నే గుర్తిస్తున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే చలం వ్యక్తిగత స్వేచ్ఛావాది. సిద్ధాంతాలు, సంస్థలు, పార్టీలు అన్నీ సంకెళ్ళులాగా కనిపిస్తాయి చలానికి. ఈ 'సంకెళ్ళ'ను ఎప్పటికప్పుడు ఛేదించుకుంటూ పోవడమే అతని కార్యక్రమం. తన జీవితంలోనూ, సాహిత్యంలోనూ ఈ పనే చేశాడు చలం. కట్టుబాట్లూ, నియమ నిబంధనలూ లేని సమాజాన్నీ, లేదా ఒక సంస్థనీ, సిద్ధాంతాన్నీ ప్రస్తుతం మనం ఊహించలేం. అర్థరహితమైన, దారుణమైన నియమ నిబంధనల్ని మార్చుకోడానికి ప్రయత్నం చెయ్యాలిగాని, ప్రస్తుత సమాజంలో అసలు ఏ నియమాలూ అక్కర్లేదని అనడం, ఎవరి చిత్తానికి తోచిన విధంగా వారు ప్రవర్తించడం అరాచకానికిగాక మరి దేనికి దారితీస్తుంది? సంపూర్ణ ఆదర్శ మానవుడు తయారయిన్నాడు బహుశా చలం చెప్పిన స్వేచ్ఛ సాధ్యమవుతుందేమో? దాన్ని సాధించడానికయినా సిద్ధాంతాలూ, సంస్థలూ, నియమాలూ అవసరమే గదా !

చలం దృష్టిలో ఏకత్వం, సమానత్వం అనేవి సృష్టి సూత్రానికే విరుద్ధం. మరి అనేకత్వంతో,

అసమానత్వంతో శాశ్వతంగా ఉండడమే సృష్టి సూత్రమా ? సృష్టి సూత్రం అన్న చలం మాటను ఇవాళ మనం ప్రకృతి సూత్రం అనడం సమంజసం. నిజానికి పురోగమనం వైపు ప్రయాణించడమే ప్రకృతి సూత్రంగా మనం సులభంగా గ్రహించడానికి ప్రకృతే మనకు ఆధారం. ప్రకృతి సూత్రాలే మానవ సమాజానికి కూడా వర్తిస్తాయి. అంటే మానవ సమాజం కూడా క్షణ క్షణం పురోగమిస్తూనే ఉంటుంది. దోపిడిలేని వర్గ పూర్వ సమాజం ఒకటుంది. మానవుడు జ్ఞానం సంపాదించడం ప్రారంభించింతర్వాత, ఆ కారణంగా ఉత్పత్తి పెరిగింతర్వాత అంటే అదనపు ఉత్పత్తి రాసాగింతర్వాత అదనపు విలువను దోచుకొనే దోపిడి వర్గం తయారైంది. బానిస, భూస్వామ్య వ్యవస్థల్లోని నగ్నమైన దోపిడిని శ్రామిక వర్గం ఎదుర్కోవడం కారణంగా దోపిడీవర్గం దోపిడి విధానంలో మార్పులు తెచ్చింది. శ్రామికవర్గానికి కొన్ని విషయాలలోనైనా రాయితీలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొంతవరకైనా ఇవ్వక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది దోపిడి వర్గానికి. సుదీర్ఘమైన మానవజాతి చరిత్రలో ఇంతవరకూ ఏ హక్కులూ, సౌకర్యాలూ సాధించుకోలేదా ? ఇదంతా ఏకత్వంవైపు, సమానత్వం వైపు ప్రయాణించడం కాదా ? ఏకత్వం, సమానత్వం అనేవి ఎప్పటికప్పుడు సాపేక్షికాలే. నిన్నటి కంటే ఇవాళ, ఇవాల్టి కంటే రేపు ఎక్కువ సమానత్వాన్ని సంపాదించే ప్రయత్నమే గదా మానవుడు చేస్తున్నది ? తరతరాలుగా చేస్తున్న పోరాటాల విప్లవాల వల్లనేగదా కొంతైనా మెరుగైన జీవితాన్ని సాధారణ మానవుడు పొందగలుగుతున్నది ? కమ్యూనిజం వల్ల ఈ భూమ్మీద సంపూర్ణ సుఖం ఏర్పడుతుందనుకోవడం స్వర్గానికి పోతామని అనుకోవడం లాంటిదే చలం దృష్టిలో. పోనీ చలం కోరుకునే స్వేచ్ఛా ప్రభుత్వం వల్ల ఈ భూమ్మీద ఎలాంటి సుఖాన్ని కోరుకుంటున్నాడు ? ఆయనకున్న ప్రణాళిక ఏమిటి ? ఈ ప్రశ్నలు వెయ్యడం న్యాయం కాదా ? ప్రస్తుతానికయినా సరే ఒక కనీసపు ఆలోచనా విధానాన్నీ, ఒక ప్రణాళికనూ చెప్పాలి గదా ? ప్రకృతిని తన కనుకూలంగా మార్చుకోవడం గానీ, సమాజాన్ని ఉన్నదానికంటే ఉన్నతంగా మార్చడంగానీ ప్రయత్న పూర్వకంగా, నిర్మాణాత్మకంగా ఒక క్రమపద్ధతిలో చెయ్యగలిగిన జీవి మానవుఢు మాత్రమే. మానవుడు మాత్రమే సమాజంలోని పురోగమనాన్ని క్రమబద్ధమే గాదు, వేగవంతం కూడా చెయ్యగలుగుతున్నాడు. ఇది చరిత్ర మనకు రుజావు చేసిన సత్యం.

చివరగా ఒక మాట. పాత ప్రశ్నలతో, పాత సమాధానాలతో సంతృప్తిపడి దబాయించి బతకడానికి కాలం చెల్లింది ఇవాళేకాదు, గతంలో కూడా. మతం, దేవుడు, ఆచారాలు, పోరాటాలు- అన్నీ ఎప్పటికప్పుడు కొత్త ప్రశ్నల్నీ, కొత్త సమాధానాల్నీ వెతుక్కుంటూనే ఉన్నాయి. పురోగమనం లేని మూల సూత్రం ఇదే. ఇది చలంతో వచ్చిందీ కాదు, చలంతో పోయేదీ కాదు.

-వి. చెంచయ్య

యోధుడా కౌగిలించుకోనీ

(కవితా సంపుటి)

మానేపల్లి

రైటర్స్ వర్క్‌షాప్ ప్రచురణ

వెల : రు. 25

కాపీలకు : ప్రగతి బుక్ హౌస్, మ్యూజియం రోడ్, విజయవాడ - 2

కవిత

"నిజం"

వాడు నిజాన్ని నమ్మడు
ప్రగతిని సాధించాలంటే పాతబడిన పాఠ్యాంశాలతోనే అంటాడు
పుచ్చిన పురాణాలే నాదేశ పురోగమనం అంటాడు
వాడు నిజాన్ని నమ్మడు
మతాల మారణహోమాన్ని సృష్టించి
దానిని వయినంగా ఇచ్చి పుచ్చుకుంటాడు
జనాన్ని జంగిల్‌లో వదిలేసి
జనజీవన స్రవంతిలో కలవమంటాడు
వాడు నిజాన్ని నమ్మడు
సినిమాల్లో హింసను సెక్స్‌ను మిక్స్ చేస్తే
అది "ఉత్తమ విలువలు" కలిగి ఉంటుంది !
వాస్తవ సంఘటనలను చూపిస్తే వాడు వాంతి చేసుకుంటాడు
వాడు నిజాన్ని నమ్మడు
పెరుగుతున్న ధరల్ని మాటల పేరడీతో ఆపాలనుకుంటాడు
రగులుతున్న అడివిని వాగ్దానపు జల్లులతో ఆర్పాలనుకుంటాడు
వాడు నిజాన్ని నమ్మడు
తుమ్మును కూడ తన తమ్ముని చేసుకుని
మూఢనమ్మకాల ముసుగును తొడుక్కుంటాడు
నిజం నిప్పులాంటిదని తెలిసికూడ
వాడు అబద్ధాన్ని అరువు తెచ్చుకుంటాడు
వాడు నిజాన్ని నమ్మడు
ప్రజాస్వామ్యం పేరుతో ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడతాడు
దున్నేవాడిది భూమికాదు, తన్నేవాడిదే భూమి అంటాడు
వాడు నిజాన్ని నమ్మడు
ప్రజల కనీసపు అవసరాలు వాడికి అవసరం లేదు
21వ శతాబ్దంలోకి ఈడ్చుకొని వెళ్ళడం వాడికి అవసరం
ప్రజాస్వామ్యపు విలువలు, ప్రజల హక్కులు వాడికి అవసరం లేదు
ఉక్కుపాదాల ఉనికిని కాపాడుకోవడం వాడికి అవసరం
ఈ నిజం విప్లవధ్వజం - ఈ నిజం ప్రజల నైజం
పోరాట పటిమను పోగు చేసుకుని
నిజాన్ని నిలుపుకుందాం రండి !

-మేఘ

చింతచెట్టు

[మహబూబ్‌నగర్ జిల్లా కొల్లూరు మండలంలో కాకర్జాల అనే గ్రామం. ఇక్కడ 'రాజు' అనే అగ్రకులస్థుడు సర్వాధికారాలు చెలాయిస్తుంటాడు. సర్పంచ్ హరిజనుడు. ఆయన అధికారం నామమాత్రం. ఆ గ్రామంలో ఓ చింతచెట్టు కింద పంచాయితీ జరుగుతుంటుంది. పంచా యితీ అంటే ఎదురు తిరిగినవాళ్లకు గుణపాఠమన్నమాట. ఒకసారి APCLC తో బాటు అక్కడికి వెళ్లినప్పుడు స్పందించి ....]

మా ఊరి చింతచెట్టు
మా బతుకులమీద గొడ్డలిపెట్టు ..
మా కదలికల్ని కనిపెట్టే కాలనాగు
మా కలల్ని తుడిచేసే శిలాశాసనం....
ఊరికావలోడు డప్పుగొట్టి
'అందరూ చింతచెట్టుకాడికి రండహో ' అంటే చాలు
ఊరిపిల్లలకు ఉచ్చలుబడుతాయి
వయసుపోరలకు వొణుకు పుడుతుంది...
ఆడవాళ్లు అందిన దేముళ్లకు మొక్కుకుంటుంటే
ముసలోళ్లు కాలం మీద శాపాల్ని విసురుతారు

★ ★ ★

ఈ చెట్టుకిందే మా 'రాజు' గారు కొలువు దీరేది
మా బతుకులు బండబారేది
ఇక్కడే
మేమెంత తక్కువోళ్లమో
మేమెంత తెలివితక్కువోళ్లమో
పదేపదే గుర్తు జేయబడ్తుంది....
మా బానిసత్వం ముందుకు పొడిగింపబడ్తుంది...
మేమిక్కడే, ఆయన పాదాల దగ్గరే బతుకులనర్పించుకుంటాము
ఆయన పట్ల ప్రకటించే భక్తిలో మా బతుకు భద్రతను కొల్చుకుంటాము
ఆయన కంటికొసల రాలే నిప్పురవ్వల్లో మమ్మల్ని మేమే కాల్చుకుంటాము
ఆయన ఆ చెట్టుకింద తీర్పు చెబితే అది కోర్టు హాలవుతుంది
ఆయన చేతికి దుడ్డు కర్రవొస్తే అది లాకప్ గది అవుతుంది
ఏ విలువలూ బతికి బట్టకట్టవు
ఏ ఆక్రందనలకీ జవాబులుండవు...
అన్నింటికీ ఆయనే సమాధి
ఆయనే మాకో చట్టం, మాకో రాజ్యాంగం
ఆయన మాకు బడిని దూరంజేసిన ఘనుడు...
ఊరి పొలిమేరల్దాకాదేక్కుంటూ వొచ్చిన ప్రజాస్వామ్యాన్ని

ఉరిమి చూసి తరిమికొట్టిన 'విజ్జుడు'
ఆ చింతచెట్టునే గుడిని జేసుకు మమ్మేల్నేలుతున్న 'దేముడు'

★ ★ ★

ఆ చెట్టు సాక్షిగానే అప్పులడిగినోళ్లు అడుగంటిపోయేరు
కూలి పెంచమన్న 'దొంగనాకొడుకులు' ఇళ్లకు తాళాలేసి వెళ్లిపోయేరు
కనుబొమలెగరేస్తే అవి కత్తిరించబడ్డాయి.
తెల్లబట్టలు తొడిగితే, తెల్లదనాన్ని పొగిడితే
చిక్కటి తారుచీకటిలో మేము ముంచబడ్డాము.
ఎదురు తిరిగిన ఏ ముండాకొడుకైన ఏడు చెర్వుల నీళ్లు తాగి చచ్చేడు
ఈ చెట్టుకిందే మా బాల్యాలు రాలిపోయేయి
మా యౌవనాలు రక్తాలుగక్కాయి
మా వృద్ధాప్యాలు కళ్లలోకి జారి భూమ్మీద నిర్వేదంగా పొర్లాడాయి.
ఎన్నెన్ని అఘాయిత్యాలను జూసిందో
ఎన్నెన్ని అనుభవాలను పెనవేసిందో
ఈ చింతచెట్టు మా ముసలవ్వలాగే ముడుతలుబడి
ఆకు ఆకును ఒక జీవనవేదం జేసి
ఒక సవాలు చేయబడని అధికారానికి సాక్షియై
ఒక సర్ప పరిష్వంగంలో గిలగిల కొట్టుకునే కాలానికి సంకేతమై
అట్లా మా ఊరి బయట పాతుకుపోయింది
మా జీవితాల్లో ఒక భాగమయింది
అందుచేతనే
'చింతచెట్టుకు అప్పగిస్తామంటే' చాలు
పసివాళ్లు బుద్ధిగా అన్నం తింటారు...
'చింతచెట్టుకాడ పెళ్లి' అంటే చాలు
ఊళ్లో నవ్వులు మాయమవుతాయి...
వెన్నెల్లో పువ్వులు సైతం తలలు వాల్చేస్తాయి..
పక్కలో పాము జేరినట్లు ఒళ్లు జలదరిస్తుంది...

★ ★ ★

అందుకేనేమో నాకే చెట్టు జూసినా
తిరిగీ తిరిగీ చింతచెట్టే స్ఫురిస్తుంది
తిరిగీ తిరిగీ అదే దృశ్యం సాక్షాత్కరిస్తుంది.
అందుకేనేమో నాకు నిద్రలో సైతం పిడికిలి బిగుసుకుంటుంది..
చింతచెట్టు భగ్గున మండుతున్నట్టూ
ఆ మంటల చుట్టూ ఊరు ఊరంతా చలిగాసుకుంటున్నట్టూ
ఓ కల నన్ను వెంటాడుతుంటుంది.......................

-ఉదయమిత్ర

అత్తా! అబద్ధం చెప్పవు కదూ

బుగ్గల మీద చారికలు కట్టిన కన్నీటి సాక్షిగా
తన బుల్లి బుల్లి చేతులు నావైపు చాపి
'అత్తా ! నువ్వు అబద్ధం చెప్పవుకదూ' అన్నాడు.
తడబడ్డాను, తడువుకున్నాను.
పెగలని మాటల కోసం వెతుక్కున్నాను.
"అమ్మ మళ్ళీ తరువాత వస్తానందిరా కన్నా"
అని చెప్పబోయిన అబద్ధం అలాగే
గడ్డకట్టిపోయింది.
"మీటింగ్ ఉందని రాలేదు", "రేపు వస్తుంది
లేరా"
"ఎల్లుండి వస్తానందిరా" అని అందరిలాగే
నువ్వూ అబద్ధాలు చెప్పవుకదూ అత్తా అని
రెట్టించాడు.
పొట్టి చేతుల చొక్కా అంచులు కన్నీటిలో అద్ది
నా కళ్ళల్లో దేనికోసమో ఆశగా వెతుక్కుంటూ
దీనంగానే అయినా ధైర్యంగా
దుఃఖంగానే అయినా స్థిరంగా
ఆర్తిగానే అయినా ఆత్రంగా
"అసలమ్మ కేమైందత్తా" అన్నాడు మళ్ళీ.
గుండె చప్పుడు నా స్వర పేటిక మీద
ప్రతిధ్వనిస్తూండగా
"పెన్న సాక్షిగా, అమ్మ మనకిక లేదురా కన్నా"
అన్నాను.
నా కళ్ళు జ్ఞాపకాల కొండని ఢీకొని
కన్నీటి కెరటమై విరిగిపడ్డాయి.
ఆ పసికళ్ళ ముందు కష్టపడి నన్ను నేను
దాచుకునేందుకు
కళ్ళు మూసుకున్నాను
నా మూసిన కనురెప్పల వెనుక
ఆఖరిసారి ముఖమైనా చూడనివ్వని పోలీసుల
కిరాతకం
చిత్రహింసలకు పరాకాష్టగా
పెకలించిన కనుగుడ్డు, కోసివేసిన వక్షస్సు
పగిలి నెత్తురు చారికలైన పాదాలు
ఏ మత సాంప్రదాయాలకు లొంగని విధంగా
చాపతో సహా కాల్చాలని నిర్బంధించారని
చెప్పి చెప్పి కాల్చేసిన కటికవాడు వెక్కిపడిన
వైనం
అక్క శవం మీద ముక్కుపుడక సహితం
తీసి జేబులో వేసుకున్న పోలీసువాడి నైజం
వెరసి పోలీసులు పెట్టిన పేరు 'ఎదురు
కాల్పులు'
ఒక్క తృటిలో కళ్లలో ఫ్లాష్ కొట్టిన జ్ఞాపకం
కన్నీటికి ఏతమెత్తింది
నా ముందు పిడికిలిలా ముడుచుకుపోయిన
వాడిని నా గుండెకు హత్తుకుని, మాటలు
కూడగట్టుకుని అన్నాను ....
"మా తుంగభద్ర
పెన్నలో కలిసిపోయి
అంతర్వాహిని అయిపోయిందిరా కన్నా" అని.
(పద్మక్క కలంపేరు తుంగభద్ర)

- లక్ష్మత్త

గమనిక

'పనిపిల్ల' కథపై చర్చను ఈ సంచికలో వెయ్యలేకపోతున్నాం. వచ్చే సంచికలో ముదునూరి భారతిగారి వ్యాసం వస్తుంది.

-సం॥

నిర్బంధం

నిర్బంధంలో ఒక కవి

(సామ్రాజ్యవాద వారసత్వంగా వివిధ జాతీయవాదాల విభజనను కొనసాగించకుండా, దక్షిణాసియా, నూతన ప్రపంచ వ్యవస్థలో, ప్రాంతీయ రాజకీయశక్తిగా అభివృద్ధి చెందాలని కోరే మనలాంటివారికి, (బంగ్లాదేశ్‌లో) ఫర్హాద్ మజార్ యొక్క నిర్బంధం ఒక ఆకస్మిక వ్యాకులత (shock) ఫర్హాద్ మరియు ఫరీదా రచనలు 'ఫ్రాంటియర్' లో ప్రచురితమయ్యాయి. ప్రాంతీయ వామపక్ష ఐక్యతలో వారికి దృఢమైన విశ్వాసం ఉంది. మజార్ యొక్క పదిహేను కవితల్ని కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన గాయత్రి చక్రవర్తి స్పైవక్ అనువాదం చేసింది. అతను కవితల, వచన సంకలనాలనెన్నో ప్రచురించాడు. అతని రచనలు పతీపాఖో, 5/3 బరాబోమహన్‌పూర్, రింగ్‌రోడ్, శ్యామోలి, ఢాకా 1207 అడ్రస్‌లో లభ్యమవుతాయి. ఈ మధ్యనే ప్రచురణమైన అతని కవితా సంకలనాలు ఈబడాట్నామఏక్ (EbadatnamaEk) మరియు డరోడి బోకుల్ (Darodi Bokul). బంగ్లాదేశ్ పౌరులుగాని దక్షిణాసియావాసులకు ఆ దేశ అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకొనడానికి ఇష్టపడరు. అంతర్జాతీయ సంఘీభావ దృష్టితో, బంగ్లాదేశ్ ప్రధానమంత్రికి పూర్తి వివరాలను తెలిపే ఈ కింది విజ్ఞప్తి పత్రాన్ని మేం 'ఫ్రాంటియర్' పాఠకులతో పంచుకుంటాం.)

కవి, మేధావి, జర్నలిస్టు, పరిశోధకుడు మరియు వైద్య, వ్యవసాయ రంగాల్లోని జీవ వైవిధ్యం (biodiversity) లో మరియు ఆర్థికాభివృద్ధికి చెందిన రంగాలలో చురుకైన కార్యకర్త అయిన ఫర్హాద్ మజార్‌ను యెటువంటి నేరారోపణ మరియు విచారణలు లేకుండా 1995 జులై 30న బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్బంధించింది. ఒక నిర్భీతిగల మేధావిని, కార్యకర్తను ముందు జాగ్రత్త చర్య పేరుతో (1974) ప్రత్యేక అధికారాల చట్టం కింద నిర్బంధించడం జరిగింది. ఒక ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వ పాలనలో ఆ చట్టం యొక్క రాజ్యాంగబద్ధత చాలా కాలం నుండి ప్రశ్నించబడుతుంది కూడా. ఎటువంటి నేరారోపణ అతనిపై చేయనప్పటికీ, రైతాంగ పునాదిగల సహాయక పోలీసు దళాల తిరుగుబాటును ప్రభుత్వం పాశవికంగా అణచివేయడాన్ని ఒక నిర్దిష్ట వ్యాసంలో ఫర్హాద్ చేసిన విమర్శకు ప్రభుత్వ స్పందనే అతని నిర్బంధమని తెలియవస్తుంది. ఆ సహాయక పోలీసులు తమకు సామాజిక న్యాయం కావాలని డిమాండు చేయడానికీ, సామాజిక న్యాయాన్నీ, మానవ హక్కులనూ పరిరక్షించడంలో ప్రభుత్వ వైఫల్యానికీ ఫర్హాద్ లంకె పెట్టాడు. ప్రత్యామ్నాయ అభివృద్ధి విధాన పరిశోధన మరియు 'స్త్రీలకు అధికారం' కొరకు ఏర్పాటు చేయబడి, అంతర్జాతీయంగా పేరు పొందిన ప్రజా పునాది గల సహకార సంస్థ యూబింగ్ (Ubing) కు మజార్ మరియు అతని భార్య ఫరీదా అక్తర్ సంస్థాపకులు మరియు మార్గదర్శకులు. శ్రీమతి అక్తర్ ఆగస్టు 23, 1995 నాటికి తన భర్త నిర్బంధాన్ని హైకోర్టు ముందు విచారణకు తెచ్చింది. అదిప్పుడు ఆగస్టు 27కు వాయిదాపడింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆ కేసును ఇప్పుడు పర్యవేక్షిస్తుంది. పై విషయాన్ని జెనీవాలోని ఐక్యరాజ్య సమితికి చెందిన మానవ హక్కుల సంఘానికి మరియు హ్యూమన్ రైట్స్ వాచ్ అనే సంస్థకు

తెలియజేయడమైంది. బి.బి.సి., బెంగాల్ భాషా వార్తా విభాగం లాంటివి ఈ విషయాన్ని ప్రచారం చేశాయి. ఒక జర్నలిస్టును అతని రచనకై అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఉద్యమం చేపట్టడానికి 'పెన్' అనే అంతర్జాతీయ సంస్థ చొరవ తీసుకుంది. దక్షిణాసియా రచయితల మరియు పౌరుల సంఘీభావ కమిటీ బంగ్లాదేశ్ ప్రధానికి ఒక విజ్ఞాపన చేసింది. ఫర్హాద్ మజార్ విడుదలకై మరియు అతనికి పూర్తి పౌర హక్కులు పునరుద్ధరించాలనే వారి డిమాండుతో మేము మా గొంతుకను కలుపుతున్నాం.

నడినెగార్డిమర్ రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత; మహాశ్వేతాదేవి, రచయిత పద్మశ్రీ గ్రహీత; గ్రేస్ పాలె, రచయిత మరియు 'ఫ్రీడం టు రైట్'లో సభ్యులు; జెక్స్ డెర్రిడా, తత్త్వవేత్త, పెన్ క్లబ్ ఇంటర్నేషనల్, ప్రొఫెసర్ చార్లెస్ టెల్లీ, న్యూస్కూల్ ఫర్ రిసెర్చి, లూసీ టెల్లీ, న్యూ స్కూల్ ఫర్ సోషియల్ రిసెర్చ్ మరియు 34 మంది ఇతరులు.

ఫర్హాద్ మజర్ నిర్బంధానికి కారణంగా చెప్పబడుతున్న వ్యాసమిది.

అన్సార్‌ల తిరుగుబాటు ప్రజాస్వామ్యం మరియు పౌరహక్కులనే ముసుగు ధరించిన పట్టణ మధ్యతరగతి

(The Ansar Revolt and the Urban Middle class Mask of Democracy and Human Rights)

-ఫర్హాద్ మజర్

1994, డిసెంబర్ 1న అన్సార్‌లు - సహాయక పోలీసులు (ఆక్సిలరి పోలీసు ఫోర్స్) ఒక తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. వీరు సమాజపు అట్టడుగు వారు, ఆర్థికంగా యేమీలేని వారు మరియు ఉద్యోగ భద్రత లేనివారు. ఒక వైపేమో వారు ఆర్థిక వినాశనానికి గురవుతున్నారు, మరోవైపు ప్రభుత్వం నుండి గాని, అధికార వర్గం నుండి గాని వారి సమస్యల్ని పరిష్కరించే యెలాంటి హామీలు లేవు. ఈ క్రూర సమాజంలో వారి గోడు వినిపించుకునే వారే లేరు. ఇటువంటి భరించలేని పరిస్థితులలో తిరుగుబాటు తప్పనిసరైంది. తిరుగుబాటు న్యాయమైనదని మేం నొక్కి చెబుతున్నాం. ఈ తిరుగుబాటును అణచివేసేందుకు ఖలీదా జియా ప్రభుత్వం యెంతో రక్తపాతాన్ని సృష్టించింది. చివరి లెక్కలో, మా నిష్పక్షపాత పరిశీలనలో తేలిందేమిటంటే చనిపోయిన అన్సార్ల సంఖ్య కనీసం ముప్పై.

ఇంతకుముందు 'చింత' (సంచిక 4, సంపుటి)లో ఇలా రాశాం. "బంగ్లాదేశ్‌లో అభ్యుదయ రాజకీయాలు లేనందువల్ల, నిరుపేద మరియు అణచివేతకు గురైన ఈ అన్సార్ల తిరుగుబాటు సమాజపు అట్టడుగు (చివర ఉన్న) వర్గాల విషాదకరమైన నిరసన కన్నా యెక్కువ స్థాయికి అభివృద్ధి చెందదు. కాని (అలా) చెప్పడం సాధ్యం కాదు. ఆ వర్గపు పేద ప్రజలు మేల్కొన్నప్పుడు, వారు అన్సార్ తిరుగుబాటుకు గర్వపడతారు".

ఈ సంచికలో, పాఠకులకు అతి ప్రధానమైన విషయాన్ని తెల్పడానికి, మేం తిరుగుబాటుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాం. ఈ సమాచారాన్నందిస్తూ అల్తాఫ్ పర్వేజ్, "అన్సార్‌లు పోలీసు దుస్తుల్లో ఉన్న రైతాంగ బిడ్డలు" అన్నాడు. ఈ పదాలు అతని స్వంతం కాదని మాకు తెలుసు.

శాంతి-భద్రతల పరిరక్షణకై ప్రభుత్వం అణచబడిన అట్టడుగు వర్గాల నుండే మనుషుల్ని సేకరిస్తుంది. ఈ వర్గాలతో ఏర్పాటు చేయబడిన సాయుధశక్తితోనే పేద రైతాంగంపై మరియు కార్మికులపై తమ అదుపును ప్రభుత్వం కొనసాగిస్తుంది. అన్సార్‌లను కాల్చి చంపిన బంగ్లాదేశ్ రైఫిల్స్ కూడా "సైన్యపు దుస్తుల్లో వున్న రైతు బిడ్డలే". అయినా కూడా బంగ్లాదేశ్ రైఫిల్స్‌కు చెందిన సైనికునికి తాను తన సోదరున్ని చంపాననే విషయం తెలియదు.

"సైనిక దుస్తులలో రైతుబిడ్డలు" అనే మాటలు మరొక సత్యాన్ని బయటపెడ్తాయి. ఇది నిజంగా అన్సార్‌ల తిరుగుబాటా లేక రైతాంగ తిరుగుబాటా ? కొన్ని రోజుల క్రితం కేవలం కొంత ఎరువుల కొరకు యే మాత్రం వెరువక బుల్లెట్లనెదుర్కొన్న రైతుకు - పై అన్సార్‌ల తిరుగుబాటుకు సంబంధం చూపలేమా ? ఇదే యెత్తుగడలతో యే కార్మికుల ఉద్యమం అతి క్రూరంగా అణచివేయబడిందో, ఆ కార్మికుని ఒక పాదం కర్మాగారంలో, మరొక పాదం తన గ్రామంలో పొలం దున్నుతూ లేదా సంఘటిత మరియు అసంఘటిత కార్మికులు తమ హక్కుల కొరకు చేసే పోరాటాలు ఈనాడు వివిధ రూపాల్లో వ్యక్తమవుతున్నాయి. వాటి అంతర్గత సంబంధాల గురించి ఆలోచించడం అవసరమా ?

ఎందుకు ఆలోచించాలి ? ఒక వైపు 'ప్రజాస్వామ్యం', 'మానవ హక్కులు' లాంటి ఉన్నత ఆదర్శాల గురించి మాట్లాడేవారి నిజ స్వరూపాన్ని బయటపెట్టాలి. 'ప్రజాస్వామ్యం' మరియు 'మానవ హక్కులు' అనే ముసుగులో పట్టణ ప్రాంత మధ్యతరగతి నటిస్తూంది. అదెంత కాలం సాగదు. యే మాత్రం ఇబ్బంది లేకుండా ప్రజల్ని తమ నటనతో, అబద్ధాలతో మోసం చేయడాన్ని ఇక బద్దలు కొట్టాల్సిందే. అన్సార్ల, రైతాంగపు మరియు కార్మికుల తిరుగుబాట్లు న్యాయమైనవా, కాదా అని మనం చర్చించాల్సిందే. అయితే, మన కళ్ళ ముందే, ప్రభుత్వం, బ్యూరాక్రసి లేక రాజ్యం యేమాత్రం దయ లేకుండా రైతాంగాన్ని, కార్మికులను కాల్చి చంపుతూంటే, మనమేం చేయకుండా యెలా ఉండగలం? ఉన్నత లేక మధ్యతరగతికి చెందినవారి కుమారుడో లేక ఒక ధనవంతుని టెర్రరిస్టు కుమారుడో వీధి కొట్లాటలో మరణిస్తే పట్టణమంతా విషాదం ప్రకటిస్తుంది. ఆ ఫోటోతో సహా అతని సమాచారం పత్రికలలో పతాక శీర్షికలతో ప్రచురింపబడుతుంది. కాని, అన్సార్లు, రైతాంగం మరియు కార్మికులు జంతువుల వలె చంపబడ్డప్పుడు మాత్రం యేమాత్రం విషాదం వ్యక్తంగాదు.

- 'ఫ్రాంటియర్' సెప్టెంబర్ 9, సౌజన్యంతో

- (ఫర్హాద్ మజార్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండు చేస్తూ, అతని విడుదలకై వివిధ రచయితలు, సంఘాలు చేస్తున్న కృషికి సంఘీభావం తెల్పుతూ - విరసం కర్నూల్ యూనిట్ తరపున కన్వీనర్ అరుణ్ స్వేచ్ఛానువాదం)

పల్లె పరిస్థితి

పొద్దుననగ పొలానికి పోయిన మొగుడు
పొద్దుపోయినా యిల్లు జేరకపోయేసరికి
మల్లమ్మకు వజవజా వణుకు పుట్టింది
విషపురుగు కాటేసిందని
అడవి జంతువు కొట్టుకపోయిందనీ కాదు
పోలీసులు ఎత్తుకుపోయారేమోనని
యింట్లోంచి కాలు బయటపెడితే
తిరిగొస్తాడో లేదోనని భయం కాదు
బతికుంటేనే ఎప్పుడు చంపేస్తారోనని భయం !

-కరుణ

ఏకాంతవాస శిక్ష

నేను అమరావతి జైలులో ఉన్న టాడా డిటెన్యూలైన నా క్లయింట్లను చూడటానికి వెళ్ళినపుడు వారి పట్ల అధికారులు క్రూరంగా వ్యవహరించడం చూసి చలించిపోయాను. నా క్లయింటులైన ఈ నలుగురిపై వివిధ కేసులు ఆరోపించబడి ఉన్నాయి. వీరంతా కూడా నక్సలైట్ ఉద్యమానికి సంబంధించిన రాజకీయ ఖైదీలు. వీరు నాగపూర్ జైలు నుండి అమరావతి జైలుకు మార్చబడ్డారు. మూడు సంవత్సరాల క్రితం ఒక్కసారిగా ఈ నలుగురు అండర్ ట్రయల్ ఖైదీల్ని బంధించి ఏకాంతవాసంలో ఉంచారు.

అమర్ వెలిశెట్టిని ఇంటర్వ్యూ కోసం నా ముందుకు తీసుకొచ్చినపుడు అతని కాళ్ళు చేతులు గొలుసులతో బంధింపబడి ఉన్నాయి. అతను తన బంధువులు పంపించిన పుస్తకాన్ని ఇవ్వమన్నందుకే మూడు నెలల నుంచి ఈ శిక్ష విధిస్తున్నారని అతను చెప్పాడు. ఈ అమానవీయమైన చర్యలకు అతను మానసికంగా ఎంతో ఆందోళన చెంది ఉన్నట్లు కనిపించాడు. పవన్‌కుమార్ మరియు శ్రీకాంత్ జలగామ్‌లను చేతులను వెనక్కు విరచి హాండ్‌కప్స్ వేసి నా ఇంటర్వ్యూకు తీసుకొచ్చారు. వాళ్ళని గట్టి భద్రత మధ్య ఏకాంతవాసంలో వుంచుతూ ఇంటర్వ్యూకు తీసుకొచ్చినపుడు గొలుసులు హాండ్‌కప్స్‌తో తెస్తున్నారు. శ్రీకాంత్ గత ఫిబ్రవరిలో పవన్‌కుమార్‌తో మాట్లాడడానికి జైలర్‌ను అడగగా జైలర్‌కూ, శ్రీకాంత్‌కు మధ్య వాగ్వివాదం జరిగి జైలర్ శ్రీకాంత్‌ను తీవ్రంగా కొట్టడంతో అతని తలకు బలమైన గాయం తగిలి రక్తస్రావం అధికంగా జరగడంతో అతను స్పృహ కోల్పోయాడు. అమర్‌పై వున్న ఒక కేసు కొట్టివేయబడింది. మరో మూడు కేసుల్లో బెయిల్స్ వచ్చి షూరిటీల కోసం ఎదురు చూస్తున్నారు. రేపో మాపో విడుదలవుతాడని కూడా చూడకుండా అధికారులు అతని పట్ల అమానుషంగా వ్యవహరించడం గర్హించదగ్గ విషయం.

నాల్గవ వ్యక్తి పవన్‌కుమార్ భార్య గిరిజ. ఈమెను ఏకాంతవాసంలో వుంచడం వలన అమితమైన మానసికాందోళనకు గురౌతోంది. జైలు మాన్యువల్‌లో కొన్ని నిబంధనలున్నప్పటికీ ఆమెను భర్తతో కలవడానికి అనుమతించట్లేదు. నిజానికి ఏ ఒక్క టాడా డిటెన్యూకి కూడా చదువుకోవడానికి పుస్తకాలను అధికారులు అనుమతించడం లేదు. బంధువులకూ లాయర్‌నైన నాకూ వాళ్ళు వ్రాసే ఉత్తరాలు అందడం లేదు. బంధువులు పంపిన బట్టలు కూడా వారికి అందడం లేదని వారు చెప్పారన్నారు. కనీసం కోర్టు వాయిదాలకు కూడా వారిని సరిగ్గా తీసుకెళ్ళట్లేదు. ఖైదీలందరికీ ఇంటర్వ్యూలు ఇవ్వడం ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడానికి జైలు మాన్యువల్ అనుమతిస్తుంది.

'ఏకాంతవాసం' అనేది కోర్టు మాత్రమే విధించాలి తప్ప జైలు సూపరింటెండెంట్ కాదని సుప్రీంకోర్టు సునీల్ బత్రా Vs. ఢిల్లీ పరిపాలన విభాగం కేసులో తీర్పునిచ్చింది. ఇది 1978 AIR (All India Report) లో 675 వ పేజీలో లిఖించబడింది. అదే విధంగా సుప్రీంకోర్టు కిషోర్‌సింగ్ Vs. రాజస్థాన్ ప్రభుత్వం కేసులో 'ఏకాంతవాస శిక్ష'ను అతితక్కువ కేసుల్లో మాత్రమే విధించాలని ఖచ్చితంగా నిబంధనలను పాటించాలని తీర్పునిచ్చింది. ఇది 1981 AIRలో 625వ పేజీలో పేర్కొనబడింది.

-S.P. సాడ్లింగ్, అడ్వకేట్, నాగపూర్

(8 జులై 1995 'ఫ్రాంటియర్' సౌజన్యంతో) **అనువాదం : 'సముద్రం'**

జైలు నుండి జైలుకు లేఖ

(అడవి తల్లి ఒడిలో హాయిగా, అమాయకంగా జీవించే ఆదివాసి హక్కుల్ని అడగటంతో అడవంతా అల్లకల్లోలమైంది. ఈ అడవి నీది కాదు, ఈ నేల నీది కాదు, ఈ సెలయేళ్ళలో పారే స్వచ్ఛమైన నీరు నీది కాదు, అనాదిగా అడవి ఒడిలో తలదాచుకుంటున్న జంతు జాలాలు సహితం నీవి కావని శాసనాలొచ్చాయి. ఆ శాసనాలకు తుపాకి కొమ్ములొచ్చాయి. తూటాల రాజ్యం మొదలైంది. గోచి గుడ్డ లేని గోండన్న సర్కార్‌ను సవాల్ చేశాడు. విల్లంబులు సారించాడు. అంతే... గోండోడు గెరిల్లా అయితే తమ ఘోరి కట్టడం ఖాయమని గ్రహించిన కల్లే సర్కారు (దొంగ ప్రభుత్వం) కల్లోలం రేపింది. ఇండ్లకు తాళాలు వేయని జనం, పోలీసు స్టేషన్లు చూడని జనం, తెల్ల కాగితంపై రాత తెలియని జనం, తెల్లగుడ్డలు వేయని జనం "టాడా" క్రింద బందీలయ్యారు. అడవి తల్లి ఒడికి దూరంగా ఇంటి సంగతులు తెలియకుండా సంవత్సరాల తరబడి నాల్గు గోడల మధ్యన "పంజరంలోని పిట్టలాగా" (చిలక) వున్నప్పటికినీ అదరలేదు, బెదరలేదని నిర్ధారించుకోవడానికి ఒక ఆదివాసి దాదా ఆంధ్రప్రదేశ్‌లోని జైలులో ఉన్న తన దాదాకు వ్రాసిన ఉత్తరం చూస్తే అర్థమవుతుంది. ఉత్తరం కొంత హిందీలోను, మరికొంత మాడియా భాషలోను ఉంది. ఈ ఉత్తరం పూర్తి పాఠాన్ని తెలుగులో అనువదించి అందిస్తున్నాం.)

గౌరవనీయులైన .... దాదాకు

అమరావతి

రూషియొక్క లాల్ సలాం 15-8-1994

అన్నయ్యా! ఇంతకు ముందు నీకుఉత్తరం వ్రాశాను. అది ముట్టిందో లేదో నీవు తెలియపరచలేదు.

అమరావతి జైలులోని * దాదాలమంతా కలసిమెలసి ఉంటున్నాం. (ఇక్కడి నుంచి మాడియా భాషమొదలవుతుంది) జులై 28 అమరవీరుల సంస్మరణ దినం జరుపుకున్నాం. ఆ రోజు పనులన్నింటిని బందుపెట్టుకున్నాం. పోల్వ (మాడియా పండుగ లేదా సెలవు అని అర్థం) చేశాం.

అన్నయ్యా! మాకు ఇంటి నుండి మనియార్డర్‌లు కూడ రావడం లేదు. ఉందువల్ల బట్టలకు చాల ఇబ్బంది అవుతున్నది (ఇది హిందీలో వ్రాయటం జరిగింది). బయట ఉన్న దాదాలకు (పార్టీ వాళ్ళకు) మేము ఎలా ఉన్నామో తెలియటం లేదు. అయినా జైల్లో మేము బాగానే ఉన్నాము. మేం బయట ఉన్నప్పుడు 25 పైసలు ఇచ్చి (సంఘ సభ్యత్వ రుసుం) ప్రతిజ్ఞ చేశాం. ఆ ప్రతిజ్ఞను విడిచే ప్రసక్తి లేదు. ఆ రోజు నీవు సంఘంలో ఉంచావు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొంటాను. ఈ ఉత్తరం ముట్టిన వెంటనే జవాబు వ్రాయాలి.

కసంసూర్ రేంజిలోని .... ఊరి వాడిని. అనుకోకుండా అరెస్టు అయ్యాను ఇక్కడ మేం జైలు వొదిలి వెళ్ళిన తర్వాత ఇంతకు ముందు నడిచిన బాటలో నడవాలని ప్రతిజ్ఞ చేశాం. (ఇక్కడి నుంచి హిందీలో మొదలవుతుంది) అన్నయ్యా! జమానత్ విషయంలో ఇంటి వాల్లు ఏమి తెలియజెయ్యలేదు. కనీసం జమానత్‌లను పెడుతున్నారా లేదా అనే విషయాన్ని కూడా తెలియజెయ్యలేదు. నాపై 12 కేసులు పెట్టారు. అందుకే కొంత విచారం కూడా ఉంది. మా కోర్టు పేచీలకు నాగాపూర్ పోవలసి ఉంటుంది.

ఈ జైల్లో మేమే 150 మందిమి ఉండేవాళ్ళం. అయితే చిన్న చిన్న కేసుల వాళ్ళు విడుదలై వెళ్ళిపోయారు. ప్రస్తుతం మేం మొత్తం 75 మందిమి ఉన్నాం. (మాడియా మొదలవుతుంది). విడుదలై వెళ్ళిన దాదాలకు జైల్లోని పరిస్థితిని, అలాగే మా ఇబ్బందులను చెప్పి ఆ విషయాలను దాదాలకు చెప్పమన్నాం. కాని విడుదలైన దాదాలు ఒక్క ఉత్తరం కూడా వ్రాయలేదు. అందువల్ల బయట విషయాలేమి తెలియలేదు.

మీరు మమ్మల్ని తయారుచేశారు. మా మొదటి పొరపాటులోనే లోపల పడ్డాం. మా పొరపాటును ఆత్మవిమర్శ చేసుకొంటున్నాం. ముందుకు పోయే మార్గం కోసం ఆలోచిస్తున్నాం. ఈ విషయాన్ని బయట ఉన్న మన వాళ్ళకు తెలియజేయండి.

మీరు వెళ్ళిన తర్వాత వేరే దాదా వచ్చినాడు. అప్పుడు మేం పనులు బాగా చేశాం. ఈ విషయాన్ని తెలియజేయండి. జైలుకు వచ్చిన మొదట్లో మాకేమి తోచలేదు. అర్థం కాలేదు. క్రమంగా చదువుకోవడం మొదలుపెట్టాం. బయట వేలి ముద్రలు వేసే దాదాలు ఇప్పుడు తమ సంతకాలను చేయగలుగుతున్నారు.

అన్నయ్యా ! మేం అడవిలో ఉండేవాళ్ళం. పట్టణాల రీతి రివాజు మాకు తెలియదు. కాని జైలుకు రావడంతో కాలేజీ చదివినట్లయ్యింది. అమరావతి జైల్లో మేమందరం క్షేమంగానే ఉన్నాం. అక్కడి జైల్లో ఉన్న మీ అందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం.

ఈ ఉత్తరం హిందీ, గోండి మిక్చర్‌గా ఉంది. అయినా నీవు అర్థం చేసుకుంటావు కదా ! ఈ ఉత్తరం ముట్టిన వెంటనే జవాబు వ్రాయాలి.

మా అందరి తరుపున దాదాకు రెడ్‌సెల్యూట్ !

* అన్నలు -రూషి

నరరూప రాక్షసులు

అరుగో రాక్షసులు, నరరూప రాక్షసులు !
మొన్న లాతూరు భూకంప బాధితుల కొచ్చిన పాలలో స్నానం చేసిండ్రు
నేడు ఫిరోజాబాద్ రైలు ప్రమాదంలో
వచ్చిన ఎక్స్‌గ్రేషియాలోనే వాటా అడిగిండ్రు
మొన్న శవాలమీది సొమ్ములు దొంగిలించిండ్రు
నేడు శవాలను అప్పగించడానికి లంచాలు అడిగిండ్రు
ఎంత నీచం, ఎంత అసహ్యం రక్షకభటుల నైజం !
అందుకే ఈ వ్యవస్థను ఉరితీసి ఈ నైజాన్నే మారుస్తాం
నవసమాజం నిర్మిస్తాం.

-తొలిపొద్దు

కథ

నేటి సౌఖ్యనికోసం

సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంది. నీరెండ ఎర్రగా విస్తరిస్తోంది. ఉపాధ్యాయులంతా హడావిడిగా ఎవరికి కేటాయించిన వాహనాల్లోకి వారు వారి వారి ఎన్నికల సామాగ్రితో ఎక్కి కూర్చుంటున్నారు. మైకుల్లో ఎన్నికల అధికారులు చెవులు కోసిన పిల్లుల్లా అనౌన్స్‌మెంటు చేస్తోనే వున్నారు. ఉపాధ్యాయుల చెవులు తూట్లు పడుతోనే వున్నాయి. క్షణం తీరిక లేదు. ఒకటే హడావిడి. ఈ తతంగం ఎంత తొందరగా ముగుస్తే అంత మంచిదని ఎవరికి వారే వున్నారు.

ఒక్కసారిగా కలకలం బయలుదేరింది. మళ్లీ ఏమొచ్చిందిరా ? అనుకొంటూ తమకు కేటాయించిన వాహనాల్లో ఓ మూలకు కూర్చున్న కిషన్‌రావ్ విసుక్కొంటూ పీక్కుపోయిన మొఖంతో కిందికి దిగిండు. అప్పటికే ఉద్యోగులంతా అక్కడ గుంపుగా చేరినారు. కిషన్‌రావు విసుక్కొంటూనే గుంపులోకి వచ్చిండు. రిటర్నింగు అధికారి ఏమీ మాట్లాడకుండా కుర్చీలో చతికిల పడ్డాడు. "అదికాదు సార్! మేం పని చేయమని అంటాలేం, కాని ఈ పోలీసోల్లతోని మాత్రం చచ్చినా పోం". జారిపోతోన్న గోచిని సర్దుకొంటూ యాభై ఏళ్ల పైబడిన తెలుగు పండితుడు ఎగపోస్తూ మాట్లాడుతోండు. కిషన్‌రావుకు విషయం అర్థమైంది. అసలే పొద్దుటినుండి నీళ్లూ, నిప్పులు లేక ఆకలితో చస్తూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోంటే తీరా బయలు దేరేప్పుడు యిదేం గొల్లెంరా! బాబూ! అనుకొంటూ కిషన్‌రావు రిటర్నింగ్ అధికారి దగ్గరికి వెళ్లిండు. 'ఏం ? సార్! అసలే భయంతో 'ఎట్ల తెల్లారుతదిరో' అని మేం ఏడుస్తోంటే! మధ్యగీ పోలీసులేందట ? మాకెందుకీ చిక్కు ? కాకపోతే మీరే చేసుకోండి ఓట్ల పనంతా! మేమందరం హాయిగా యింటికి పోతాం. అంతేగాని గీ యవారం మాకేం అక్కర్లేదు". జారిపోతోన్న ప్యాంటును పైకి ఎగదోపుకుంటూ తెగ ఆయాసపడుతోండు. ఒక పక్క ఆకలి, మరోపక్క పొద్దుట్నుంచి ఈ గందర గోళంతో అలసిపోయిన ఉపాధ్యాయులంతా ఒక్కసారిగా గయ్యిమని లేదంటే లేదంటూ గోలగోల చేస్తోన్నారు.

సాయంత్రం నీరెండ క్రమంగా కళ తప్పుతోంది. చెట్ల మీది పిచ్చుకలు ఒక్కొక్కటే చేరుకొంటోన్నాయి. ఉపాధ్యాయుల గోలతో పిచ్చుకల సవ్వడి కలిసిపోయింది. రిటర్నింగ్ అధికారి మెల్లగా కుర్చీనుండి లేచి నిలబడి తన బట్టతలను నిమురుకొంటూ, మెల్లగా బానపొట్టను కదిలిస్తూ మెల్లగా మైకు వద్దకు వెళ్లగానే ఆవరణ అంతా నిశ్శబ్దం ఆవరించింది. చెట్ల మీది పిచ్చుకల గోల వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తోండగా రిటర్నింగ్ అధికారి గొంతు మైకులో టంగ్‌మని ఉపాధ్యాయుల చెవుల తాకింది. "మిత్రులారా! మీ యిష్టం మేరకే మీరు వెళ్లవచ్చు, పోలీసులు వేరే వాహనాలల్లో మిమ్మల అనుసరిస్తారు" అని ప్రకటించగానే ఉపాధ్యాయులంతా చప్పట్లు కొడుతూ, సంతోషంగా వారి వారి వాహనాల్లోకి వెళ్లి కుర్చొన్నారు. ఒక్కొక్కటిగానే వాహనాలు 'రయ్‌ః రయ్‌ః' మంటూ కదులుతోన్నయి. సాయంత్రం పూర్తిగావొస్తోంది. 'ఎప్పుడు చేరుతామో ? ఏమో ?' కిషన్‌రావు పక్కనే వున్న సీతారామ శాస్త్రి నస్యాన్ని సర్రుమంటూ ఎగపీలుస్తోండు. అప్పటివరకు విశ్శబ్దంగా వున్న

కానిస్టేబుల్సందరూ తుపాకులతో బస్సుకు పదిమంది దాకా గబగబా కదిలే బస్సులో జొరబడ్డారు. ఉపాధ్యాయులంతా బిత్తరబోయి చూస్తోన్నారు. బస్సులు నడుస్తోనే వున్నాయి.

యింతలో ఒక యువ కానిస్టేబుల్ "సార్ ! మాయి మాత్రం పాణాలు గావాసార్? ఏదో పొట్టగంజికి ఉద్యోగాలు చేస్తానం. మా పెళ్లాం పిల్లగాండ్లు దిక్కులేనోల్లు గావాలని మా కుంటుందా సార్ ? మీతో వుంటేనే మాకు రక్షణ గాని, లేకుంటేముంది సార్ ? "సంజాయిషీ యిచ్చినట్లు చెప్తులోంటే ఉపాధ్యాయులంతా తెల్లమొగాలేసి అలాగే చూస్తూ రబ్బరు బొమ్మల్లా వున్నారు. "సరే ఏం చేస్తాం ? ఎంత రాసిపెడితే అంత" త్వరగా తేరుకొన్న తెలుగు పండితుడు వేదాంతధోరణిలో అన్న మాటలకు మిగతా ఉపాధ్యాయులంతా తేరుకొన్నారు. "లం ...... కొడుకు, ఆ రిటర్నింగు బోడిగుండుగాడు ఎంత మోసం చేసిండ్రా" కిషన్‌రావు తనలో తానే గూలుక్కొన్నాడు. మిగతా ఉపాధ్యాయులు మౌనంగా వున్నారు.

అప్పటికే సూర్యుడు పశ్చిమ కొండల్లోకి చెట్ల మాటునుండి పయనిస్తోండు. ఎన్నికల సరంజామాతో సిబ్బందిని మోసికొని వాహనాలు తారురోడ్ల వెంట హారన్లు మోగిస్తూ రయ్యిన దూసుకపోతున్నాయి. పోలింగు సిబ్బందిని ఒకరి కొకరు వేరు వేరు వాహనాల్లోంచి జాగ్రత్త అంటూ చేయి సైగలతో వీడ్కోలు పలుక్కుంటున్నారు. పట్టణ పరిసరాలను పరికిస్తూ కిషన్‌రావు తాపీగా సిగరెట్టు ముట్టించి గట్టిగా దమ్ములాగి పొగను గాలిలోకి వదులుతోన్నడు. ఉపాధ్యాయులంతా ఎవరిలోకంలో వారున్నారు. బస్సులు వంకర టింకర రోడ్ల వెంట రయ్యిమంటూ పరుగెడుతోన్నయి. మధ్య మధ్యలో పోలీసు జీపులు, వ్యానులు కనిపిస్తోన్నయి.

సూర్యుడు పడమటి దిశకు పరుగెడుతోంటే బస్సు మాత్రం తూర్పు దిశకు ఉరుకుతోంది. కల్వర్టులు, బ్రిడ్జిలు వున్నకాడల్లా ఒకరిద్దరు పోలీసులు కాపలా వున్నారు. వారు పొమ్మన్న తర్వాతే బస్సులు కదులుతోన్నయి. ఆగిన కాడల్లా బస్సుల్లోని పోలీసులు కిందికి దిగి అన్ని పరిసరాలు తనిఖీ చేసి బస్సెక్కుతోన్నరు. ఏదైనా మందు పాతరలున్నాయేమోననే భయం. ఒక్కొక్కరు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేస్తోన్నారు. మసక చీకట్లు కమ్ముతోన్నాయి. రోడ్డు కిరువైపులా వున్న చెట్లను దాటుకొంటూ బస్సు వేగంగా వెడులోంది. కిషన్‌రావు ఆలోచన్లో పడ్డాడు.

"ఏమిటిదంతా ? ప్రజాస్వామ్యం, ఎన్నికలు అంటూ అధికార వర్గాలు మళ్లీ అధికారానికి వచ్చేందుకు నాటకాలు చేయడమేగాని ప్రజలెవరికి గావాలే ? ప్రజాస్వామ్యమెవరికి గావాలే ? నయాన్నో, భయాన్నో యింత గుడుంబా ఎగజల్లి, అవసరం మేరకు నాలుగు గవ్వలు యిసిరేసి మళ్లీ అయిదేళ్లదాకా అధికారానికి లైసెన్స్‌లు తీసికొనేందుకు నామమాత్రంగా జరిగే ఓ తంతు. ఓ పక్క ఓట్లు వేయొద్దని, ఓట్లు వేయించొద్దని పేపర్లో ప్రకటనలు. అధికారులు మాత్రం విధి నిర్వహణలో గైర్హాజరు అయితే చట్టపరంగా శిక్షార్హులు అని ఆదేశాలు. మధ్యన మేం చచ్చేరోజులొచ్చినయి. ఇదేం ప్రజాస్వామ్యమో ఏమో". ఆలోచన్లో మునిగిపోయిన కిషన్‌రావు మెల్లగా బస్సు ఆగడంతో ఒక్కసారిగా సరిగా కూర్చొన్నాడు. చుట్టూ చీకటి కమ్మింది. ఏమీ కనిపించడం లేదు. దూర దూరంగా మినుకు మినుకుమంటూ గ్రామాల్లోని విద్యుత్ దీపాలు కనిపిస్తోన్నాయి. రయ్ మంటూ చలిగాలి బస్సు కిటికీ లోంచి దూసుకొస్తోంది. కిషన్‌రావు బ్యాగ్‌లోంచి స్వెట్టర్ తీసి తొడుగుతోండగానే ఒక్కొక్క కానిస్టేబుల్ బస్సు దిగుతోన్నారు.

ఆఁ దిగండి, దిగండి ! 'ఎర్రబండ' పోలింగ్ సిబ్బంది మొత్తం దిగండి" సి.ఐ.భయంకర్‌రావు విదావంగా ఆర్డరిచ్చారు. ఆఁ అప్పుడే వచ్చిందా ? అంటూ కిషన్‌రావు మిగతా పోలింగ్ సిబ్బంది ఒక్కొక్కరే తమ తమ సామాగ్రితో బస్సు దిగి చుట్టూ కలియ చుస్తోన్నార్రు. ఎర్రబండ సిబ్బంది కిందికి దిగగానే ముందు దిగిన పోలీసు సిబ్బంది బస్సు ఎక్కగానే బయ్యిమంటూ బస్సు చీకట్లను చీల్చుకొంటూ రోడ్డుమీద పరుగెత్తులోంది. అందులోని మిగతా ఉపాధ్యాయులు చేతులు ఊపుతూ చీకట్లో బస్సుతో పాటు వెళ్లిపోయారు. కిషన్‌రావుతోపాటు పోలింగ్ సిబ్బంది బస్సు వెళ్లిన వైపే చూస్తూ పక్కనే వున్న పొదలవైపు దూరదూరంగా పరిసరాలను గమనిస్తూ తమ తమ పనులను పూర్తి గావించుకొంటోన్నారు. కిషన్‌రావు సిగరెట్టు ముట్టించి పొగను చీకట్లోకి వదులుతోన్నాడు. దగ్గరలోనే ఒక జీపు దాని పక్కనే ఆరుగురు సాయుధ కానిస్టేబుల్స్ మరికొంతమంది సాధారణ యువకులు ఆరు ఏడుగురి దాకా వున్నారు. ఎర్రబండ కెళ్లే దారిలో ఒక బండి, దాని గీరకు రెండెడ్లు కట్టేసి వున్నాయి. ఉపాధ్యాయులంతా వారి వారి బ్యాగుల్లోంచి శాలువలు, దుప్పట్లు తీసి ముసుగులు వేసారు. కిషన్‌రావు మఫ్లర్ తీసి తలకు చుట్టుకొన్నాడు. సీతారామ శాస్త్రి నస్యం పొడుం ఎగపీలుస్తోన్నాడు.

"అరే ! వాళ్లనిటు తోలర్రా!" సి.ఐ. భయంకరరావు గొంతు చీకట్లో ఖనేల్‌మంది. జీపువద్ద వున్న యువకులు మెల్లగా సి.ఐ. ముందుకొచ్చారు. కిషన్‌రావు ఇతర సిబ్బంది కూడ సి.ఐ. దగ్గరలోకి వచ్చి ఆసక్తిగా చుస్తోన్నారు. "అరే ! వీళ్లే మీ వెంట వస్తరు. రేపు ఓట్లు ఏయించి మళ్లీ యిక్కడికే తేవాలి. రేపు ఓట్లు అయ్యేంతవరకు ఏమైనైయిందో మీ లో ఒక్కరుకూడ వుండరు. ఎవడైన ఓటు వేయలేదో వాని శవం కూడ మిగలదు. అర్థమైందికదా !" సి.ఐ. గొంతుకు చలికూడ వణుకులోంది. యువకులు తలాడిస్తూ మానుల్లా నిలబడి పోయారు. "ఏమన్న తేడా వచ్చిందంటే ఒక్క గుడిసెకూడ మిగలదు. బయలుదేరండి" భయంకర్‌రావు యమభయంకరంగా హుకుం జారీ చేసిండు కిషన్‌రావుకు ఏదో అనుమానంగానే వుంది. మిగతా సిబ్బందికి నోట మాటల్లేవు.

"సార్ ! మీరు మా వెంట వస్తా లేదా ? " సి.ఐ.ని బెరుకుగానే అడిగాడు కిషన్‌రావు. సి.ఐ. భయంకరరావు కిషన్‌రావు వైపు గుర్రుగా చూసి "మేం, రాట్లేదు. ఎందుకట్ల రావాలి పేపర్లో పోలీసులతో వెళ్లొద్దు అనగానే ఎగిరి సంకలు కొట్టుకోలే ! పోలీసులు మాతోటి రావద్దని కలెక్టర్‌కు దరఖాస్తులు చేస్తిరికదా ? గిప్పుడు మేమెందుకో ? వ్యంగ్యంగా, కోపంగా చేతులు తిప్పుకొంటోన్న సి.ఐ. మాటలకు నోటమాట రాకుండా నిలబడ్డాడు కిషన్‌రావు. " మీరేపోయి, ఓట్లు ఏయించి డబ్బాలను పట్టుకరాండి. మేం, యిక్కడే మీ కొరకు యింతజాం చేస్తాం" భయంకరంగా అంటూ భయంకరరావు జీపు వద్దకు వెళ్లగానే జీపు బయ్యిన స్టార్టయింది. మిగతా పోలీసులు బగబా జీపు నెక్కగానే సి.ఐ. భయంకరరావు పడమటి దిక్కుగా జీపులో రయ్యిమని దూసుకపోయిండు. జీపు పొగలో ఉపాధ్యాయులు నిశ్చేష్టులుగా వున్నారు.

'పదవండి సార్ ! మనకేం ఫర్వాలేదు ఆ పోలీస్ లం ......కొడుకులతో మనకేంపని దుప్పటి సర్దుకుంటూ ఒక యువకుడు కిషన్‌రావు దగ్గరకు వచ్చాడు. బండి పోలింగ్ సామానుతో నడుస్తోనే వుంది. కిషన్‌రావు మరి యితర ఉపాధ్యాయులు గ్రామ యువకులతో కలసి నడుస్తోన్నారు. ఎడ్ల కాళ్లతో దుమ్ము తెల్లగా చీకట్లో లేస్తోంది. అందరూ దుప్పట్లు, మఫలర్లు చుట్టుకొని మెల్లగా బండి వెంట సాగుతోన్నారు. దూరంగా ఎక్కడో నక్కలు కూఁయ్ మంటున్నాయి. దూరంగా గ్రామాల్లోని వీధి దీపాలు మినుకు మినుకు మంటున్నాయి. కిషన్‌రావు సిగరెట్టు వెలిగించాడు. పక్కనే నడుస్తోన్న బక్క

పలచని కుర్రానితో "ఏందయ్యా! పోలీసోల్లు మనెంట రాలేదు ఎందుకని ?" అడిగిండు. ఉపాధ్యాయులంతా ఆసక్తిగా యిటువైపు చెవులుంచారు. బండివాడు 'హాయ్, హాయ్' మంటూ ఎద్లను అదిలిస్తోన్నాడు. ఎద్లు గంగడోల్లు వూపుకొంటూ అడుగులేస్తున్నాయి. గ్రామ సుంకరి బండి ముందు నడుస్తోన్నాడు.

కిషన్‌రావు అడిగిన ప్రశ్నకు యువకుడు దుప్పటి సర్దుకొని 'ఈ వూళ్లోకి పోలీసోల్లు అడుగుపెట్టాలంటేనే వాళ్లకు పిక్కలు వణుకుతాయి. అన్నల ప్రభావం ఈ వూళ్లో ఎక్కువ. ఎప్పుడే మయిద్దోననే భయం. అంతే". అయితే రేపు ఓట్లు పడుతాయా లేదా ? పీల్చే నస్యాన్ని ఆపి ఆతురతతో అడిగాడు తెలుగు పండితుడు. 'బాగానే పడేస్తాంలే, గా భయమేం పెట్టుకోకండి", మరొక యువకుడు జవాబిచ్చాడు. వానికి కావాల్సింది ఓట్లు, మాక్కావలిసింది బతుకులు. మా బతుకుల్ని మమ్ముల బతుకనిచ్చే రోజులు పోయే. మా బతుకులేడ పోతే వానికెందుకు ? వానికి ఓట్లు పడాలె. అంతే ఈ ఓట్లు మాకేమన్నా మేతపెడ్తాయా ? ఏ లం..... కొడుకేడబోతే మాకేంది ? పదేళ్ల పోరగాడు అంటోంటే ఉపాధ్యాయులంతా నోరెల్ల బెట్టి వింటోన్నారు. దుప్పటి కప్పుకొన్న యువకుడు, "అవును సార్, మేం ఎప్పుడో ఉద్యమంలో పనిచేసి కుటుంబ పరిస్థితులు బాగాలేక కొందరు, ఆరోగ్య పరిస్థితులు బాగాలేక కొందరు బయటికి వచ్చి ఎవరి బతుకు వారు బతుకుతున్నాం. ఓట్ల బహిష్కరణను అన్నలు అమలు చేయాలనగానే రాజకీయ నాయకుల పైప్రాణాలు పైన్నే పోయినయి. ఉన్న అధికారం పోతే కుక్కలు కూడ దేఖయి అనుకోని పోలీసోళ్లను ఊళ్లమీదికి తోలింద్రు. పోలీసోల్లు పిచ్చికుక్కల్లా ఊళ్ళమీదపడి అందిన కాడల్లా గొడ్లను బాదినట్లు బాదింద్రు. కిషన్‌రావు మరి యితర ఉపాధ్యాయులు మౌనంగా వింటూ నడుస్తోన్నారు. 'ఇదేదో కథ గమ్మత్తుగుందే' అనుకొంటూ సీతారామశాస్త్రి నస్యం పొడుం పీలుస్తూ శ్రద్ధగా వింటున్నాడు. "మనది ప్రజాస్వామ్య రాజ్యం కదా' అటువంటప్పుడు ప్రజలను ఓట్లేయొద్దని చెప్పటం చట్టవిరుద్ధంకాదా ?" కిషన్‌రావు ప్రక్కనున్న యువకునితో అన్నాడు. ప్రక్కనే నడుస్తోన్న యువకుడు చివ్వున తలెత్తి కిషన్‌రావు కేసి చూసి మళ్లీ మామూలుగా "అవునుసార్ మనది ప్రజాస్వామ్యమే కాదనను. ప్రజాస్వామ్యంలో అందరూ సమానమే కదా ? అందరికి స్వేచ్ఛ వుంటుంది కదా ?" కిషన్‌రావు అవునన్నట్లు తలూపాడు. "అయితే ఓట్లు వేయడం వేయకపోవడం వారి వారి వ్యక్తిగత అభిప్రాయాల మీద ఆధారపడి వుంటుంది. ఓట్లు వేయమని చెప్పుకొనే హక్కు ఎలా వుంటుందో ! వేయొద్దని చెప్పుకొనే స్వేచ్ఛ కూడ వుంటుంది కదా ! ఎవరి అభిప్రాయం వారు ప్రకటించుకొనే స్వేచ్ఛ వున్నప్పుడు ఈ సమస్య ఎందుకు ? అందరూ కొత్త విషయాలు విన్నట్లు వున్నారు. రోజా తరగతి గదుల్లో ప్రజాస్వామ్యం గూర్చి చెప్పే ఉపాధ్యాయులకు ప్రజాస్వామ్య రూపాన్ని దర్శిస్తోన్నట్లుంది. ఈదురు గాలి రివ్వుమని వీస్తోంది. చెట్లు డొంక కిరువైపులా సెంట్రీలుగా నిలబడి తలలూపుతున్నాయి. ఊరులోని కరెంటు వెలుతురు దగ్గరౌతున్నట్లుంది. వెలుతురు స్పష్టంగా కనిపిస్తోంది. గుబురు పొదల్లోంచి ఏవో చిన్న చిన్న జంతువులు పరుగెత్తినట్లు ఆకుల చప్పుళ్లు. బండి ముందుకు సాగుతోనే వుంది. ఉపాధ్యాయులతో నడుస్తోన్న యువకుడు మళ్లీ తానే "ఈ ప్రజాస్వామ్యంలో యిష్టం లేకపోయినా తుపాకులను గురిపెట్టి ఓట్లేయించుకొంటున్నారు. ఓట్లేయం అన్న ఊళ్ళల్లనుండి ఒకరిద్దరి పోరగాండ్లను తీసికెళ్ళి పిట్టల కాల్చినట్లు కాల్చి ఎన్‌కౌంటర్లంటున్నారు. కొట్టో, తిట్టో ఓట్లేయించుకొని గద్దెలెక్కి కులుక్కుంటూ ఐదేళ్లదాకా కంటికి కనిపియ్యరు. మళ్లీ అయిదేళ్లకు వచ్చి "అయ్యా ! ఇది ప్రజాస్వామ్యం మీ ఓట్లు మాకే వేయండి" అంటూ కాళ్ల కాడ నిలబడుతరు. లేకపోతే కడుపులు కాలబెడుతరు, ఇండ్లు కూలగొడుతరు. ఇదే కదా మీరు చెప్పే ప్రజాస్వామ్యం" అంటూ

ఆవేశం ఆవేదన కలిసిన గొంతుతో దుప్పటి సర్దుకొంటూ నడుస్తోన్నాడు. ఉపాధ్యాయులకు నోటమాట ల్లేవు. నడుస్తోనే వున్నారు. మరొక యువకుడు ముందుగా నడుస్తోన్నవాడల్లా కొంచెం ఆగి "ఇగో గిప్పుడు మాగోస చూడండి. ఏదో మా బతుకు మేం బతుకుతోంటేనే మమ్ముల్మ సంపబట్టిరి. రేపు ఓట్లేయకపోతే 'ఒక్కన్ని మిగలనీయం' అని మీ ముందరే ఆ సి.ఐ. గాడు ఎగరబట్టె. ఇంకేం చెప్పాలి సార్ మన ప్రజాస్వామ్యం గూర్చి" అంటోన్న యువకున్ని చూస్తూ ఉపాధ్యాయులంతా మాట్లాడకుండా నడుస్తోనే వున్నారు.

ఆ మౌనయాత్ర క్రమక్రమంగా చీకట్లను చీల్చుకొంటూ, ఒక్కొక్క చెట్టును పుట్టను దాటుకొంటూ ఊరు చేరువైంది. చలిని కూడ గమనించకుండా పరధ్యాన్నంగా గ్రామంలో ప్రవేశించగానే అందరూ ఆలోచనల నుండి బయటపడి గ్రామ వాతావరణాన్ని పరిశీలిస్తూ నడవసాగింద్రు.

ఉపాధ్యాయులు గ్రామంలోకి చేరేవరకే రాత్రి పది గంటలయింది. గ్రామం అంతా నిశ్శబ్దంగా వుంది. గ్రామం బాగానే వుంది. పెంకుటిల్లు, అక్కడక్కడ ఒకటి, అర బంగ్లాలు, పూరిగుడెసెలు- ఇండ్ల మధ్యలో రకరకాల చెట్లు, విశాలమైన బజారులు, మురికికాలువలు నిర్మించబడి శుభ్రంగా వున్నాయి. కిషన్‌రావు సిగరెట్టు ముట్టించి పొగను గాలిలోకి వదులుతూ పీక్కుపోయిన మొఖాన్ని తుడుచుకొంటూ 'మీ ఊరు యింత లోపలికి వున్నా బాగానే అభివృద్ధయింది" ఒక ప్రశంసను అందించాడు. దుప్పటి కప్పుకొన్న యువకుడు 'అవునుసార్ ఈ గ్రామ సంఘం స్వయంగా గ్రామాన్ని అభివృద్ధి చేయించింది. ఏ గవర్నమెంటోడు దీన్ని బాగు చేయలే. సంఘపోల్లే ఊర్లో వాళ్లందరితో మన ఊరిని మనమే బాగు చేసికోవాలి మనకు మనమే అభివృద్ధి కావాలి. యితరుల మీద ఆధారపడితే మనమెప్పుడు బాగుపడమని తెలియజెప్పి స్వయంకృషితో ఈ రోడ్లు, చెట్లు, మురికి కాలువలు, గ్రంథాలయం మొదలయినవి ఏర్పాటు చేసికొన్నాం." మీ వూర్లో బ్రాంది షాపున్నదా ?" ఆతురతతో అడిగాడు చలికి వణుకుతున్నట్లు కనిపించే నర్సింగం పంతులు. నర్సింగం పంతులు మధ్యవయస్కుడే అయినా తన స్వంత లాభం తప్ప మరేమి ఆలోచించని అనుభవశూన్యుడు. 'మందు' తాగుడు మహా సంబరం. కిషన్‌రావు నర్సింగంను చిరాకుగా చూసాడు. దుప్పటి కప్పుకొన్న యువకుడు తాపీగా నడుస్తూ "లేదు సార్. వూర్లో ఒక్క బ్రాందిసీసాగాని, సారా కుండ గాని కనిపియ్యదు. ఈ వూరు ఎప్పుడో తాగుడును నిషేధించింది. ఎవరైనా మీలాంటి వారు తాగాలనుకొంటే సిటీకి పోయినప్పుడు అక్కడే తాగి వస్తారు. ఇక్కడ కల్లు దొరుకుతుంది. కాని ఈ వుల్లో అమ్మరు. ప్రక్క గ్రామాల్లోకి పోయి అమ్ముకుంటరు. ఇది ఈ వూరి ప్రజలందరు కలిసి తీసికొన్న నిర్ణయం ". నర్సింగం పంతులు నెత్తిన తాటికాయ పడ్డట్టయింది. ఎంతో ఆశపడితే నిరాశే మిగిలింది. "మరి ఈ వూల్లో తాగేటోల్లే లేరా ?" మళ్లీ ఎక్కడో కొంత ఆశ. ఆ యువకుడు చిన్నగా నవ్వుతూ "మొదట్లో కొంత యిబ్బందిగానే వుండేది. దొంగతనంగా తాగి ఇంట్లో గొడవలు చేసేవారు. తాగిన తర్వాత కొందరు బజార్లో గొడవలు చేసేది. యిలాంటి పరిస్థితుల్లో సంఘం చాల జాగ్రత్తగా వ్యవహరించి వాళ్లకు అర్థమయ్యేట్లు చెప్పి క్రమంగా అందరూ మానేసింద్రు. యిప్పుడు ఈ వూర్లో ఎవ్వరూ తాగరు. తాగమన్నా తాగరు. ఇంకా ఎవరైనా కావాలనుకొంటే బయటికి పోయినప్పుడు కొంత తాగుతారు. అలాంటివారు నలుగురు, ఐదుగురు వుంటారు. వారినెవరూ పట్టించుకోరు". నర్సింగం పంతులు నిరాశగా నడుస్తోన్నాడు. బండి, ఎన్నికల సామాగ్రితో పాఠశాల ఆవరణలోకి ప్రవేశించింది. ఉపాధ్యాయులంతా బండి వెనుకే అనుసరించారు.

పాఠశాల ఆవరణ చాల అందంగా, చూడ ముచ్చటగా వుంది. ఉపాధ్యాయులంతా ఎవరి

సామాన్లు వారు సర్దుకొని రేపటికి సన్నాహాలు సాగించారు. ఒక మధ్య వయస్కుడు నెత్తిన గంపతో ఉపాధ్యాయులను సమీపించాడు. దుప్పటి కప్పుకొన్న యువకుడు ముందుకు వచ్చి నెత్తిన గంప దింపి "సార్ మొదట భోజనం చేయండి. తర్వాత పనులు చూసుకొందురు" గంపలోని సామాగ్రిని బయటికి తీస్తూ ఉపాధ్యాయులను పురమాయించాడు. ఉపాధ్యాయులంతా ఆశ్చర్యంలో మునిగారు. పొద్దుట్నుంచీ తిండిలేక దొరికిందల్లా తింటూ యిన్ని నీళ్లు తాగుతూ వచ్చిన మాకు ఈ రాత్రి తిండేడ దొరుకుద్దనుకొంటోన్న ఉపాధ్యాయులకు యువకుని మాటలతో ప్రాణాలు లేసివచ్చినాయ్. 'యిప్పుడిప్పుడే ఎలా చేసారు ?' తెలుగు పండితుడు తన సందేహాన్ని వెలిబుచ్చాడు. "మీరు ఎందరు వస్తారు అనే విషయం మాకు నిన్ననే తెలిసింది. రాత్రి భోజనాలు తయారు చేయించాం. రండి పొద్దుపోయింది. తిండి చల్లబడినాలె" అన్ని సర్దిపెట్టాడు దుప్పటి యువకుడు.

ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని బోరింగు వద్ద కాళ్లు చేతులు శుభ్రపరచుకొని భోజనాలకు ఉపక్రమించారు. వంటలు చాల రుచిగా వున్నాయి. ఉదయం నుండి తిండి తిప్పలు లేక నీరసంగా యున్న సిబ్బంది ఆవురావురంటూ భోజనం చేస్తున్నారు. నర్సింగం పంతులుకు మాత్రం భోజనం ముందు 'మందు' లేకపోయెననే అసంతృప్తి వుంది. "మీకు ఎలా కృతజ్ఞతలు తెలుపాలో మాటలు రావట్లేదు" కిషన్‌రావు ఉద్వేగంతో యువకులనుద్దేశించి అన్నాడు. "ఆఁ! ఇందులో ఏముంది సార్! మనమంతా ఒకే వర్గానికి చెందినవాళ్లమే గదా సార్! మీకు మేం, మాకు మీరు తోడుగా వుండాల్సిన వాళ్లం. ఈ మాత్రానికే ఏముంది సార్" ఒక యువకుడు సామానంతా గంపలో సర్ది నెత్తిన పెట్టుకొని వెళ్లిపోయాడు. ఉపాధ్యాయులు కరెంటు వెలుగులో ఎవరి పనులు వారు ముగించుకొంటున్నారు. బండి వెంట వచ్చిన యువకులు ఇళ్లల్లో భోజనాలు చేసి వచ్చారు. "సార్! మీరేం భయపడాల్సినవసరం లేదు. హాయిగ పని చేసికొని నిద్రపొండి"యువకులు అభయమిచ్చి ముసుగుతన్నారు. కొంతసేపయిన తర్వాత దుప్పటి కప్పుకొన్న యువకుడు ఉపాధ్యాయుల వద్ద సెలవు తీసికొని వెళ్లిపోయాడు. ఉపాధ్యాయులంతా సంతృప్తిగా నిద్రకుపక్రమించారు.

తెల్లవారి ఉదయం అందరూ సిద్ధమై ఓట్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 7 గం॥లకు ప్రారంభమైన తంతు సాయంత్రం 5 గం॥లకు ముగిసింది. జనం నిర్లిప్తంగా వచ్చి పోయారు. ఓటింగ్ పూర్తవగానే సామానంతా సర్ది బస్తాల్లో మూటకట్టి బండిమీద వేసారు. బండి నడుస్తోంది. సాయంత్రం నీరెండలో తిరుగు ముఖం పట్టారు. ఊర్లో జనం ఎవరూ పట్టించుకోకుండా నిరాసక్తంగా వున్నారు. పార్టీల ఏజెంట్లు ఎవ్వరూ లేరు. అన్నీ తామై, తామే అన్నైనట్లు ఆ యువకులే ఓట్లు వేయించి, ఓట్ల డబ్బాలను రోడ్డుపైకి చేరవేసే భారాన్ని మోస్తూ ఉపాధ్యాయులెంట నడుస్తోన్నారు:

సాయంత్రం నీరెండలో ముందు బండి వెనక యువకులు ఉపాధ్యాయులు నడక ప్రారంభించారు. డొంక కిరుపక్కలా వున్న చెట్లు వీడ్కోలు పలుకుతున్నట్లు తలలూపుతున్నాయి. కిషన్‌రావు సిగరెట్టు అంటించాడు. సీతారామ శాస్త్రి నశ్యం పొడి ఎగపీల్చుతోండు. కిషన్‌రావు సిగరెట్టు పొగ వదులుతూ "ఈ ఎన్నికల తతంగం ఇలా తగలబడింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ఓట్లు వేయండి, వేయించండి అంటోన్న ప్రభుత్వానికి ఓట్లు కావాలిగాని ఉపాధ్యాయుల పాట్లు ఎవరికి కావాలి? తిండి తిప్పలు లేక నానా యాతనలు పడే ఉద్యోగులను ఓట్లు పడగానే పట్టించుకొనే నాథుడే వుండడు" అనుకొంటూ నడుస్తోన్నాడు. ముందు నడుస్తోన్న గ్రామ యువకులను చూస్తూ వారి కాలి తాకిడితో పైకి లేచే ఎర్రని దుమ్మును పరిశీలిస్తూ "ప్రతిసారీ ప్రజాస్వామ్యం అంటూ చేస్తోన్న ప్రహసనంలో ఈ ప్రస్తావన తప్పదేమో" అనుకొంటూ కిషన్‌రావు వారి ననుసరిస్తోండు.

సూర్యుడు పడమటి కొండల్లోకి చెట్ల సందుల్లోంచి వెళ్లగానే చీకట్లు కమ్ముకున్నాయి. మసక

చీకట్లు ముసురుతోండగా ఓట్ల డబ్బాలు రోడ్డు చేరాయి. నల్లని తారురోడ్డుకు వరసగా పోలీసులు తుపాకులను ధరించి దర్శనమిచ్చారు. యువకులు నిర్లిప్తంగా రోడ్డెక్కారు. ఉపాధ్యాయులు చెట్టూ పుట్టా చూస్తూ రోడ్డెక్కుతోన్నారు. కిషన్‌రావు చేతిలోని సిగరెట్టును డొంక పక్కల్లోని పొదల్లోకి విసిరి రోడ్డెక్కాడు. చీకట్లు కమ్ముతోండగా డబ్బాలన్ని పోలీసు రక్షణలోకి వెళ్లిపోయాయి. ఉపాధ్యాయులు ఒక్కొక్కరే సిద్ధంగా వున్న బస్సులోకి వెళ్లుతున్నారు. త్వరగా త్వరగా అంటూ సి.ఐ. భయంకరరావు హుకుం జారీ చేసాడు. కిషన్‌రావు ఆఖరుగా వుండి బస్సెక్కే ముందు రాత్రి దుప్పటి కప్పుకొన్న యువకున్ని సమీపించి నీ పేరేంటి తెలుసుకోవచ్చా ? అంటూ నిన్నటినుండి వేధిస్తోన్న ప్రశ్నను బయటపెట్టాడు. ఆ యువకుడు చిరునవ్వుతో 'చంద్రం' నాపేరు. నేను ఈ గ్రామ సంఘం అధ్యక్షున్ని అని సమాధానమిచ్చాడు. కిషన్‌రావు నోట మాట పెగల్లేదు. కళ్లల్లో నీళ్లు ఉబుకుతోండగా 'కలుస్తా' నంటూ భారమైన హృదయంతో బస్సెక్కి పడమటి దిశవైపు ఓట్లడబ్బాలతో వెళ్లి పోయిండు.

కిషన్‌రావు విసిరిన సిగరెట్టు నిప్పు పొదలోని ఎండిన ఆకులను రగిలించి చిన్న మంట లేపింది. ఆ వెలుతురులో చంద్రం రేపటి సూర్యుని కోసం ఎదురుచూస్తూ నడక ప్రారంభించిండు. యువకులు చంద్రాన్ని అనుసరించారు.

-పరిమళ

సాహిత్యహీనుడు

అక్షరాల్ని అగ్ని కణికలుగా రగిల్చి
నిర్బంధాలకు నిప్పు పెట్టనివాడు
మాటలను తూటాలుగా మల్చి పోరాట పటాలాల కందించనివాడు
సర్వశక్తిమయ సాహిత్యాన్ని లక్ష్యం తప్పని లక్షణాలతో
దోపిడి స్థావరాలను ఛేదించే విప్లవ విస్ఫోటనాలుగా మార్చి
నిర్దాక్షిణ్యంగా పేల్చనివాడు
నిర్భయుంగా కూల్చనివాడు
బూర్జువాల అసహ్యపు వివర్జనాలకన్నా హీనం.

-ఎస్పెస్బీజీ

వట్టికోట ఆళ్వారు స్వామిగారి నవల

ప్రజల మనిషి

ఒక పరిచయం

రచన : వరవరరావు

యుగ ప్రచురణలు

వెల : 12 రూ.

ప్రతులకు : 203, లక్ష్మి అపార్ట్‌మెంట్స్, నల్గొండ చౌరస్తా
మలక్‌పేట, హైద్రాబాద్ - 500036

చర్చ

బ్రహ్మానందం ధ్యానం వేదాంతాలలో సాంగత్యం

(గత సంచిక తరువాయి)

మానవుని స్వాభావిక లక్షణం చైతన్యమేగాని సుప్తచేతన ఆకాంక్షలు కాదు.

భౌతిక ప్రపంచాన్నీ, వ్యక్తిగత అస్థిత్వాన్నీ మనిషి ఆకళింపు చేసుకోవటంలో చురుకుగా పాలుపంచుకునే మానసిక క్రమాల మొత్తమే చైతన్యం. 'చైతన్యం' అన్నా 'మనసు', 'ఆలోచన', 'జ్ఞానం', 'భావం', 'ఆధ్యాత్మికం' అన్నా సారాంశంలో ఒకటే. ప్రముఖ రష్యన్ శాస్త్రజ్ఞులు సెచినోవ్, పావ్‌లోవ్‌లు చైతన్యం అనేది శారీరక ధర్మాల పునాది రీత్యా ప్రతిబింబ స్వభావం కలిగిన మానసిక క్రమమనీ శాస్త్రీయ పరిశోధనల ద్వారా నిరూపించారు. చైతన్యం ఒక బహుముఖ పరిణామక్రియ. ఇంద్రియానుభూతి, అనుభూతి, భావన, ఆలోచన, ఇచ్ఛ, సంవేదన వంటి వివిధ మానసిక కార్యకలాపాలు దాని కిందికి వస్తాయి.

భౌతిక వస్తువుల ధర్మాలు, సంబంధాలు మానవుని మెదడులో ప్రతిరూపాల రూపంలో అంటే భావాల రూపంలో ప్రతిబింబిస్తాయి. భావన అనేది ఒక ప్రత్యేక పదార్థంగానీ, మెదడులో భౌతిక క్రమానికి సంబంధించిన ఒక ఉపలక్షణం గానీ కాదు. అది మెదడు కార్యకలాపాల ఉత్పత్తి ఫలితం. చైతన్యం ఒకే ఒక విభజించ వీలులేని అంశం కాదు. కారల్ మార్క్స్ చైతన్యం అనేది దాని చలనంలోని వివిధ సందర్భాల మొత్తమనీ అన్నారు. చైతన్యానికి సంబంధించిన విశేష లక్షణాలను సవివరంగా పరిశీలిస్తే అందులో జ్ఞానం (knowledge), స్వీయ చైతన్యం (self consciousness), ఉద్వేగాలు (emotions), కల్పనాశక్తి (imagination), సంకల్పం (will) వంటి అంశాలు వెల్లడవుతాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, గతితార్కిక భౌతికవాదం చైతన్యాన్ని, అస్థిత్వం గురించి తెలుసుకోవటంగానూ; వాస్తవం యొక్క మానసిక ప్రతిబింబంగానూ; వ్యక్తికీ, వ్యక్తి బయట ఉన్న ప్రపంచానికీ మధ్య సంబంధంగానూ, ఒక ప్రత్యేక పద్ధతిలో నిర్మితమైన పదార్థ ధర్మంగానూ, భౌతిక ప్రపంచానికి స్వీయాత్మక ప్రతిరూపంగానూ; భౌతికమైన దానికి భిన్నమైన భావరూపంగానూ పరిగణిస్తుంది.

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ ఇలా అన్నారు :

"ప్రకృతి, పదార్థం, భౌతికము, బాహ్య ప్రపంచము, వీటిని ప్రధానంగా తీసుకుని చైతన్యం, మనసు, ఇంద్రియ సంవేదన (మనకాలంలో విస్తృత ప్రయోగంలో ఉన్న పరిభాషననుసరించి - అనుభవం) మానసికము మొదలగువాటిని ద్వితీయంగా పరిగణించాల్సి ఉంటుందా ? - ఇదే మూల ప్రశ్న వాస్తవంగా తత్వవేత్తలను మునుపటిలాగే రెండు పెద్ద శిబిరాలుగా ఇంకా విభజిస్తూనే ఉంది".

*　　　*　　　*

"ఇది ఖచ్చితంగా భావవాదం; ఎందుకంటే అది మానసిక విషయాన్ని అంటే చైతన్యం, భావం,

ఇంద్రియానుభూతి మొదలగువాటిని తక్షణ విషయంగానూ, భౌతికమైన విషయాన్ని దీనినించి ఉత్పన్నమైన అంశంగానూ, దీనికి ప్రత్యామ్నాయంగానూ వివరిస్తుంది".

* * *

"....... అప్పుడు మాత్రమే ప్రకృతిశాస్త్రం, భౌతికవాదాలకు నిజంగా అనుగుణమైన ప్రపంచ చిత్రాన్ని మనం పొందగలం.......మానసికము, మనసు మొదలగునవి పదార్థం (భౌతికమైనది) యొక్క అత్యున్నత ఉత్పత్తి. అది పదార్థమంతటిలోకి సంక్లిష్టమైన ఆ ప్రత్యేక విభాగమైన మనిషి మెదడు యొక్క ధర్మం" (the psychical, the mind etc., is the highest product of matter (i.e. the physical), it is a function of that particularly complex fragment of matter called human brain).

(వి.ఐ. లెనిన్ : మెటీరియలిజం అండ్ ఎంపిరియోక్రిటిసిజం, పేజీలు 209, 315)

సామాజికంగా అభివృద్ధి చెందిన మానవుడు మాత్రమే కలిగి ఉండే చైతన్యం మనిషి ఉద్దేశపూర్వకంగా చేసే శ్రామిక కార్యకలాపాల్లో భావపరమైన అంశంగా ఉంటుంది. ఆలోచనాశక్తి మానవుని ప్రత్యేక లక్షణం. మానవుని స్వాభావిక లక్షణం అతని చైతన్యమే గాని అతని సుప్తచేతన అలజడులు కాదు. ఇదే విషయాన్ని 1940వ దశకంలో ప్రముఖ సోవియట్ మనస్తత్వవేత్త ఎ. ఎ. స్మిర్నోవ్ ఇలా వివరించారు :

"సోషలిస్టు సమాజంలో మానవుని వ్యక్తిగత ఆకాంక్షలు సామాజిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండవు. పైగా అవి సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయి...... వ్యక్తిగత ప్రయోజనాలకు సామాజిక ప్రయోజనాలకు మధ్య ఉండే ఈ పొందిక, వాటి మధ్య ఉండే ఈ ఐక్యత, మానవుని వ్యక్తిగత ఆకాంక్షల అణచివేతగా మాత్రమే సామాజిక ప్రభావాలు వ్యక్తమవుతాయనే సిద్ధాంతాలన్నీ ఎలా తప్పో నిరూపిస్తాయి. అలాంటి సిద్ధాంతాల్లో డెప్త్ (నిగూఢమైన) సైకాలజీ ధోరణులకు తోడు ఫ్రాయిడ్ సిద్ధాంతం కూడా ఉంది. వ్యక్తిత్వానికి సంబంధించిన 'నిగూఢమైన పొరలపై" ఆధారపడిన సిద్ధాంతాలను తిరస్కరించడాన్ని ఇప్పటికే పైన చెప్పిన మాటలు సమర్థిస్తాయి. మానవ వ్యక్తిత్వాన్ని నిర్ణయించేది శారీరక అవసరాలు లేదా "అంతశ్చేత'నే (subconscious) తప్ప హేతువు, చైతన్యం కానే కాదనడం వల్ల కూడా ఆ సిద్ధాంతాలను తిరస్కరించడం సమర్థనీయమే అవుతుంది. ఈ సిద్ధాంతాలు చైతన్యాన్ని శారీరక అవసరాలను తీర్చే సాధనంగా మాత్రమే చూస్తాయి. కానీ నిజానికి చైతన్యం అనేది, మానసిక జీవనం యొక్క అత్యున్నత రూపం, మానసిక జీవనాభివృద్ధి యొక్క అత్యున్నత దశ. మనిషి స్వాభావిక లక్షణం సహజ ప్రేరణల చీకటి శక్తుల ఆధిపత్యం గానీ, అంతశ్చేతన గానీ కాదు; ప్రపంచాన్ని స్పష్టంగా, సరైన విధంగా ప్రతిఫలించే అతని హేతువు ఆధిపత్యమే అతని స్వాభావిక లక్షణం. కాబట్టి మేము విద్యకు సంబంధించిన అత్యున్నత లక్ష్యంగా చైతన్యాభివృద్ధిని గుర్తిస్తాం. చైతన్యం ఆధిపత్యం కింద ప్రవర్తనంతటినీ ఉంచుతాం. సహజ ప్రేరణలు, అంతశ్చేతన మనిషిని వెనక్కి నెడతాయి, హేతువు అతన్ని ముందుకు నడిపిస్తుంది. అభివృద్ధికరమైన భావాల కోసం, మానవాళి సుందర భవిష్యత్తు కోసం పోరాడాలనుకునే ప్రతి ఒక్కరూ మానవుని మానసిక పునాదిగా సహజ ప్రేరణలు, స్వభావసిద్ధమైన లేదా సుప్తచైతన్యపు (unconscious) ఆకాంక్షలు ఉంటాయనే సిద్ధాంతాలను తిరస్కరించాలి. అలాంటి సిద్ధాంతాలను నెత్తికెత్తుకుని, సహజ ప్రేరణలు, సుప్త చైతన్యపు ఆకాంక్షలు మనిషిని నియతం చేయడాన్ని సమర్థించే ప్రయత్నాలన్నీ అభివృద్ధి నిరోధకత్వానికే ఉపయోగపడతాయి.

అందుకే ఫాసిజం ఇలాంటి సిద్ధాంతాలను బాగానే వాడుకుంది.

(ఎ.ఎ. స్మిర్నోవ్ రాసిన 'సోవియట్ మనస్తత్వశాస్త్ర అభివృద్ధి' వ్యాసం నుండి, వక్కాణింపు మాది)

చైతన్యం, "సుప్త చైతన్యం" విషయాల్లో పై మార్క్సిస్టు బోధనలకు భిన్నంగా భావవాద సిద్ధాంతాలు సుప్తచైతన్యాన్ని, "చైతన్యానికి అవగతం కాని, సహజప్రేరణలచే నిర్ణయింపబడే శాశ్వతమైన, మార్పుల కతీతమైన కోరికలు, ఉద్దేశ్యాలు, ఆకాంక్షలు కేంద్రీకృతమయ్యే మానసిక కార్యకలాపాల ప్రత్యేక రంగం"గా అభివర్ణిస్తున్నాయి. ఈ సుప్తచేతనా భావవాద సిద్ధాంతమే పూర్తిగా అభివృద్ధి చెందిన రూపంలో మనకు ఫ్రాయిడిజంలో కనపడుతుంది. మార్క్సిస్టు మహోపాధ్యాయులందరూ చైతన్యాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో నిర్మితమైన పదార్థధర్మంగానూ, మనిషి మెదడుకు సంబంధించిన ప్రత్యేక ప్రక్రియగానూ ఎప్పటికప్పుడు స్పష్టీకరించినప్పటికీ, సోవియట్ మనస్తత్వవేత్తలు 'సుప్తచేతన' భావనను ఏనాడో నిర్ద్వందంగా ఖండించినప్పటికీ, ఇవేవీ దృష్టిలో పెట్టుకోకుండా టి.ఎం.ఎస్. ఇంకా 'సుప్తచేతన' భావనను పట్టుకుని వేళ్ళాడుతూ, "మనిషి ప్రవర్తనని అదుపులోకి తేవడానికి సుప్తచైతన్య వ్యక్తీకరణల్నీ, అది నిర్వహించే పాత్రనీ ఇంకా విపులంగా అధ్యయనం చేయాలంటు"న్నారు.

టి.ఎం.ఎస్. తన అరుణతార వ్యాసంలో సుప్తచేతనను "వాస్తవంతో నియతం చెయ్యబడి నటువంటి వ్యక్తికి తెలియని మానసిక చర్యల, దశల, క్రమాల మొత్తం"గా నిర్వచించారు. కానీ, మార్క్సిస్టు సిద్ధాంత వివరణ ప్రకారం వ్యక్తికి తెలిసిన మానసిక చర్యలు, దశలు, క్రమాలు ఉన్నాయేగాని వ్యక్తికి తెలియని మానసిన చర్యలు, దశలు, క్రమాలు లేవు. వ్యక్తికి ఆ మానసిక కార్యకలాపాలను శాసించే నియమాల గురించి తెలియకపోవచ్చుగానీ అసలు తన మానసిక కార్యకలాపాల్లో కొన్నింటి గురించి తెలియదనడం అర్థరహితమైనది. జంతువులకు భిన్నమైన మానవ మానసిక కార్యకలాపమనేది మనిషి విశిష్ట లక్షణం. మానవ మానసిక కార్యకలాపం అంటేనే బాహ్య వాస్తవం గురించీ, తన ఆలోచనల గురించీ మానవుడు తెలుసుకునే క్రమం. మానవుని వివిధ రకాల మావసిక కార్యకలాపాల మూలంగానే ఎంతో వైవిధ్యంతో కూడుకున్న చైతన్యం యేర్పడుతుంది. భౌతిక ప్రపంచంతోపాటు వ్యక్తిగత అస్థిత్వాన్ని తెలుసుకోవడంలో క్రియాశీలకంగా పాలుపంచుకునే మానసిక క్రమాలన్నింటి మొత్తాన్నే చైతన్యమనీ, అది భౌతిక ప్రపంచానికి ప్రతిబింబమనీ గతితార్కిక భౌతికవాదం వివరిస్తుంది. అలాంటప్పుడు టి.ఎం.ఎస్. గారూ ! వాస్తవాలతో నియతం చెయ్యబడినటువంటి వ్యక్తికి తెలియని మానసిక చర్యలు, దశలు, క్రమాలు ఎక్కడివి ? చైతన్యానికి అవగతం కాని మానసిక కార్యకలాపాల ప్రత్యేక రంగమే సుప్తచేతన అనేది భావవాద సిద్ధాంతం కాదా ? మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ స్టాలిన్ మరణానంతరం ఆధునిక రివిజనిస్టుల మార్గదర్శకత్వాన సోవియట్ యూనియన్‌లో పుట్టగొడుగుల్లా విడుదలైన మార్క్సిస్టు తత్వశాస్త్ర, మనస్తత్వ శాస్త్ర పుస్తకాలు, నిఘంటువులు తదితర గ్రంథాల్లో మానవ మానసిక క్రమాలన్నీ చైతన్యంలోకి చేరవు, వాటిలో అనేకం సుప్తచైతన్యంగా వ్యక్తం అవుతాయనో, మనస్సులోని కింది స్థాయిని సుప్తచేతనగా పై స్థాయిని చైతన్యంగానో వివరిస్తూ అనేక తప్పుడు సూత్రీకరణలు, అశాస్త్రీయమైన భావనలు చోటుచేసుకున్నాయి. ఈ లోపభూయిష్టమైన సుప్తచేతనా భావవాద సిద్ధాంతాన్నే ఇప్పుడు టి.ఎం.ఎస్. మార్క్సిజం పేరుతో చెలామణి చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇది ఎంత నిరసించదగిన విషయమో ప్రత్యేకించి వివరించాల్సిన అవసరం లేదు.

టి. ఎం. ఎస్. ఇంకా తనో వ్యాసంలో "సుప్తచేతన ప్రతిబింబించే వాస్తవం విషయ (subject) ఆవేశ అనుభవంతోనూ, పరిసరాల విషయంలో యేర్పడిన భావ దృష్టుల్తోనూ సమ్మేళనం చెందుతుంద"ని

చెప్పటం లెనినిస్టు ప్రతిబింబ సిద్ధాంతానికే విరుద్ధమైనది. అసలు వ్యక్తి ఆవేశ అనుభవాలనేవే బాహ్యప్రపంచపు ప్రభావాల ఫలితం అయినపుడు, ప్రతిబింబించే వాస్తవం వ్యక్తి ఆవేశ అనుభవంతో ఎలా సంలీనం చెందుతుంది ? వాస్తవం యొక్క ప్రతిబింబానికి భిన్నమైన విషయాలుగా వ్యక్తి ఆవేశ అనుభవాల్నీ, భావదృష్టుల్నీ గుర్తించడమంటే అవి అంతర్గతంగా తలెత్తుతాయనే భావవాద అభిప్రాయాన్ని ముందుకు తీసుకరావడమే తప్ప మరేమీ కాదు. అంతేగాక, సామాజిక అస్తిత్వం మనిషి సామాజిక చైతన్యంలో ప్రతిఫలించడమనేది, జడాత్మక ప్రతిఫలనగానీ, యాంత్రికమైన అద్దంలోవలె ప్రతిఫలించడంగానీ కాదు. అది జీవితం పట్ల మనిషి క్రియాశీలక దృష్టి ఫలితంగా రూపొందిన సంక్లిష్టమైన వైరుధ్యాలతో కూడుకున్న క్రమం. అందువల్ల సామాజిక చైతన్యాన్ని వివరించేపుడు ప్రతిఫలన అంశాన్నేగాక ప్రపంచం పట్ల మనిషి క్రియాశీలకమైన, కార్యసాధకమైన దృష్టిని కూడా ఎత్తిచూపాలి. ఇదే విషయాన్ని వ్యక్తం చేస్తూ కామ్రేడ్ లెనిన్ "మానవుని చైతన్యం భౌతిక ప్రపంచాన్ని ప్రతిబింబించడమేగాక దాన్ని సృష్టిస్తుంద"ని అన్నారు.

సుప్తచేతన వల్ల "విషయ చేష్టల్ని ప్రయత్నపూర్వకంగా అదుపు చెయ్యలేము, ఫలితాన్ని అంచనా వెయ్యలేమ'నే టి.ఎం.ఎస్. అభిప్రాయానికీ, మనిషి గమ్యం విధికృతంగా ముందే నిర్ణయింపబడుతుందనే ఫ్రాయిడియన్ దృక్పథానికీ మధ్య సారాంశంలో తేడా ఏమీ లేదు. మానవ చైతన్యానికి సంబంధించిన ఒక ముఖ్యమైన అంశం స్వీయచైతన్యం అనే విషయాన్ని విస్మరించినందువల్లనే టి.ఎం.ఎస్. ఈ నిర్ధారణకు వచ్చారు. స్వీయచైతన్యం అనేది మానవుని స్వీయ అంచనా. అతని ప్రవర్తన, నైతికత, ఆదర్శాలు, ప్రయోజనాలపై అతని అంచనా. అంటే, స్వీయ చైతన్యంలో మనిషి తన సొంత సారాన్ని తెలుసుకుని దాన్ని ప్రతిబింబిస్తాడు. కారల్‌మార్క్స్, "మానవుడు తన ప్రధానమైన అస్తిత్వాన్ని గ్రహించడం అంటే అది కేవలం అతని స్వీయచైతన్యమ"ని అన్నారు. మనిషి తన స్వీయచైతన్యంతో తనని తాను బయట నించి చూసుకుని, తన ప్రవర్తనను తనంతతానుగా అదుపు చేసుకుని, తన చర్యలను పోల్చి చూసుకుని తద్వారా ఇతరుల చర్యలతో తనను పోల్చి చూసుకుని, మారుతున్న సాధారణ పరిస్థితిలో తనను దర్శించుకుంటాడు. జంతువులకు స్వీయచైతన్యం ఉండదు. అది మానవులకు ప్రత్యేకం. జంతువులు ప్రకృతిసిద్ధమైన ప్రక్రియల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకుంటూ వాటిలో భాగమవుతాయి. మానవుడు శ్రమశక్తి వల్ల శ్రమ సాధనాలు వినియోగించడం వల్ల ఆ ప్రక్రియల్లో పరోక్షంగా పాల్గొనడం ద్వారా ప్రకృతి నించి వేరుపడతాడు, దానికి ఎదురు నిలిచి, తనను తాను ప్రకృతి కంటే విభిన్నమైనవాడిగా దర్శించుకుంటాడు. అతను మనసులోనే తన ప్రపంచాన్ని రెండు భాగాలుగా విభజించుకుంటాడు - మానవ వ్యక్తిత్వానికి మానసిక కేంద్రమయిన తను, తనకు చుట్టూ ఉన్న మిగిలినవన్నీ అంటే "తను కానివి". స్వీయచైతన్యం వల్ల మనిషి తన చుట్టూ వున్న యావత్తు ప్రపంచంలో భాగంగా తనను చూసుకుంటున్న విధంగా అతను తన చర్యను అదుపు చేసుకుంటాడు.

సామాజిక చారిత్రక క్రమానికి వస్తే, మనిషి తన చైతన్యాన్ని, సంకల్పాన్ని ఆలోచనలనూ, చర్యలను నియంత్రించే భౌతిక నియమాలను, చైతన్యయుతంగా కానీ కాకపోనీ, ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటాడనే దాని ప్రకారం మనిషి తనను, తన ప్రవర్తనను అదుపు చేసుకోగలుగుతాడు. ఈ నియమాలను తెలుసుకుని, ప్రజలు తమ ప్రవర్తననూ, అభివృద్ధినీ, ఇతరుల ప్రవర్తననూ అభివృద్ధినీ చైతన్యయుతంగా క్రమబద్ధీకరించుకునేలా సహాయపడటం సైకాలజీ కర్తవ్యం అవుతుంది. కార్మిక వర్గ

మహోపాధ్యాయుడు ఏంగెల్స్ ఇలా అన్నారు :

"స్వాతంత్రం అంటే మన మీద మనకు అదుపు. బాహ్య ప్రకృతి మీద అదుపు. సహజ ఆవశ్యకతకు సంబంధించిన జ్ఞానంపై ఈ అదుపు ఆధారపడి ఉంటుంది. కాబట్టి అది తప్పనిసరిగా చారిత్రకాభివృద్ధి ఫలితమే అవుతుంది".

(ఏంగెల్స్ : ఆంటీ డూరింగ్, పేజీ 144)

టి.ఎం.ఎస్. "సుప్త చైతన్యంలో విషయ వాస్తవికతని స్వాయత్తీకరణం (Assimilation), అభిజ్ఞానం (Identification) మొదలైన రూపాల ద్వారా ఇతర వ్యక్తుల్తో, దృగంశాల్తో అనుభవం పొందుతాడ"ని అంటూ ఫ్రాయిడ్ విస్తృత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన 'ఈడిపస్ కాంప్లెక్స్'నే చాటి చెబుతున్నాడు. ఈడిపస్ అనే గ్రీక్ పురాణగాధలో ఈడిపస్ అతని తండ్రిని చంపి తల్లిని పెండ్లాడుతాడు. ఈ ప్రవృత్తి ప్రతి మగవాడినీ కుంగదీసే క్లిష్టమైన లైంగిక భావాలకు సమాధానం చెప్పగలుగుతుందనీ ఫ్రాయిడ్ భావించాడు. ఫ్రాయిడ్ ప్రకారం 'ఈగో'లో ఉన్నతమైన సుప్తచేతన ప్రాంతాన్ని 'సూపర్ ఈగో' అంటారు. ఈ డిపస్ కాంప్లెక్స్ దశలో కొడుకు తనను తాను తండ్రితో identify చేసుకోవటం పర్యవసానంగా సూపర్ఈగో యేర్పడుతుంది. ఆ పిల్లవాడు తండ్రితో తాదాత్మ్యం చెంది, అతన్ని అనుసరిస్తూ, అతని వలెనే తయారవుతాడు. తన తండ్రి ప్రతిరూపాన్ని assimilate చేసుకుని అతని పురుషత్వాన్ని, బెదిరింపులను, ఆదేశాలను, నిషేధాలను కూడా అనుకరిస్తాడు.

సుప్తచేతన విషయంలో ఫ్రాయిడ్ చెప్పిన వివరణలన్నీ తప్పులేననీ, సుప్తచేతన వాస్తవాలతో నియతం చెయ్యబడుతుందనీ టి.ఎం.ఎస్. చెప్పారు గనుక ఆయన ఫ్రాయిడిజాన్ని వ్యతిరేకిస్తున్నాడనే అభిప్రాయం యేర్పడవచ్చు. కానీ ఆయన వ్యాసాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే, మనిషికీ సామాజిక పరిసరాలకీ మధ్య అన్యోన్య చర్య విషయంలో మార్క్సిస్టు అవగాహనకూ, మానవుని అభివృద్ధిలో సామాజిక శక్తుల పాత్రకు సంబంధించిన శాస్త్రీయ విశ్లేషణకూ ఆ వ్యాసం పూర్తి విరుద్ధమని స్పష్టమవుతుంది. టి.ఎం.ఎస్. దృష్టిలో వాస్తవం అనేది కేవలం అంతర్గత తీవ్ర ఉద్వేగాల సంఘర్షణా మానసిక రంగానికీ, సకల మానవ సుప్త చైతన్య మానసిక కార్యకలాపాలకు భూమికను యేర్పరుస్తుంది. మనిషి ప్రవర్తనను నిర్దేశిస్తూ సుప్తచేతన మనిషి జీవితంలో అత్యంత ప్రముఖపాత్ర నిర్వహిస్తుందని వివరించే ఫ్రాయిడ్ మౌలిక సిద్ధాంతాన్నే టి.ఎం.ఎస్. మరో రూపంలో చాటి చెబుతున్నాడనేది ప్రత్యేకించి గమనించాల్సిన విషయం.

చైతన్యపు సంఘర్షణ లేక సుప్త చేతన వ్యక్తీకరణలు

సుప్త చైతన్యం ఏ యే విషయాల్లో వ్యక్తమవుతుందో వివరిస్తూ టి.ఎం.ఎస్. ఇలా అన్నారు, "చిన్న పిల్లలు వాస్తవాన్ని అర్థం చేసుకోవటంలో, ఆదిమ ఆలోచనలో, సహజజ్ఞానంలో, ఆవేశ తక్షణ స్పందనల్లో, గాభరాలో, భయాందోళనల్లో, హిప్నాటిక్ దశలో, కలల్లో, అలవాటుగా మారిన పనుల్లో, చైతన్యపూర్వస్థితి జ్ఞానంలో, అప్రయత్నంగా జ్ఞాపకం చేసుకోవటంలో, ఆశ నిరాశల్లో, గాఢమైన సంవేదనల్లో, నిర్దిష్ట విషయం తనకు తెలియకుండా చేసే పనుల్లో సుప్తచైతన్యం వ్యక్తమవుతుంది".

టి.ఎం.ఎస్. పై పేరాలో చైతన్యం కిందికి వచ్చే పలు అంశాలను సుప్తచేతన వ్యక్తీకరణలుగా

పేర్కొన్నాడు. చిన్న పిల్లలు వాస్తవాన్ని అర్థం చేసుకోవటంలో సుప్తచైతన్యం వ్యక్తమవుతుందనటం చాలా దారుణమైన విషయం. అతి పిన్న వయసులోనే సుప్తచైతన్యంలో అనేక లైంగిక ప్రేరణలు, సంవేదనలు, కోరికలు పోగవుతాయనీ చెప్పే ఫ్రాయిడ్ అశాస్త్రీయమైన భావనే ఈ అభిప్రాయానికి ఆధారం. వాస్తవాన్ని అర్థం చేసుకోవటం అంటే జ్ఞానాన్ని సముపార్జించటం లేదా చైతన్యాన్ని పొందడం. చైతన్యం అంటే జ్ఞానమే. కార్మికవర్గ మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ "చైతన్యం ఉన్న విధమూ, ఏదో ఒకటి అందులో ఉన్న విధమూ, ఇదే తెలుసుకోవటమనేది" అని అన్నారు. చైతన్యాన్ని మౌలికంగా భౌతిక వాస్తవికతను ప్రతిబింబించడంగానూ అంటే తెలుసుకోవటంగానూ పరిగణిస్తాం. జ్ఞానం లేకుండా చైతన్యం వుండదు. టి.ఎం.ఎస్. వాక్యంలోని చిన్న పిల్లలు 'వాస్తవాన్ని అర్థం చేసుకోవటంలో' అనే మాటలకు బదులు 'చైతన్యం పొందటంలో' అనే మాటలు ఉపయోగించినా వాక్యార్థం ఈషణ్మాత్రం మారదు. అప్పుడు ఆ వాక్యం ఇలా మారుతుంది- చిన్న పిల్లలు చైతన్యాన్ని పొందటంలో సుప్త చైతన్యం వ్యక్తమవుతుంది. ఈ మాటలు ఎంత అర్థరహితమో వేరుగా చెప్పనక్కరలేదు. నిజానికి, చిన్నపిల్లలు వాస్తవాన్ని అర్థం చేసుకోవటంలో వ్యక్తమయ్యేది సామాజిక పరిస్థితుల పాత్రేగాని టి.ఎం.ఎస్. చెబుతున్నట్టుగా సుప్త చైతన్యం కాదు.

భౌతిక జీవన పరిస్థితులు, శిక్షణ (Education) లచే నిర్ణయించబడే పిల్లల జీవన పరిస్థితులు, వారి కార్యకలాపాల పెరుగుదలపై ఆధారపడి పిల్లల మనసు ఎదుగుతుంది. జీవితంలోకి వేసిన మొట్టమొదటి అడుగులతోనే పిల్లలు పెద్దల సమాజంలోకి అడుగిడతారు. సమాజం అభివృద్ధి చేసిన కార్యకలాపాలను, మానవాళి సామాజిక కార్యాచరణను ప్రతిబింబించే భాషనూ వారు సమాజం నించే నేర్చుకుంటారు. పిల్లల పరిసరాలు వారికి అన్ని రకాల కర్తవ్యాలు, అవసరాలను చూపిస్తాయి. తద్వారా వారు ఆ కర్తవ్యాలు, అవసరాల కనుగుణమైన కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేలా ఆ పరిసరాలే వారిని ప్రేరేపిస్తాయి. అలా సామాజిక పరిసరాలు పిల్లలకు శిక్షణ గరిపి విద్యావంతుల్ని చేస్తాయి.

బోధన, శిక్షణల లక్ష్యాల గురించి సమాజం చైతన్యయుతమైన వాతావరణం కల్పించనిదే అలా జరగదు. అతి పిన్నవయసులోనే ఆరంభమయే ఈ చైతన్యయుతమైన, ప్రయోజనకరమైన శిక్షణాక్రమం, వేరే రూపాల్లోనే అయినా, స్కూల్లో కిండర్ గార్టెన్‌లో, సామాజిక జీవితంలో కొనసాగుతుంది. ఈ క్రమంలో పిల్లలు మానసికంగా ఎదుగుతారు. పిల్లల మానసికాభివృద్ధి శిక్షణ ప్రభావం లేని యాదృచ్ఛికమైన, అంతర్గతంగా నియంత్రించబడిన క్రమం కాదు; ఇందుకు విరుద్ధంగా, పిల్లల అభివృద్ధిలో బోధన ప్రముఖ పాత్ర వహిస్తుంది. శిక్షణ అనేది ప్రధానంగా పిల్లల జీవితాన్నీ, కార్యకలాపాలనూ క్రమబద్ధీకరిస్తుంది.

శిక్షణలో ఒక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే, అది పెద్దల చైతన్యయుతమైన కార్యాచరణ ద్వారా మాత్రమేగాక, పిల్లలు తమంత తాము అంతకంతకూ అధికంగా చైతన్యయుతంగా సాగించే కార్యకలాపాల మీద కూడా ఆధారపడి వుంటుంది. ఎందుకంటే పరిసరాలు, బోధనల ప్రభావానికి అతీతంగా పిల్లలు ఎప్పుడూ జడాత్మకంగా ఉండిపోరు. ప్రముఖ సోవియట్ విద్యావేత్త మకరెంకో చెప్పినట్టు, "మనం బోధనా శాస్త్రానికి సంబంధించిన ఒక పెద్ద దుర్గుణం నించి అంటే పిల్లలు విద్య లక్ష్యాలనే నమ్మకం నించి బయటపడాలి. వారు అలా కానే కాదు, వారు సజీవ జీవితాలు. అదీను చాలా అందమైన జీవితాలు...", పిల్లల అభివృద్ధి తొలి దశల్లో భాష అనేది పెద్దలతో, తోటి పిల్లలతో

మాట్లాడటానికి మాత్రమే సాధనంగా వుంటుంది. తద్వారా పిల్లవాడు ఇతరుల అనుభవాలను సాధారణీకరణ రూపంలో గ్రహిస్తాడు. అటు తర్వాత అది తన సొంత అనుభవాన్ని అతను వ్యవస్థీకరించుకుని, తన సొంత చర్యలను క్రమబద్ధం చేసుకోవడానికి కూడా ఒక సాధనం అవుతుంది.

ఆదిమ ఆలోచనలో సుప్త చైతన్యం వ్యక్తమవుతుందా ? ముమ్మాటికీ కాదు. మార్క్స్, ఎంగెల్స్‌లు ఆదిమ ఆలోచనను ప్రత్యక్ష ఇంద్రియాలను ప్రభావితం చేసే పరిసరాలకు సంబంధించిన ఇతర వ్యక్తులతో, వస్తువులతో వున్న పరిమిత సంబంధాలకు సంబంధించిన చైతన్యంగా పేర్కొన్నారే గాని సుప్త చేతనగా పేర్కొనలేదు. వారు తమ సుప్రసిద్ధ "ది జర్మనీ ఐడియాలజీ" గ్రంథంలో ఇలా అన్నారు :

"కాబట్టి చైతన్యం అనేది మొట్ట మొదటినించే సామాజికోత్పత్తి అవుతుంది. మనుషులు బ్రతికి వున్నంతవరకు అది అలాగే వుంటుంది. మొదట్లో చైతన్యం అనేది కేవలం ఇంద్రియాలపై ప్రభావం చూపే పరిసరాలకు సంబంధించిన చైతన్యంగా, స్వీయ చైతన్యయుతుడవుతున్న వ్యక్తి ఇతరులతోనూ, బాహ్య విషయాలతోనూ పొందుతున్న పరిమితమైన సంబంధానికి చెందిన చైతన్యంగా వుంటుంది. అదే సమయంలో, అది ప్రకృతికి సంబంధించిన చైతన్యం. మొదట్లో అది పూర్తిగా అన్యమైన, అత్యంత శక్తివంతమైన, ఎదిరించలేని శక్తిగా కనిపిస్తుంది. మానవులకు దానితో జంతు సంబంధమే వుంటుంది. జంతువుల వలెనే వారు ఆ శక్తిని చూసి భయపడతారు. అలా అది ప్రకృతి గురించి కేవలం జంతు చైతన్యంగావుంటుంది. (ప్రకృతి సిద్ధమైన మతం).. ఈ దశలో ఈ ఆరంభం ఆనాటి సామాజిక జీవితం వలెనే పశుప్రాయమైనది. ఇది కేవలం గుంపు చైతన్యం. ఈ దశలో మనిషికి పశువుకి తేడా ఏమిటంటే, మనిషి చైతన్యం అనేది ఒక సహజాతంగా (Instinct) వుంటుంది. లేదా, అతని సహజాతం చైతన్యయుతమైనది" (మార్క్స్ ఎంగెల్స్ సెలెక్టెడ్ వర్క్స్ : మొదటి వాల్యూమ్, పేజీలు 32, 33)

సహజ జ్ఞానం గురించి : బూర్జువా తత్వవేత్తలు, భావవాద మనస్తత్వవేత్తల ప్రకారం సహజజ్ఞానం అనేది ఒక నిగూఢమైన, ఇంద్రియాతీతమైన, సుప్త చైతన్య ప్రాపంచిక జ్ఞానం. భౌతికవాదులు ఈ అవగాహనను ఆమోదించలేరు. గ్రహించటానికి, పరిగణనలోకి తీసుకోవటానికి కష్టసాధ్యమైన అనేక అతి స్వల్ప విషయాలను చైతన్యంలో సామాన్యీకరించటాన్నే సహజజ్ఞానం అంటాం. ఆయా రంగాల్లో విస్తృతమైన అనుభవం పునాదిగా మాత్రమే ఇలాంటి సామాన్యీకరణ సాధ్యమవుతుంది. తద్వారా, ఆలాంటి సంఘటనలకు సంబంధించిన సమాచారమే ఇప్పటికీ సహజ జ్ఞానానికి మాతృక అవుతుంది.

శాస్త్రీయ పరిశోధనల చరిత్రలో ఎన్నో ప్రతిభావంతమైన సహజ జ్ఞానాలను ప్రేరేపించిన సంఘటనల గాధలు అనేకం వున్నాయి. 'న్యూటన్ యాపిల్', ' మెండెలియేవ్ కల' వంటివి అందరికీ తెలిసిన విషయాలే. ఇలాంటి సంఘటనల సంభావ్యతను కాదనకుండా, మనం ప్రతి సహజ జ్ఞానం వెనుక మానవ ఆలోచనా ప్రయత్నాన్ని, అది లేవనెత్తిన సమస్యకు పరిష్కారాన్ని వెతకడం కోసం నిరంతరం పట్టుదలతో సాగించిన కృషిని గుర్తించాలి. గతంలో మానవాళి సామాజికంగా, వ్యక్తిగతంగా సాధించిన మేధోపరమైన అభివృద్ధి అనుభవాన్ని సహజ జ్ఞానం కేంద్రీకృత రూపంలో మనకు అందిస్తుంది. దానిలో మార్మికత ఏమీ లేదు, దాని ఆకస్మికత సాపేక్షమైనది, సహజ జ్ఞానంతో సూచించిన సైద్ధాంతిక ప్రతిపాదనలను తర్వాత సహేతుకంగా పరీక్షించడం జరుగుతుంది. దీని ఫలితంగా, మొదట కలిగిన ఊహను త్రోసిపుచ్చటంగానీ, నిరాధారమైనదిగా గుర్తించటంగానీ లేదా

శాస్త్రీయంగా నిరూపితమయిన ప్రతిపాదనగా పరిగణించటంగానీ జరుగుతుంది.

ఆవేశ తక్షణ స్పందనల్లో, గాభరాలో, భయాందోళనల్లో, ఆశ నిరాశల్లో గాఢమైన సంవేదనల్లో సుప్తచైతన్యం వ్యక్తమవుతుందనటం మరొక ఘోరమైన వక్రీకరణ! నిజానికి, చైతన్యానికి సంబంధించిన ఒక అంశమే మానసిక ఉద్వేగాలు. మానసిక ఉద్వేగం అంటే యేమిటి ? మానవుని అవసరాలకు అనుగుణంగానో, అననుగుణంగానో నియతం చేయబడిన వాస్తవ వస్తువులు లేదా దృగ్విషయాలతో అతని సంబంధాల యొక్క ప్రత్యేక రూపమే మానసిక ఉద్వేగాలు లేదా సంవేదనలు అవుతాయి. అనుభూతి, ఆలోచనలకు తోడు మానసిక ఉద్వేగాలు కూడా చైతన్యంలో ప్రపంచం ప్రతిఫలించే రూపాల్లో ఒక రూపం అవుతాయి. కానీ వాటికి సొంత ప్రత్యేకత వుంది. ప్రపంచం యొక్క నిజమైన సంబంధాలను ప్రతిబింబిస్తూ మనిషి వాటిని ప్రపంచంతో తనకున్న సొంత స్వీయాత్మక సంబంధాలుగా అనుభూతి చెందుతాడు. కార్మికవర్గ మహోపాధ్యాయుడు ఎంగెల్స్ ఇలా అన్నారు :

"మానవునిపై భౌతిక ప్రపంచం యొక్క ప్రభావాలు వాటికవే అతని మెదడులో వ్యక్తమవుతాయి. అవి భావాలు, ఆలోచనలు, ఉద్రేకాలు, సంకల్పాల రూపంలో ప్రతిబింబితమవుతాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఆదర్శ ధోరణులుగా ప్రతిబింబిస్తాయి. ఈ రూపంలో అవి ఆదర్శశక్తులు అవుతాయి".

(ఎంగెల్స్ : లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్ సాంప్రదాయక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి నుండి)

మనిషి ఆనందంగా ఉండొచ్చు. భీతి చెందొచ్చు, ప్రేమించవచ్చు, ద్వేషించవచ్చు. అతని భావాల్లో ఆత్మాభిమానంగానీ, అవమానంగానీ, విరోధంగానీ ఉండొచ్చు. అదంతా బయటి ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం లేదా స్వీయ అవగాహన ఫలితమే అవుతుంది. వివిధ రకాల భావాలు, వాటిలో అనేక ఛాయలు, మాటలకు అందనంత క్లిష్టమైన భావాలు ఉండే మానసిక ఉద్వేగాలు ఉంటాయి. మనిషి భావావేశాలు శ్రమ పునాదిగా మాత్రమే ఆవిర్భవించి అభివృద్ధి చెందుతాయి. శ్రమ క్రమం, దాని ఫలితాలపట్ల వైఖరిగా, ఉమ్మడి శ్రమపట్ల అంటే సమాజం పట్ల వైఖరిగా అవి వ్యక్తమవుతాయి. సామాజికంగా అర్థవంతమైన ముఖ్యమైన దృగ్విషయాల వైపు మానవుడు తన మానసిక ఉద్వేగాలను నిర్దేశిస్తాడు. ఈ దృగ్విషయాల పట్ల చేపట్టాల్సిన వైఖరిని, కార్యాచరణ విధానాలను అతను మలుచుకుంటాడు.

ఇకపోతే కలల్లో సుప్తచైతన్యం వ్యక్తమవుతుందనే టి.ఎం.ఎస్. అభిప్రాయానికి మూలాలు "కలల విశ్లేషణ అనేది నిజానికి సుప్తచైతన్యం గురించిన జ్ఞానానికి రాచమార్గం వంటిది"నీ చెప్పే ఫ్రాయిడ్ చింతనలోనే వుంది. ప్రజలు తమ వాస్తవిక సమస్యల నించి దూరమై ఊహాలోకంలో విహరించడాన్ని పాలకవర్గాలు ప్రోత్సహిస్తాయి గనుకనే అవి కలలకు ఎనలేని ప్రాముఖ్యతనిచ్చే ఫ్రాయిడిజాన్ని అంటకాగుతాయి. టి.ఎం.ఎస్. అనుకుంటున్నట్టుగా కలల్లో సుప్తచైతన్యం వ్యక్తం కాదు. మనం చూసి, విని, అనుభూతి చెందిన ప్రతిదీ, మన అనుభవంలోకి వచ్చిన ప్రతిదీ మన మెదడుపై ముద్ర వేస్తుంది, మన జ్ఞాపకాల్లో నిలిచిపోతుంది. ఏదో ఒక కారణం వల్ల కలల్లో ఈ ముద్రలు కొన్ని ప్రేరణ పొందవచ్చు. మన జ్ఞాపకాల గని నించి ఈ ప్రతిరూపాలు, భావాలు బయల్పడి కల రూపం తీసుకుంటాయనీ పావలోవ్ వివరించారు. కలల్లో నిజానికి కొత్త విషయమేమీ ఉండదు. గతంలో ఆ వ్యక్తి అనుభవించని, ఆలోచించని విషయమేమీ అందులో ఉండదు. కాబట్టి వ్యక్తి నిద్రపోయేటప్పుడు అతను పొందే విచిత్రమైన చైతన్యస్థితులే కలలు. అవి చాలా వరకు స్పష్టమైన ప్రతిరూప స్వభావాన్నే కలిగి వుంటాయి.

శరీర ధర్మశాస్త్ర రీత్యా ఇంకా వివరించాలంటే, మెదడులోని సెరిబ్రల్ కార్టెక్స్‌లో అవరోధించబడని వివిధ భాగాల కార్యకలాపాల ఫలితంగా కలలు సంభవిస్తాయి. నిద్ర తగినంత గాఢంగా, మత్తుగా లేనందున నిద్రవల్ల మెదడు కార్యకలాపాలకు కలిగే అవరోధానికి మెదడులోని అన్నిభాగాలూ గురికానపుడు మాత్రమే కలలు సంభవిస్తాయి. ఈ అవరోధం వల్ల మెదడులోని కొన్ని భాగాలు మిగిలిన భాగాలతో సంబంధాలు కోల్పోతాయి, కొన్ని భాగాల పని బలహీనపడి, మరికొన్ని భాగాలు అసాధారణంగా ఉత్తేజితమవుతాయి. దీనివల్ల సాధారణంగా మెదడులోని వివిధ భాగాల సమన్వయం, అన్యోన్యచర్య చెదిరిపోతుంది. తత్ఫలితంగా, మెలుకువగా ఉండేపుడు కొనసాగే ఉన్నత నాడీమండల కార్యకలాపం ద్వారా అంతర్గతంగా ఏకీకృతమయినటువంటి క్రమబద్ధమైన మానసిక కార్యకలాపాల స్థానంలో కలల సామాన్య లక్షణమైన అస్తవ్యస్తమైన, అర్థరహితమైన ఆలోచనలు చోటుచేసుకుంటాయి. ఒక ప్రతిరూపానికి బదులు మరొకటి ఏర్పడటం, ప్రతిరూపాల సమ్మేళనం జరుగుతుంది. అపరిమితమైన, ఎంత మాత్రమూ అదుపు చేయవీలులేని అభూతకల్పనలు పెంపొందుతాయి.

ఇక అలవాటుగా మారిన పనుల విషయానికి వస్తే, వాటిలో సుప్త చైతన్యం వ్యక్తమవుతుందనటం సరికాదు. ఎందుకంటే, రోజువారీ అర్థంలో అలవాటుగా మారిన పనుల కోసం అత్యంత తక్కువ శ్రద్ధ వహించవలసి వస్తుంది. అందుకు సంబంధించిన విలక్షణమైన పనులకు ఎటువంటి ప్రత్యేకమైన ప్రయత్నమూ అవసరం ఉండదు. పైగా ముందు జరిగే పని క్రమానికంటే, పని ఫలితాల్లోనే వాటిని ఎక్కువగా తెలుసుకోవటం జరుగుతుంది. కాబట్టి, అలవాటుపడిన నిర్దిష్ట పరిస్థితుల్లో, అవి ఎటువంటి సంకల్పం లేకుండా, లేదా 'వాటంతటవే' జరుగుతాయి. అయితే మానసికంగా క్రమబద్ధమయే లింకులన్నిటితోసహా ఆ చర్యకు సంబంధించిన మొత్తం పూర్వాపరాలన్నీ నిస్సందేహంగా తెలుసుకోవటం జరుగుతుంది. అలవాటుగా మారిన పనుల్లో వ్యక్తం అయ్యేది ఆ పనులకు ఇవ్వబడే అత్యంత తక్కువ శ్రద్ధే తప్ప మరేమీ కాదు. శ్రద్ధ (Attention) పెట్టడం అంటే, చూసే లేదా జ్ఞాపకం చేసుకునే కొన్ని వస్తువులపై చైతన్యాన్ని కేంద్రీకరించడం, అదే సమయంలో ఇతర వస్తువుల నించి దృష్టి మళ్ళించడం అవుతుంది. అంటే, కొన్ని ప్రత్యేకమైన వస్తువులవైపు చైతన్యాన్ని నిర్దేశించే చర్య అవుతుంది. శ్రద్ధ అనేది చైతన్యం ఎంపికను వ్యక్తం చేస్తుంది.

[illegible]

టి.యం.యస్. అరుణతార వ్యాసంలో "సుప్తచేతన భావన ఈనాటిది కాదు. మన ఉపనిషత్తుల్లో అరిస్టాటిల్ రచనల్లోనే వుంద"ంటూ తన వాదనను ఆరంభించారు. ఉపనిషత్తుల్లో వున్నంతమాత్రాన అది సత్యమైనది ఎలా అవుతుంది ? వాస్తవికమైనది ఎలా అవుతుంది ? దాని శాస్త్రీయత ఏమిటి ? ఆయన ఇంకా తన వ్యాసంలో "1934లో రూబిన్‌స్టీన్ రాసిన ఫండమెంటల్స్ ఆఫ్ సైకాలజీకి ఉపోద్ఘాతంలో, 'ప్రాబ్లమ్స్ ఆఫ్ సైకాలజీ ఇన్ ది వర్క్స్ ఆఫ్ కారల్‌మార్క్స్' అనే గొప్ప వ్యాసం రాశాడు. అది ఈనాటికీ అధ్యయనం చేయదగిందేన"నీ అన్నారు.

సుప్తచేతన గురించి మనం ప్రధానంగా చర్చిస్తున్న సందర్భంలో టి.యం.యస్. రూబిన్‌స్టీన్ ప్రస్తావన తీసుకురావడం, ఆయన రచనల్ని ఆకాశానికెత్తడం యాదృచ్ఛికమేమీ కాదు. టి.యం.యస్.

గారూ ! స్టాలిన్ కాలంలో ఏ రచయిత అయితే మార్క్సిజం ముసుగులో ప్రాయిడిజాన్ని ప్రవేశపెట్టాడనే తీవ్ర విమర్శకు లోనయ్యాడో ఆయన రచనలనే మీరెందుకు ఎలుగెత్తి చాటుతున్నారు ? అలా ఎలుగెత్తి చాటాలనుకుంటే ముందు ఆనాడు జరిగిన చర్చను నిజాయితీతో పాఠకునికి తెలియజేసి స్టాలిన్ నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయాల్ని విమర్శించి మీ అభిప్రాయాన్ని స్పష్టం చేయడం ఓ కనీస ధర్మం కాదా ? ఈ కనీస కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించకుండా వాద ప్రతివాదనలు ఎలా కొనసాగాలో నిర్దేశించే మార్గదర్శక సూత్రాలు ఎన్ని వల్లించినా ప్రయోజనమేమిటి ? నిజానికి టి.యం.యస్. ఉద్దేశపూర్వకంగా పాఠకున్ని పక్కదారి పట్టించడానికి పూనుకున్నారు గనుకనే ఆనాడు చెలరేగిన వివాదాన్ని కప్పిపెట్టాడు. 1930 దశకం తర్వాత సోవియట్ యూనియన్‌లో జరిగిన మనస్తత్వశాస్త్ర అభివృద్ధి వికాసాల గురించి తనకంతా తెలుసుననే అర్థంలో టి.యం.యస్ వాదన కొనసాగింది గనుక ఎవరైనా ఆ అభిప్రాయానికే వస్తారు.

1947-53 మధ్యకాలంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు స్టాలిన్ మార్గదర్శకత్వాన కమ్యూనిస్టు పార్టీ సోవియట్ విజ్ఞానశాస్త్రంలో చోటుచేసుకున్న తప్పుడు ధోరణులను తొలగించటానికి చురుకుగా జోక్యం చేసుకుంది. సోవియట్ సాంస్కృతిక, విజ్ఞానశాస్త్ర రంగాల్లో మౌలికంగా చాలా కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణులు తలెత్తటమో, కొనసాగుతూ రావటమో జరిగింది. ఈ ధోరణులను గుర్తించి, ఆమోదయోగ్యం కాని వాటి స్వభావాన్ని వర్గీకరించి, 'విమర్శ ఆత్మవిమర్శ' ద్వారా వాటిని త్రోసిపుచ్చేలా చేసి సరైన భావాలను పెంపొందించడం కోసం జడనోవ్‌ష్చినా విధానం (ఏ.ఏ. జడనోవ్ పేరుమీద) చేపట్టబడింది. సాంస్కృతిక, శాస్త్రీయమైన ధోరణులపై ఈ విమర్శనాత్మకమైన అంచనా రచయితలు (1946), తత్వవేత్తలు (1947), జీవశాస్త్రజ్ఞులు (1948), మనస్తత్వవేత్తలు వైద్యులు (1950) భౌతికశాస్త్రజ్ఞులు తదితర ఎందరో నిపుణుల మహాసభల రూపంలో జరిగింది. అక్కడ జరిగిన చర్చల పూర్తి వివరాలు ఆ యా రంగాల ప్రత్యేక పత్రికల్లోనే కాక పార్టీ పత్రికల్లోనూ ప్రజా పత్రికల్లోనూ కూడా ప్రచురితమయాయి. సోవియట్ మనస్తత్వ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి ఈ చర్చల సారాంశం చాలా కీలకమయినది.

1948లో సోవియట్ మనస్తత్వ శాస్త్రం చేరుకున్న స్థాయిని, అభివృద్ధిని క్రోడీకరిస్తూ రాసిన ఒక ప్రముఖ వ్యాసాన్ని 'Against Idealism and Metaphysics in Psycology' అనే శీర్షికతో చెర్నకోవ్ ప్రచురించారు. నిజానికి ఇది 1940లో ప్రచురితమైన రూబిన్ స్టీన్ "ఫండ్‌మెంటల్స్ ఆఫ్ జనరల్ సైకాలజీ" పుస్తకానికి సమీక్ష. ఆయన అంతకుముందు రాసిన 'ఫండ్‌మెంటల్స్ ఆఫ్ సైకాలజీ' పుస్తకంలోని విషయాలనే రూబిన్‌స్టీన్ ఇందులో మరింత విపులీకరించారు. టి.యం.యస్. కొనియాడిన "ప్రాబ్లమ్స్ ఆఫ్ సైకాలజీ ఇన్ ది వర్క్స్ ఆఫ్ కారల్‌మార్క్స్" వ్యాసం ఈ పుస్తకంలోని అంశాలనే స్థూలంగా పేర్కొంది. జడనోవ్, లైసెన్కోల చర్చల ప్రభావం కింద పై పుస్తకం ప్రత్యేకించి విమర్శనాత్మక సమీక్ష కోసం ఎన్నుకోబడింది. జాన్‌మెక్‌లీష్ అనే ఆంగ్ల రచయిత చెర్నకోవ్ వ్యాసంలోని విషయాల గురించి ఇలా వివరించారు :

"బూర్జువా మనస్తత్వశాస్త్రవేత్తలు విశేషంగా చేసే సంవిధానపు పొరపాటునే రూబిన్‌స్టీన్ కూడా చేశాడని సోవియట్ మనస్తత్వ శాస్త్రవేత్తలు ఆరోపించారు. ఆ పొరపాటు ఏమిటంటే- సోవియట్ మానవుడి ప్రత్యేక లక్షణాలు, అతని కార్యకలాపాలపై దృష్టిని కేంద్రీకరించటానికి బదులు అతను ఏదో లభూతమైన, విశ్వజనీనమైన మానవ వ్యక్తిత్వాన్ని వివరించడంలో ఆసక్తి చూపాడు. అతను మాటల్లో లెనిన్ మౌలిక సిద్ధాంతాన్ని అంగీకరించినా, అంటే (i) మనసు అనేది మెదడు ఉత్పత్తి లేదా ధర్మమనీ

(ii) అది బాహ్య ప్రపంచ పరిస్థితుల ప్రతిబింబమేనని అంగీకరించినా, అతను స్వీయాత్మకమైన లేదా అంతర్గత స్వభావం కలిగిన మరో రకమైన మానసిక క్రమాన్ని అంగీకరించే పొరపాటు చేస్తాడు. వాటిలో కొన్ని ఏదో విధంగా బాహ్య ప్రపంచ ప్రభావాలకు అతీతంగా 'గూడుకట్టి' వుంటాయనీ, అవి స్వతంత్రంగా వుంటాయనీ భావించడంలోనే పొరపాటు వుంది. మరోమాటలో చెప్పాలంటే, సమాజానికి అతీతంగా ఒక 'వ్యక్తిగత ప్రపంచం' ఉందనీ, ఆ ప్రపంచం వాస్తవానికి ప్రతిబింబంగా కాక మనిషి లోలోతుల నించి ఆవిర్భవిస్తుందనీ ఆయన అంగీకరిస్తున్నాడు. అంటే, వీస్‌మాన్ చేసిన పొరపాటునే రూబిన్‌స్టీన్ కూడా చేస్తున్నాడు. ఇక్కడ ఆయన రెండు రకాల చైతన్యాన్ని గుర్తిస్తున్నాడు. లేదా చైతన్యాన్ని రెండు భాగాలుగా వేరు చేస్తున్నాడు. కేవలం మన అనుభవంగా ఉండేది ఒకటి, బాహ్య ప్రపంచం ప్రతిఫలించడం వల్ల కలిగే జ్ఞానం రెండవది. సోవియట్ మనిషికీ, సోవియట్ సమాజానికీ మధ్య ఏదో విధమైన విభజన ఉండే అవకాశాన్ని ఇది సూచిస్తుంది. చైతన్యంపై వర్గ ప్రభావాన్ని నిరాకరించడం ద్వారా అతను మనస్తత్వశాస్త్రం యొక్క ప్రత్యేకమైన మార్క్సిస్టు స్వభావాన్ని త్రోసిపుచ్చాడు... చెర్నకోవ్ శరీర అంతర్గత అవయవాల పరిస్థితిని మెదడుకి తెలియజెప్పే అంతఃగ్రాహకాల (Interoceptors) ప్రభావాన్ని అయితే కాదనడు. మానవుని జీవసంబంధమైన లోలోతుల నుంచి (Organic Depths) సంకల్పం లేదా మానసికోద్వేగ క్రమాలను బయల్పరచడంలోని అసాధ్యతను మాత్రం అతను కాదనడు. సంకల్పం, మానసికోద్రేకాలూ బాహ్య వాస్తవానికి ప్రతిబింబాలుగా ఉద్భవిస్తాయి- మరే ఇతర సూత్రీకరణ అయినా క్షుద్రమైన, యాంత్రిక భౌతికవాదం లేదా భావవాదం అవుతుంది".

(జాన్ మెక్‌లీష్ : సోవియట్ సైకాలజీ, హిస్టరీ థియరీ కంటెంటు, పేజీలు : 196, 197)

చెర్నకోవ్ తన వ్యాసంలో "కొన్ని మానసిక క్రమాలకు మౌలికమైన ఆధారం స్వీయాత్మకమైనదనీ, అంటే అది ఎక్కడో మనలోనే అంతర్గతంగా ఉన్నదనీ చెప్పే ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని అంగీకరిస్తూ శాస్త్రీయమైన సోవియట్ మనస్తత్వశాస్త్రంలోకి అభివృద్ధి నిరోధక భావవాద చెత్తని జొప్పించాడ"ంటూ రూబిన్‌స్టీన్‌ను విమర్శించాడు. "సాధారణమైన ఆలోచనా ధోరణులకు, మామూలు ప్రవర్తనకూ గుడ్డిప్రేరణలు, సుప్తచైతన్య సంవేదనలు అవరోధం కల్పిస్తాయని, అది సుప్తచైతన్య.. చర్యల ద్వారా జరుగుతుంద"ని అంటూ రూబిన్‌స్టీన్ ప్రవేశపెట్టిన తప్పుడు ఆలోచనకు ఈ 'అసహ్యకరమైన రాజీ' ఏ మాత్రం తీసిపోదనీ ఆ వ్యాసం వివరించింది. సుప్తచైతన్యం గురించిన ఈ భావనలన్నీ "పూర్తిగా ఫ్రాయిడ్, లెవిన్ తదితర అభివృద్ధి నిరోధక బూర్జువా భావవాద మనస్తత్వ శాస్త్రవేత్తల నించి, అరువు తీసుకున్నవే కాక అవి పూర్తిగా మార్మికమైనవి". లైంగిక వాంఛల వివరణలో కూడా రూబిన్‌స్టీన్‌ని ఆ వ్యాసం ఇలా విమర్శించింది : "అతను ఫ్రాయిడ్ చేసిన అంతిమ నిర్ధారణలను అంగీకరించడు..... కానీ సహజాతాల పాత్రపై ఫ్రాయిడ్ చెప్పిన సాధారణ అభిప్రాయాన్ని ఆమోదించడం ద్వారా రూబిన్‌స్టీన్, సూత్రబద్ధమైన వైఖరినించి ఘోరంగా వైదొలిగాడు. ఒక వ్యక్తి యావత్తు చైతన్యయుత జీవితమంతటా లైంగిక వాంఛలు ఉంటాయనీ, అతని చైతన్యయుతమైన మొత్తం వ్యక్తిత్వమూ లైంగిక వాంఛలో నిమగ్నమవు' తుందనీ అనడంలో అర్థం ఏమిటి ? దాని అర్థం ఒక్కటే - ఫ్రాయిడ్ సిద్ధాంత సారాంశాన్ని ఆమోదించడమే".

జాన్ మెక్‌లీష్ ఇంకా ఇలా వివరించారు. "మనిషిలో, తన జంతు పూర్వీకుల నించి సంక్రమించుకున్న ప్రాథమిక సహజాతాలకూ, సా... ...శంనించి నేర్చుకున్న నీతి సూత్రాలకూ మధ్య విభజనగానీ, ఘర్షణగానీ లేదు. చెపనోవ్, ఫ్రాయిడ్ వంటి ... ...ద మనస్తత్వవేత్తలు చైతన్యానికి

విరుద్ధంగా సంకల్పం ముందుకు రావచ్చునన్నట్టుగా మనిషి లోలోతులనించి బయలుదేరే ఉద్వేగాల గురించి స్వేచ్ఛగా మాట్లాడగలరు. కానీ సోవియట్ మనస్తత్వశాస్త్రం ఇలాంటి ద్వంద వైఖరిని ఆమోదించదు. వాస్తవంలో ఒక వ్యక్తి దేన్ని ఆశిస్తాడో దానికి భిన్నంగా అతను ఏం చేయాలనే దాన్ని వ్యక్తం చేసే ఆదర్శాలు ఉండవు. అది అసాధ్యం. ఫ్రాయిడిజం, రూబిన్‌స్టీన్ అవగాహనలకు భిన్నంగా చెర్నకోవ్ మార్క్సిస్టు వైఖరిని ఇలా వివరించారు :

"మానవుని కార్యకలాపాలు చైతన్యయుతమైనవి. అంటే, ఆదర్శవంతమైన చోదకశక్తులుగా అతని చైతన్యం, లక్ష్యాలు, భావాలు అతని కార్యాచరణను నిర్దేశిస్తాయి, అదుపు చేస్తాయి. నిజమైన భౌతికవాదం, వ్యక్తి యొక్క సమాజం యొక్క కార్యకలాపంలో ప్రవర్తనలో భావాల పాత్రను నిరాకరించటం గానీ తగ్గించడం గానీ చేయదు. అది, ఆర్థిక సంబంధాల ప్రతిబింబంగా భావాలు ఏర్పడుతాయనే సరైన అవగాహనను కలిగివుండి మనిషి జీవితంలో, కార్యాచరణలో ఆ భావాలు ప్రముఖ పాత్ర వహిస్తాయనీ చాటి చెబుతుంది."

చివరగా, రూబిన్‌స్టీన్ పుస్తకం ఆచరణయోగ్యంకాని, వర్గదృష్టిలేని విజ్ఞానశాస్త్రంగానూ, విజ్ఞానశాస్త్రం కోసం విజ్ఞానశాస్త్రంగానూ త్రోసిపుచ్చబడింది".

(అదే పుస్తకం, పేజీలు : 197, 198)

టి.యం.యస్. ఇంకా తన వ్యాసంలో మార్క్సిస్టు మనస్తత్వవేత్తలు సైకీని గతితార్కిక భౌతికవాద దృక్పథం నుంచీ పరిశోధనలు చేసి Theory of attitude, activity approach ల ద్వారా సుప్తచైతన్యాన్ని సమగ్రంగా సహేతుకంగా వివరించారనీ అన్నారు. Theory of attitude (SET) ను ఉజ్నాడ్జ్ అనే మనస్తత్వవేత్త అతని జార్జియా సహచరులూ, "సుప్తచైతన్య మానసిక కార్యకలాపాలకు సంబంధించిన క్లిష్టమైన రూపాలు" అనే విషయాన్ని అధ్యయనం చేస్తున్న క్రమంలో లేవనెత్తారు. వుండ్ట్, బెర్గ్‌సన్ అనే ఇద్దరు పాశ్చాత్య భావవాదులను మొదట్లో అనుసరించిన ఉజ్నాడ్జ్ సాధారణంగా మార్క్సిజం - లెనినిజాన్ని ఆమోదించినా పావ్‌లోవ్ బోధనలను తన జీవితాంతం వ్యతిరేకించాడు. చైతన్య క్రమాలకు తోడు మనిషిలో చైతన్యంలో లేనిది ఏదో వుంటుందనీ, కానీ అది చైతన్యాన్ని ప్రభావితం చేసి, నిర్వచించి దానిని ప్రత్యేక దిశలో నడుపుతుందనీ చెప్పే అతని భావన ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సుప్తచైతన్య దృక్పథమే తప్ప వేరేమీకాదు.

1950లో సోవియట్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నిర్వహించిన మహాసభ చాలా ప్రసిద్ధి కెక్కింది. భవిష్యత్తులో మనస్తత్వశాస్త్రం యొక్క కృషి పావ్‌లోవ్ సిద్ధాంతాలు, పని పద్ధతులను అభివృద్ధి పరచడంపై కేంద్రీకరించాలని యీ మహాసభ నిర్ణయించింది. ఈ మహాసభలో జరిగిన చర్చల్లో లెనిన్, పావ్‌లోవ్‌ల బోధనలు సోవియట్ మనస్తత్వ శాస్త్రానికి రెండు మూలస్తంభాలుగా గుర్తించబడ్డాయి. మనస్తత్వ శాస్త్రాన్ని శాస్త్రీయ సూత్రాల కనుగుణంగా రూపొందించడానికి యీ మహాసభలో ప్రయత్నం జరిగింది. మనస్తత్వ శాస్త్రవేత్తలు మళ్ళీ 1952లో సమావేశమయారు. ఈ మహాసభకు 400 మంది శాస్త్రజ్ఞులు హాజరయ్యారు. మనస్తత్వశాస్త్రాన్ని శరీర ధర్మశాస్త్రానికి కుదించివేయరాదని వారు అభిప్రాయపడ్డారు. వారు, చైతన్యం గురించిన భావనను త్రోసిపుచ్చలేదు. పైగా ప్రతిచర్య సూత్రం ఆధారంగా, పరిసరాల నిర్ణాయక సూత్రాల ఆధారంగా చైతన్యయుతమైన అనుభవాల దృగ్విషయాలన్నిటి అన్యోన్య సంబంధాన్ని ఖచ్చితంగా ఎత్తిచూపాలని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, మనస్తత్వశాస్త్రం ఏనికిరానిది కాకపోగా అది మాత్రమే పావ్‌లోవ్ బోధనలపై ఆధారపడి మానవుని స్వీయాత్మక

ప్రపంచాన్ని భౌతిక అధ్యయనానికీ తద్వారా క్రమబద్ధీకరణకూ గురిచేయగల విజ్ఞానశాస్త్రం కాగలదు. ఈ సందర్భంగానే వారు ఉజ్నాడ్జ్ ముందుకు తెస్తున్న సిద్ధాంతాలను, ఈ రంగంలో చేసే ప్రయోగాల ప్రామాణికతను విమర్శించారు.

1956లో ప్రచురితమైన సోవియట్ మనస్తత్వ శాస్త్రవేత్తల సాంస్కృతిక పత్రిక 'ఒప్రోసి సిఖొలోగి' రెండవ సంచికలో "కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్ మనస్తత్వ శాస్త్ర కర్తవ్యం" అనే వ్యాసం ఉంది. ఆ సంచికలో ఉన్న మరో వ్యాసం ఉజ్నాడ్జ్ సిద్ధాంతాలను విమర్శించినా దాని పట్ల ఉదారవైఖరిని అవలంబించింది. తర్వాత కాలంలో క్రుశ్చేవ్, బ్రెజ్నేవ్ ఆధునిక రివిజనిస్టు ముఠా ఆ సిద్ధాంతాలను సోవియట్ మనస్తత్వ శాస్త్రం సాధించిన గొప్ప విజయాలలో ఒకటిగా ఎత్తిచూపింది. స్టాలిన్ ... మార్క్సిస్టు మనస్తత్వవేత్తలచే ఖండించబడినటువంటి, స్టాలిన్ మరణానంతరమే ... ప్రచారం పొందినటువంటి ఈ ఉజ్నాడ్జ్ సిద్ధాంతాలనే యిప్పుడు టి.యం.యస్. ఆకాశానికెత్తుతున్నారు.

(సశేషం) -సారథి

జైలు కవిత



"ఈ జైల్లో గడిపే ఒక్కో రోజు బయట వెయ్యి సంవత్సరాల్తో సమానం"
మన ముందువాళ్ళు చెప్పిన ఈ మాట ఎంత వాస్తవం !
ఈ మానవత్వం లేని చోట నాల్గు నెలలుండడం వల్ల
నా వయస్సు ఇంకో పదేళ్ళు పెరిగిపోయినట్టుగా ఉంది !
ఈ నాల్గు నెలలూ కడుపునిండా కూడు లేదు
ఈ నాల్గు నెలలూ కంటి నిండా కునుకులేదు
ఈ నాల్గు నెలలూ నేనసలు దుస్తులే మార్చలేదు
ఈ నాల్గు నెలలూ నేనసలు స్నానమే చేయలేదు
కాబట్టి - నా పన్నొకటి వూడిపోయింది
నా జుట్టంతా తెల్లబడిపోయింది
నా వళ్ళంతా గజ్జి పట్టిపోయింది
నల్లని ఆకలి రక్కసి నన్ను మెల్లమెల్లగా కొరుక్కు తినేస్తుంది !
అయినా -
ఇంకా నాలో ఓర్పు నశించిపోలేదు
ఎప్పుడూ -ఎక్కడా ఓ అంగుళమైనా లొంగలేదు
... చిత్రహింసల్లో సైతం
నా ... అంతైనా చలించలేదు
ఎందుకంటే ... విప్లవకారుడెప్పుడూ
ఏ పరిస్థితుల్లోనూ ... ...డు !

(హోచిమన్ 'ప్రిజన్ డైరీ' లోని '...' అనే కవితకు స్వేచ్ఛానువాదం

మే 94 రాజమండ్రి సెంట్రల్ జైల్) -అనామధేయుడు

వ్యాసం

టెహ్రీ డామ్ [illegible]

వివాదాస్పద టెహ్రీ డామ్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఈ డామ్ నిర్మాణాన్ని ఆపివేయాలంటూ 'చిప్కో' ఉద్యమనేత సుందర్‌లాల్ బహుగుణ నిరాహార దీక్ష చేపట్టడం, ఆయనకు మద్దతుగా ప్రదర్శన జరుపుతున్న వారిపై లాఠీచార్జి జరపడం వంటి సంఘటనలతో టెహ్రీ డామ్ వార్తల్లో ప్రాధాన్యతను సంతరించుకున్నది. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం ప్రణాళిక సంఘం చేత ఆమోదం పొందిన బహుళార్థసాధక టెహ్రీ ప్రాజెక్టుకు ఇంత వరకు ఏ ప్రాజెక్టుకు ఎదురుకానంత తీవ్ర స్థాయిలో ప్రతిఘటన ఎదురవుతున్నది. ఈ వ్యతిరేకతకు కారణం టెహ్రీ డామ్ నిర్మాణం వలన హిమాలయ ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులవడమే. అంతేగాకుండా ఆ ప్రాంతంలో పర్యావరణాన్ని దారుణంగా దెబ్బతీసి మరిన్ని భూకంపాలకు దారి తీస్తుంది. కాబట్టి ఆ ప్రాంత ప్రజలు దీని నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నప్పటికి ప్రభుత్వంలో ఏ మాత్రం మార్పులేదు. కనీసం ఈ ప్రాజెక్టు వలన సంభవించే ప్రమాదాలేమిటో నిపుణులతో చర్చించకుండానే నిర్మాణాన్ని చేపట్టింది. ఎందుకంటే ప్రభుత్వానికుండేది ప్రజల యోగక్షేమాల గురించి కాదు, పెట్టుబడిదారుల క్షేమాన్ని గురించి కాబట్టి ప్రజలను నిరాశ్రయులను చేసైనా సరే ప్రాజెక్టును నిర్మించాలని తలపెట్టింది. డామ్ నిర్మాణ పనులు చేపట్టి అక్కడి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుంది.

టెహ్రీ డామ్ ప్రాజెక్టు చరిత్ర : భగీరథీ నదిపై నిర్మించ తలపెట్టిన టెహ్రీ డామ్‌కు 23 ఏళ్ళ చరిత్ర ఉంది. 260.5 మీటర్ల ఎత్తుగల ఈ డామ్ ఆసియాలోనే పెద్దది. దీనిని 1969లోనే నిర్మించ తలపెట్టినప్పటికీ 1972లో మాత్రమే ప్రణాళిక సంఘం ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అప్పటి నుండి ఇప్పటి వరకు అనేక మార్పులు చేర్పులు జరిగాయి. దీనితో ప్రాజెక్టు వ్యయం తడిసి మోపెడయ్యింది. ఈ డామ్ నిర్మాణంపై ఒక నిర్దిష్ట ఆలోచన లేని ప్రభుత్వం దాదాపు 20 కమిటీలను, మరికొన్ని సబ్ కమిటీలను నియమించింది. ఈ కమిటీలన్ని వివిధ రీతుల్లో తమ తమ నివేదికలను ప్రభుత్వానికి అందచేశాయి. అడవులు, పర్యావరణ మంత్రిత్వ శాఖ తన శాఖకు చెందిన పలు కమిటీల నివేదికల ఆధారంగా డామ్ నిర్మాణం వల్ల వచ్చే నష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు నిర్మాణాన్ని రెండు, మూడుసార్లు రద్దు చేయాలనీ అభిప్రాయపడింది. అయినప్పటికి ప్రభుత్వం మొండిగా ప్రాజెక్టు నిర్మాణ పనులను 1989లో చేపట్టినప్పుడు ప్రజలు నిర్మాణ పనులను అడ్డుకున్నారు, దీనితో పర్యావరణ మంత్రిత్వశాఖ కమిటీ మరోమారు ప్రాజెక్టు నిర్మాణంపై పరిశీలనలు జరిపింది. 1990లో ఈ కమిటీ తన నివేదికలో, డామ్ పర్యావరణ క్లియరెన్స్ పొందేలా లేదు కాబట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని యథాతథంగా నిలిపివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నివేదికలను పట్టించుకోకుండానే ప్రభుత్వం 1995 జనవరిలో ఎం.పి. రాజశేఖర్‌రెడ్డికి సంబంధించిన కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చింది.

1977లో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన దీని సామర్థ్యంగా నిర్ణయించారు. ఇందుకుగాను సుమారు 198 కోట్ల రూపాయలు వ్యయం కాగలదని అంచనా. ఆ తర్వాత 1989 మార్చిలో 2,400 మెగావాట్ల ఉత్పాదన సామర్థ్యంగా నిర్ణయించి 3 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా

వేశారు. 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనతోపాటు, 6.67 లక్షల హెక్టార్ల భూమికి నీటి సరఫరా జరుగుతుందని, అలాగే ఢిల్లీకి 300 క్యూసెక్కుల త్రాగునీటిని, మరో 200 క్యూసెక్కుల త్రాగునీరు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని నగరాలకు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిధుల కొరత కారణంగా ఇప్పుడు దీని వ్యయం 6,500 కోట్లుగా నిర్ణయించారు. ప్రస్తుతానికి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పనిని మాత్రమే చేపట్టారు. దీనికి 3,334 కోట్ల రూపాయలు ఖర్చుకాగలవని 1994 మార్చిలో అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుపై 1995 మార్చి నాటికి 909 కోట్లు ఖర్చు చేసినట్లుగా కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి స్వయంగా ప్రకటించాడు. ఇంత ఖర్చు చేసి ప్రాజెక్టు పనులు చేపడుతున్నప్పటికి ఇంత వరకు పర్యావరణ సంబంధమైన క్లియరెన్స్ పొందలేదు. భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి డామ్ నిర్మాణం చేపట్టడం వ్యర్థమన్న అభిప్రాయానికి ప్రణాళికా నిపుణులు వచ్చారు. కాని అప్పటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడు గోర్బచెవ్ నిధుల మంజూరుకు హామీ ఇవ్వడంతో మళ్ళీ ప్రభుత్వానికి ఆశలు చిగురించాయి. ఇప్పుడు సోవియట్ యూనియన్ కనుమరుగయినా ఇంకా రష్యాపైన ఆశలూ పోలేదు.

1972లో 198 కోట్ల ఖర్చుతో నిర్మించ తలపెట్టిన తెహ్రీ డామ్ 6.5 రిక్టర్ స్కేల్ తీవ్రతతో వచ్చే భూకంపాలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేశారు. దీనికి అనుగుణంగా గులకరాళ్ళు, ఇసుక, బండరాళ్ళతో 260 మీటర్ల ఎత్తు, వాలును జలాశయం వైపు 2.5 : 1, దిగువ వైపు 2 : 1 గా ఉంచుతూ డామ్‌ను నిర్మించ తలపెట్టారు. ఆ తర్వాత 1984లో భూకంపాల తీవ్రతను రిక్టర్‌స్కేల్‌పై 7 పాయింట్లుగా గుర్తించారు. దీని కనుగుణంగా రూర్కీ విశ్వవిద్యాలయ నిపుణుల సలహా మేరకు డామ్ రూపకల్పన చేశారు. హైద్రాబాద్‌లోని జాతీయ భూ భౌతిక పరిశోధన నిపుణులు తెహ్రీ ప్రాంతంలో వచ్చే భూకంపాల తీవ్రతను రిక్టర్ స్కేలుపై 8.5 పాయింట్ల స్థాయిలో ఉంటుందని ప్రకటించారు. దీనికి తట్టుకునే విధంగా డామ్ వాలును జలాశయం వైపు 8 : 1 గాను, దిగువ వైపు 7 : 1 గాను, అడుగుభాగం వెడల్పు దాదాపు 400 మీటర్లుగా ఉండేటట్లు నిర్మించాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. దీని మూలంగా ప్రాజెక్టు వ్యయం 4 లేక 5 రెట్లు పెరిగి నష్టదాయకమవుతుంది.

ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టాలు : ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేసి ప్రాజెక్టును నిర్మించినా అది భూకంపాలకు తట్టుకొని నిలువగలదన్న ఆశ మాత్రం లేదు. డామ్ నిర్మాణం వలన లాభాల కంటే నష్టాలే అధికం. తెహ్రీ ప్రాంతంలో అధిక తీవ్రత గల భూకంపనాలు వచ్చే అవకాశమున్నది. కాబట్టి డామ్ నిర్మాణాన్ని చేపట్టడం మంచిది కాదని పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఒకవేళ భూకంపం కారణంగా విపత్తు సంభవిస్తే అనేక నగరాలు, పట్టణాలు మునకకు గురి అవుతాయి. పెద్ద ఎత్తున ధన, ప్రాణ నష్టానికి డామ్ కారణమౌతుంది. అంతేకాకుండా డామ్ నిర్మాణం వల్ల వేలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతారు. మరియు హిమాలయ సుందరమైన ప్రకృతికి, పర్యావరణానికి పెద్ద దెబ్బకాగలదని పర్యావరణ నిపుణులు అంటున్నారు.

కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ అధ్యయన బృందం తెహ్రీ ప్రాంతంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.5 పాయింట్ల స్థాయిలో ఉంటుందనీ పేర్కొన్నారు. అది 7.2 స్థాయిలో భూకంప తీవ్రత ఉంటుందని కొన్ని అధ్యయన సంస్థలు పేర్కొనడం శాస్త్ర విరుద్ధమని స్పష్టం చేశారు. డామ్ జలాశయం నిండటం వల్ల కొండచరియలు విరిగే ప్రమాదం ఉంది. జలాశయం నీరు పొంగి పొర్లితే సిమెంట్ లైన్, రాళ్ళు, గులకరాళ్ళు, గండ్రు ఇసుకతో కట్టిన డామ్ తుడిచిపెట్టుకపోతుంది. అంతేకాక దాదాపు 700 అడుగుల ఎత్తుతో సంభవించగల వరద తాకిడికి వందలాది పట్టణాలు, వేలాది

గ్రామాలకు ఏర్పడే ప్రమాదాన్ని ఈ సంఘం క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదించింది.

మన దేశంలోను, ప్రపంచంలోను నిర్మించిన పెద్ద డామ్‌లలో దాదాపు 10వ వంతు విఫలమయ్యాయి. అనేక డామ్‌లు పగిలిపోయాయి. అలానే తెహ్రీ డామ్ కూడా ఇలాంటి ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దీనిని దృష్టిలో ఉంచుకోని ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తెహ్రీ ప్రాజెక్టులో 260 మీటర్ల ఎత్తుగల గులకరాళ్ళు, బండరాళ్ళు డామ్ ఒకటవది. 130 మీటర్ల ఎత్తు గల కాంక్రీట్ డామ్ రెండవది. ఈ రెండు కూడా తీవ్ర భూకంపాల, తదితర కారణాల వలన బద్దలైపోయే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాత భూకంప శాస్త్ర సాంకేతిక నిపుణులు తెహ్రీడామ్ జీవిత కాలంలో రిక్టర్ స్కేలుపై 8.5 పాయింట్ల స్థాయిలో భారీ భూకంపాలు కనీసం 3 వరకు రావచ్చునని పేర్కొన్నారు. ఒకవేళ రిక్టర్‌స్కేల్‌పై 7 పాయింట్ల వరకు భూకంపం వచ్చినా దాని ప్రభావం 97,700 టన్నుల టి.ఎన్.టి. పేలుడు ప్రభావానికి సమానం. అదే 8.5 పాయింట్ల తీవ్రతతో భూకంపం సంభవిస్తే అది 2,86,15,850 టన్నుల టి.ఎన్.టి. పేలుడికి సమానంగా ఉంటుంది. ఇప్పుడు తెహ్రీ డామ్‌కు 7 పాయింట్ల స్థాయిలో వచ్చే భూకంపాలను మాత్రమే తట్టుకోగలదని అధికారులు అంటున్నారు. అంటే భూకంప తీవ్రత 8.5 పాయింట్ల స్థాయిలో వస్తే జరిగే నష్టం ఎంతో మనం ఊహించవచ్చు. ఒకవేళ ఈ విధంగా డామ్‌కు ఏమైనా నష్టం సంభవించి డామ్ కూలిపోతే 22 నిమిషాల్లో డామ్ ఖాళీ అవుతుంది. మరో గంటలో ఋషికేశ్ 260 మీటర్ల ఎత్తు నీటిలో మునిగి ఉంటుంది. తదనంతరం 12 గంటల్లో బిజ్‌పూర్, మీరట్, హాపూర్, బులంద్‌షహార్‌లు 850 మీటర్ల ఎత్తు నీటిలో మునిగి ఉంటాయి.

భూకంపం వలన డామ్‌కు నష్టం జరిగితే అక్కడి ఆదివాసీలు తమ సర్వస్వం కోల్పోతారు. అలాగే వృక్షసంపద, జంతుజాలం నశించిపోతుంది. దాదాపు 112 గ్రామాల వరకు పూర్తిగా జలమయమవుతాయి. ప్రాణ నష్టం కూడా పెద్ద ఎత్తున జరిగే అవకాశం ఉంటుంది. డామ్ నిర్మాణం మూలంగానే వృక్షసంపద నాశనమై పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. దీనికి సంబంధించి అధికారులుగాని, ప్రభుత్వం గాని ఎటువంటి హామీ ఇవ్వడం లేదు. ప్రభుత్వం డామ్ నిర్మాణం వలన ఏమీ కాదనే జపం వదిలి, ఇన్ని నష్టాలకు కారణమౌతున్న తెహ్రీ డామ్ నిర్మాణంను ఆపివేయడమే ఉత్తమం. తెహ్రీ ప్రాజెక్టు నిర్మాణం వలన హిమాలయ, ఉత్తర కాశీ ప్రాంతాల్లో భూకంపం సంభవించే అవకాశం ఏర్పడుతుందని పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పర్వతాల్ని, కొండల్ని పేల్చివేయడమే ఇందుకు కారణం అని వారు పేర్కొన్నారు. డామ్ వల్ల అవతరించే భారీ జలాశయం కూడా ఇందుకు దోహదపడగలదని భావిస్తున్నారు. 1991 అక్టోబర్‌లో, ఈ డామ్‌కు 80 కిలోమీటర్ల దూరంలోని ఉత్తర కాశీలో 6.6 పాయింట్ల భూకంపం సంభవించి ఆ ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన చాలు తెహ్రీడామ్‌కు ఏమి కాదని చెప్పే మన నేతల కోతల్ని ఎండగట్టడానికి.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి : ప్రభుత్వం తెహ్రీడామ్ నిర్మాణం చేపట్టి హిమాలయ పర్వతాలని, అడవుల్ని మరియు అక్కడ నివశించే ప్రజలను నాశనం చేయాలనే కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తున్నది. తెహ్రీ నిర్మాణం వలన ఇప్పటికే 12 గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారు. 1995 మార్చి వరకు 339 కోట్ల రూపాయలు నిర్వాసితుల పునరావాసం కోసం వెచ్చించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇది వారు ఇండ్లు నిర్మించుకోవడానికి కూడా సరిపోదనీ అక్కడి ప్రజలు అంటున్నారు. ఉండడానికి

కూడు, గూడు ఏమో గాని ఇప్పుడు ఆ నిర్వాసితులకు త్రాగడానికి మంచినీళ్ళు దొరకడం లేదు. అంటే నిర్వాసితుల పరిస్థితి ఏ విధంగా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ డామ్ నిర్మాణమే పూర్తయితే అదనంగా తెహ్రీ టౌన్‌తోపాటు 112 గ్రామాలకు చెందిన 85,600 మంది (దాదాపు 13,000 కుటుంబాలు) వీధిన పడతారు. వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుంది. కాబట్టి అక్కడి ప్రజలు డామ్ నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నప్పటికి ప్రభుత్వం వైఖరిలో ఏమాత్రం మార్పులేదు. ప్రాజెక్టు వలన సంభవించే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొనకుండా నిర్మాణ పనులను చేపడుతున్నది. దీని వలన కలిగే నష్టాలను ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు. డామ్ నిర్మాణం వలన ప్రజలకు లాభమా ! అనుకుంటే అదీ లేదు. లాభం ఉన్నదల్లా సంపన్న వర్గాలకు, బడా పారిశ్రామికవేత్తలకు, బహుళజాతి కంపెనీలకు మాత్రమే. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ అంతా పట్టణాలకు, పెద్ద పెద్ద కర్మాగారాలకు మాత్రమే సరఫరా అవుతుంది. దీనికి దగ్గరలో ఉన్న పల్లెలు మాత్రం 'దీపం క్రింది నీడలాగా' చీకట్లో మ్రగ్గిపోవల్సిందే. అలాగే ఇక్కడి విద్యుత్ ఉత్పత్తి అంతా కూడా బహుళ జాతి కంపెనీల చేతుల మీదుగానే ఉత్పత్తి అవుతుంది. అవి తమ ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముకోవడం చేస్తాయి. దాని వల్ల కరెంటు చార్జీలు మామూలు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండవనేది జగమెరిగిన సత్యమే. ఈ పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడమే పెట్టుబడిదారీ దేశాల, బహుళజాతి కంపెనీల అవసరాలు దృష్టిలో ఉంచుకొనే తప్ప వేరే కాదు. ఒకవేళ ఇక్కడి ప్రజల మేలుకోరి ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే ఇంత పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి ప్రజలకు నష్టం చేకూర్చాల్సిన అవసరం లేదు. అసలు మన దేశానికి పెద్ద పెద్ద ఆనకట్టల వలన ఒనగూడే ప్రయోజనము లేదు. ప్రజల మేలుకోరి అయితే చిన్న చిన్న చెక్‌డామ్‌ల లాంటివి అధిక సంఖ్యలో నిర్మించి నీటి పారుదల, విద్యుత్ ఉత్పత్తి వంటివి అధికం చేయవచ్చు. వీటి వలన ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి నష్టం కూడా ఉండదు. పైగా ప్రజల అవసరాలు తీరుతాయి. ఈ పెద్ద ప్రాజెక్టుల వలన సారవంతమైన భూమి జలాశయంలో మునిగిపోతుంది. దీనివలన చిన్న, సన్నకారు రైతులు నష్టపోతారు. భూమిని నమ్ముకొని జీవించేవారు జీవనోపాధి కోల్పోతారు. ఇది నగరాల అవసరాల కోసం గ్రామాలను సమూలంగా నిర్మూలించడమే అవుతుంది. కాబట్టి దేశం అభివృద్ధిని సాధించాలన్న పెద్ద ప్రాజెక్టుల కన్నా చిన్న చిన్న చెక్‌డామ్‌ల లాంటి నిర్మాణం చేపట్టడం మంచిది. వీటి నిర్మాణానికి వ్యయం కూడా తక్కువే మరియు ప్రజలకు నష్టాలు జరుగకపోగా లాభమే చేకూరుతుంది. అలాగే దేశంలోని అన్ని ప్రాంతాలలో ఇలాంటివి చేపట్టితే అందరికీ నీటి వసతి కూడా కల్పించిన వారవుతారు. ఇలా కాకుండా పశ్చిమ దేశాల తరహాలో దేశవ్యాప్తంగా అభివృద్ధిని రుద్దాలనుకోవడం మూలంగానే ప్రభుత్వం తెహ్రీ ప్రాంత ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుంది. ఇప్పుడు ప్రభుత్వం చెప్పుకుంటున్న అభివృద్ధి, ప్రణాళిక రూపకల్పన అంతా కూడా గ్లోబల్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో పెట్టుకొనే తప్ప ప్రజల అవసరాల్ని, ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కాదు.

తెహ్రీ డామ్‌లాగానే నర్మద నదిపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టుకు కూడా పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురైంది. నర్మద ప్రాజెక్టు వలన కూడా అడవులు నాశనమై పర్యావరణానికి పెద్ద ముప్పు ఏర్పడుతుంది. అలాగే దీని వలన 4 రాష్ట్రాలకు చెందిన వందలాది గ్రామాల ప్రజలు సర్వం కోల్పోతారు. దీనికి వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజలు ఏకమై నర్మద ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేయాలంటూ పెద్ద

ఎత్తున ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసింది. కాని పూర్తి నిర్మాణాన్ని ఆపడం లేదు. ఎందుకంటే ఈ ప్రాజెక్టు వలన పెట్టుబడిదారీ దేశాలకు లాభం ఉంటుంది కాబట్టి. ఈ మధ్యకాలంలో టెహ్రీ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా కూడా పెద్ద ఎత్తున ఆందోళనలు లేచాయి. 1995 ఏప్రిల్ 13న సుందర్‌లాల్ బహుగుణ నిరాహార దీక్ష చేపట్టి 49 రోజులపాటు కొనసాగించాడు. దీనితో ప్రభుత్వం దిగివచ్చి డామ్ నిర్మాణంపై సమగ్ర సమీక్ష జరిపిస్తానని ఒప్పుకుంది. కాని తన మాటను నిలబెట్టుకుంటుందన్న నమ్మకం మాత్రం లేదు. ఎందుకంటే గతంలో ఎన్నోసార్లు మాట ఇచ్చి వాటిని తుంగిలో తొక్కింది ఈ ప్రభుత్వం.

టెహ్రీ డామ్ నిర్మాణం వలన హిమాలయ ప్రాంత పర్యావరణాన్ని నాశనం చేయడంతోపాటు. ఇక్కడి ప్రకృతి సంపద అంతా కూడా వ్యాపార వస్తువుగా మారుతుంది. ఇక్కడి ప్రజలను, ప్రకృతి సంపదను దోచుకోవడానికి బహుళజాతి కంపెనీలకు సులువైన మార్గం ఏర్పడుతుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం జరిగే నష్టాలను దృష్టిలో ఉంచుకొని డామ్ నిర్మాణ పనులను ఆపివేయాలి. జపాన్‌లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో భూకంపాలను తట్టుకునే విధంగా కట్టడాలు నిర్మించినప్పటికి, మొన్నటికి మొన్న సంభవించిన పెనుభూకంప తాకిడికి అవి నిలువలేకపోయాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొనకుండా ప్రభుత్వం పెద్ద భూకంపాలకు టెహ్రీ డామ్ తట్టుకోగలదని అనడం ఒట్టి బుకాయింపే. ఇది ఒక విధంగా ప్రజలను నమ్మించి నట్టేట్లో ముంచడమే అవుతుంది.

ఒక పక్క ప్రభుత్వం అడవులను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అంటూ పెద్ద పెద్ద నినాదాలు చేస్తూ, మరో పక్క 'కంచే చేను మేసిన' చందంగా తాను అడవులను నాశనం చేస్తున్నది. రోజు రోజుకు వాతావరణ కాలుష్యం మూలంగా పర్యావరణం దెబ్బతిని ప్రజలు పలు రోగాలకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో అడవులను రక్షించాల్సిన బాధ్యత ఎంతైన ఉంది. ఈ పెద్ద ప్రాజెక్టుల వలన అడవులకు ముప్పు ఏర్పడడమే కాక ప్రజలు తమ జీవనోపాధిని కోల్పోతారు. కాబట్టి ప్రభుత్వం ప్రజల మేలు కోరి పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం ఆపివేయాలి. చిన్న చిన్న డామ్‌ల లాంటి వాటి నిర్మాణం చేపట్టడం వలన దేశవ్యాప్తంగా ప్రజలకు నీటి వసతిని కల్పించవచ్చు. వీటి వలన ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదు. కాబట్టి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆలోచించి ప్రజల జీవితాలతో చెలగాట మాడకుండా పెద్ద ప్రాజెక్టుల నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలి. పెద్ద ప్రాజెక్టులద్వారా మరో భూప్రళయం రాకుండా జాగ్రత్తపడాలి.

సుందర్‌లాల్ బహుగుణ ఏప్రిల్ నెలలో 49 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టినప్పుడు ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేసి, పునఃసమీక్షిస్తానని హామి ఇచ్చింది. కాని కొద్ది రోజుల్లోనే హామీని తుంగలో తొక్కి, నిర్మాణం పనులను ఆపివేస్తామని హామీ ఇవ్వలేదని బుకాయించింది. ఈనాడు దేశవ్యాప్తంగా భూమి సమస్యపై, ప్రభుత్వ గ్లోబల్ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు పోరాడుతున్నప్పటికి ఈ ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అలాంటప్పుడు టెహ్రీ డామ్ నిర్మాణానికి వ్యతిరేకంగా బహుగుణనో లేక మేధాపాట్కరో ఒక్కరే పోరాడినా, నిరాహారదీక్షలు చేపట్టిన ఈ ప్రభుత్వాలు ఎన్నటికి దిగిరావు. సామ్రాజ్యవాద దేశాలకు గులాంలుగా మారిన పాలక

వర్గాలు ప్రజల ప్రయోజనాలను తుంగలో తొక్కి తెహ్రీ, నర్మద, ఎన్‌రాన్‌లాంటి పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్నాయి. పెట్టుబడిదారీ దేశాలకు మేలుచేసే ఇటువంటి ప్రాజెక్టుల నిర్మాణాలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించాలి. వీటివలన ప్రజలకు, పర్యావరణానికి జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలి. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడే విధంగా చైతన్యపరచాలి. వారికి సరియైన నాయకత్వాన్ని అందిస్తూ ఈ రోజు దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా పోరాటాలలో భాగం చేయాలి. అప్పుడే ఆ పోరాటాలు విజయవంతం అవుతాయి.

అలా చేయకుండా ఒక్కొక్క వ్యక్తిగానే, ప్రజల భాగస్వామ్యం లేకుండా జరిపిన పోరాటాలు చరిత్రలో విజయవంతం అయిన సంఘటనలు ఎక్కడా లేవు. ఒకవేళ ఎక్కడైనా విజయవంతం అయినా అవి తాత్కాలికమే. ఎందుకంటే పాలక వర్గాలు ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున జరుగుతున్న పోరాటాలను ఉక్కుపాదంతో అణచాలని ప్రయత్నిస్తున్నాయి. అందులో ఒకే వ్యక్తి చేత జరిపే పోరాటాన్ని అణచడానికి పాలక వర్గాలకు పెద్ద సమస్య కాదు. అణచివేత ద్వారానో లేక ప్రలోభపెట్టో అటువంటి పోరాటాలను పాలక వర్గాలు అణిచివేయవచ్చు. తెహ్రీ డామ్‌కు వ్యతిరేకంగానే కాకుండా, ఎన్‌రాన్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం కూడా ప్రజల భాగస్వామ్యం లేకుండానే, సరియైన నాయకత్వం, లక్ష్యం లేకుండా సాగుతున్నదే. కాబట్టి తెహ్రీ అయిన, ఎన్‌రాన్ అయిన, ఇంకేదైన వీటికి వ్యతిరేకంగా ప్రజలను పెద్ద ఎత్తున కదిలించి వారికి సరియైన నాయకత్వాన్ని అందించాలి మరియు దేశవ్యాప్తంగా జరుగుతున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక ప్రజా పోరాటాల్లో భాగమై పాలక వర్గాలపై పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. అప్పుడే ఉద్యమాలు విజయవంతం అవుతాయి.

- 'సముద్రం'

వెలువడింది !

కవిత్వంపై ఎర్రజెండా

(1980-'94 విప్లవ కవితా సంకలనం)

విరసం ప్రచురణ

వెల : 30 రూ.

ప్రతులకు :

ప్రగతి బుక్ హౌస్, గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎదుట

మ్యూజియం రోడ్, విజయవాడ - 520 002

సహచర బుక్ హౌస్, 3-3-72/2, ఆంధ్రా బ్యాంక్ వెనుక, కాచిగూడ

చౌరస్తా, హైదరాబాద్ - 500 027

సమీక్ష

మనసుకి కురుక్షేత్రం
ద్రోహకాల్ తో మనుషులు

Where the mind is without fear and head is held high, into that heaven of freedown, father let my country awake

–RABINDRANATH TAGORE

అటువంటి స్వేచ్ఛగల నేలున్న ఐదు ఊళ్లూ వద్దు, ఆరడుగులూ వద్దు. భూగోళం మీద ఎక్కడైనా మనిషికి మూడు అడుగులు నేల చూపించండని గోవింద్ నిహలానీ ఈ చిత్రంలో అడుగుతున్నాడు.

"ఈ భూగోళం విస్తీర్ణం ముడు అడుగులు కూడా లేదంటున్నాడు. మిగతా భూగోళం అంతా మనం తీసుకుని, హ్యూమన్ డిగ్నిటీ తెలియనివాడికి (వాడు కూడా ఒక జీవి కదా) ఆరడుగుల నేల ఇద్దాం" అని ఔదార్యం చూపాడు మహారచయిత టాల్‌స్టాయ్ (How much land does a man need కధలో). దురాశాపరుడికి, Human డిగ్నిటీని గౌరవించలేనివాడికీ భూగోళం అంతా ఇచ్చినా సరిపోదు. అలాంటివాణ్ణి పాతి పెట్టడానికి మాత్రమే ఆరడుగుల నేల కావాలి " అని మిలిటెంట్ మానవతావాదిగా చెప్పాడు ఆంటన్ చెకోవ్. "నాన్న ! నాన్న ! నాకు భయమేస్తోంది నాన్నా ! నా తుపాకి తెచ్చియ్యండి నాన్నా !!" అని తన నిస్సహాయత అర్థమై బొమ్మ తుపాకిని పక్కలో పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ చూస్తున్న పసివాడు ఎవరో కాదు. ఈ భూగోళమే. కుంజర యూధము దోమకుత్తుక జొచ్చినట్లు, పసి పాపలాటి భూగోళం టాగోర్ చెప్పిన స్వేచ్ఛతో నిలబడటానికి మూడు అడుగుల చోటు కోసం ఈ విశాల విశ్వమంతా వెతుక్కుంటోంది. అది దొరకనినాడు భూగోళానికి పాలిచ్చి పెంచి, సృష్టిని కొనసాగించే చల్లని తల్లిలోని భీకర మాతృమూర్తి తుపాకి అందుకుని తన 'స్వే'యిచ్ఛ కోసం, హింసారాజ్యాన్నైనా, మానవతని మంటగలిపే మిలిటెంట్లనైనా తలకాయలు తునాతునకలుగా పేల్చి చంపేస్తుంది.

"And From every dead child
born a gun
and from every crime
bulles are born
from every dead house
burning metal flows instead of flowers
which will one day
find the bull's eye of your hearts.

- PABLONERUDA

టెర్రర్ మనిషి ఇచ్ఛకి వ్యతిరేకమైన పనిచేయిస్తుంది. మానవ స్వేచ్ఛని చంపేసి మనిషిని పురుగ్గా మారుస్తుంది. ఇపుడు మనుషులు పురుగులుగా మాత్రమే బతికే 'ద్రోహకాలం' నడుస్తోంది. ఈ ద్రోహకాలంలో మృత్యువుమాత్రమే తలెత్తుకుని సగర్వంగా నడుస్తుంది. మూర్ఖుడైనా వివేకవంతుడైనా చావుకి సిద్ధపడితేనే బతుకు. వివేకవంతుడి తెగింపు పదిమంది ప్రాణాలు నిలబెడుతుంది. మూర్ఖుడి తెగింపు పదిమందికి చావు తెస్తుంది. తన ప్రాణం మీద సాటి మనిషి ప్రాణం మీదా ఏ మాత్రం మమకారం మిగిలినా అలాంటి వాళ్లంతా మోకాళ్లమీద దేకుతూ తలలు దించుకుని బతకాల్సిందే. ప్రాణం మీద మమకారం ప్రాణి జన్మహక్కు. దాన్ని చంపుకుంటేనేగానీ ప్రాణికి మనుగడ లేకపోవడం నిర్దాక్షిణ్యమైన 'ద్రోహకాల న్యాయం'. 21వ శతాబ్దపు కురుక్షేత్రంలో ఆఖరికి కుక్కైనా సరే, మనిషితో సహచర్యం చేసే దాని సహజ లక్షణాన్ని వదులుకోపోతే, అది రాజ్యహింసకో మిలిటెంట్ల హింసకో చావక తప్పదు. ఆధునిక ధర్మరాజు వెంట నడవటానికి ప్రపంచ కురుక్షేత్ర సంగ్రామం తర్వాత కుక్కైనా మిగులుతుందా ?

SEEING TREES IS NOT SEEING FOREST - MAO

విడివిడి ఘటనలు మాత్రమే చూడటం సమాజాన్ని చూడటం కాదు. సామాజిక మూలాలలోంచి ఘటనల్నీ, ఘటనల్లో సామాజిక మూలాల్నీ చూడటమే అసలైన చూపు. ఈ చిత్రంలో ఒక పార్శ్వం చెట్లని మాత్రమే చూపించి రెండో పార్శ్వాన్ని, మూలాల్నీ ప్రేక్షకుల ఊహకి వదిలేశాడు నిహలానీ. అందుచేత అడవిని కూకటివేళ్లతో సహా చూడకపోతే తుపాకులు మాత్రమే కన్పిస్తాయి. అర్ధసత్యం మాత్రమే అన్పిస్తోంది. అయితే మూలాలు లేని అడవిని చూసినా, ఇన్నివేల సంవత్సరాల వయసుగల మానవుడు. క్రీస్తు, బుద్ధుడూ, మహాత్ముడూ వంటి వారి సహచర్యంలో బతికిన మానవుడు, ఇపుడు తుపాకి బానిసగా తప్ప మరే విధంగానూ బతకలేని సమాజాన్ని నిర్మించుకున్నాడని అర్థమవుతుంది. మూలాలు ధర్మాధర్మాలను నిర్ణయిస్తాయి.

ద్రోహాల్లో రకాలు : ధర్మబద్ధంగా స్వేచ్ఛగా బతకడానికి ఐదూళ్లు అడిగిన పాండవుల్ని యుద్ధంలోకి లాగిన 'దురభిమాన' 'ధనుడు' సుయోధనుడికి భీష్ముడు ద్రోహం చేశాడు. పొరుగువాడి భార్యని ఆమె ఇచ్ఛకి వ్యతిరేకంగా బంధించిన రావణుడికి విభీషణుడూ ద్రోహం చేశాడు. ఇంకా రావణుడూ, సుయోధనుడూ ఎంతో నయం. విభీషణుణ్ణి, భీష్ముణ్ణి బతకనిచ్చారు. గొప్పరాజనీతిజ్ఞులు కూడా యుద్ధమనే ద్రోహకాలంలో ద్రోహులుకాక తప్పలేదు. వాళ్లు ద్రోహం చేసింది ధర్మానికా అధర్మానికా అనేదే ప్రశ్న. అంచేత వాళ్లు ధర్మబద్ధమైన ద్రోహులు. భీష్ముణ్ణి దుర్యోధనుడు టెర్రరైజ్ చేసి పాండవుల్లోకి ఇన్ఫార్మర్‌గా పంపిస్తే ఆ కురువృద్ధుడు ఏం చేసి ఉండేవాడు. రాముడికి ద్రోహం చేయాల్సిన పరిస్థితి ఎదురైతే విభీషణుడు ఏం చేసేవాడు. ఈ కాలపు భీష్ముడు విభీషణుడు "ద్రోహకాల్" చిత్రంలో ఉన్నాడు. అతడే అమ్రేష్‌పురి. మిగతా పాత్రలు చెట్లని చూశాయి. అమ్రేష్‌పురి కొంతవరకూ అడవిని చూశాడు. అందుకే ధర్మానికి ద్రోహం చేయక తప్పని పరిస్థితి ఎదురైనపుడు హుందాగా అడుగు వేసుకుంటూ మేడమెట్లెక్కి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చూడటానికి పిరికివాడి పని కానీ సారంలో అమ్రేష్‌పురి ఆత్మహత్య వీరోచితమైన కార్యం. అతనికి హింసలోని హ్యూమన్ ఎస్సెన్స్ తెలుసు. "వివేకం గల నిశ్శబ్ద విప్లవకారుడతను ".

సురేందర్ సమాజానికి నిజమైన ద్రోహి. చీడపురుగు. అతని తల వెయ్యి ముక్కలుగా పేల్చిన

ఆ తల్లి, పోలీసు అధికారి భార్య అయినా నిజమైన విప్లవ మాతృమూర్తి. సురేందర్ లాంటివాడు సాటి మిలిటెంట్ అయినా రాజ్య ప్రతినిధి అయినా, మిలిటెంట్లలోకి చొరబడిన ఇన్ఫార్మర్ అయినా నిర్దాక్షిణ్యంగా వాడి తల తునాతునకలు చేయడం 'మిలిటెంట్ మాతృత్వం అతన్ని చంపే ప్రయత్నంలో విఫలమై ప్రాణాలు కోల్పోయిన మహిళా మిలిటెంట్‌కి పిల్లలు లేకపోయినా ఆమెది విప్లవంలో మాతృత్వం. తండ్రిలేని కూతురు, టీనేజర్ అయిన అమ్మాయితో సురేందర్ వెకిలిగా ప్రవర్తించి సెక్సువల్ అడ్వాన్సెస్ తీసుకున్నపుడు, ఆమె సాటి మిలిటెంట్ అనే అభిమానంతో అతనికి తన శరీరాన్ని అప్పగించి దారి మళ్లించడానికి యత్నించింది. అయినా వాడు అదుపులోకి రాలేదు. ఆదిలో ముభావంగా కారమ్స్ బోర్డ్ దగ్గర్నించి వెళ్లిపోయి అతనిపట్ల ఉదారంగా ప్రవర్తించింది. తెలిసో తెలియకో సహకరించింది. ఫలితంగా ప్రాణాల మీదకి తెచ్చుకుంది. తమ శత్రువుపైగా 'ధనుష్' రహస్యం చెప్పని శత్రువూ అయిన నజీరుద్దీన్ కుమార్తెను మానభంగం చేయడం పోరాటంగా ఆమె భావించలేదు. సురేందర్‌ని చంపే యత్నంలో తను చచ్చిపోయింది. అమ్రేష్‌పురి ఆత్మహత్యకి, ఆమె చావుకీ, ఆ తల్లి సురేందర్‌ని కాల్చి చంపడానికి పెద్ద తేడా లేదు. మూడు కూడా Revolutary acts in their Essence.

సురేందర్ లాటి మిలిటెంట్ ఉద్యమానికి పనికొస్తున్నాడనే ఉద్దేశంతో అతని పట్ల ఉదారంగా ఉన్నా, నెత్తికెక్కించుకున్నా, అలాటి వాళ్లని చంపడంలో విఫలమైనా హింసలోని Human Essence మారిపోతుంది. ధర్మాధర్మాలు తారుమారవుతాయి. అయితే ఐసోలేటెడ్‌గా మాత్రమే. మొత్తం మీద ధర్మాధర్మాలు నిర్ణయించేది సామాజిక మూలాలు.

చిన్న మిలిటెంట్‌ని ఇన్ఫార్మర్‌గా మార్చగలిగాననే విజయగర్వంతో పొంగిపోతున్న ఓంపురి, మిలిటెంట్ కమాండర్‌ని ఎన్‌కౌంటర్ చేయబోతాడు. అతను నిరాయుధంగా తుపాకిని ధిక్కరించి ఓంపురి విద్యని తిరిగి ఓంపురి మీద ప్రయోగించి చకితుణ్ణి చేస్తాడు. ఇది నీవు నేర్పిన విద్యయే అంటాడు. ఏ Violent state not only perpetuates violence' అని నిరూపిస్తాడు. (అయితే స్టేట్‌కి హింస ఎందుకు అవసరం అనే జోలికి నిహలానీ పోడు) సురేందర్ దుష్టచర్యవల్ల ధర్మాధర్మాలు తారుమారయ్యి (Isolated గా అయినా సరే) చేతిలో తుపాకి ఉండి కూడా కమాండర్, నిరాయుధుడైన ఓంపురి చేతుల్లో కుక్కచావు చావాల్సి వస్తోంది. అంతవరకూ ఒక కాజ్ కోసం ప్రతిహింస చేసిన కమాండర్ అధర్మ పక్షాన కుక్కచావు చావడమేకాదు మొత్తం పోరాటం శత్రువర్గ గూఢచారి చేతుల్లోకి పోతుంది. సురేందర్ లాంటి విచక్షణ లేని పిచ్చికుక్కని సహచరుడే కాదా అని ఉదారంగా ప్రేమిస్తే నాయకుడు కూడా దానితోపాటే ప్రజల చేతుల్లో కుక్క చావు చావాల్సి వస్తోంది.

ఇందులో అత్యంత సంక్లిష్టమైన పాత్ర ఓంపురి. మనిషిని టెర్రరైజ్ చేయడానికి తుపాకి మాత్రమే అక్కర్లేదు. అతనిలోని మానవత్వాన్ని మేల్కొలిపితే చిన్న రొట్టెముక్కతో టెర్రరైజ్ చేయవచ్చు. "నీ పెళ్లాం పిల్లలు రొట్టె ముక్కల కోసం రోడ్ల మీద పడి కుక్కల్లా బతకాల్సి ఉంటుంది" అని ఒక మిలిటెంట్‌ని ఓంపురి టెర్రరైజ్ చేస్తాడు. దానికి లొంగకపోతే చితక బాదేస్తాడు. అది తన విధి అని నమ్మే సిన్సియర్ పోలీస్ అధికారి. అతనికి సామాజిక మూలాలూ, కౌంటర్ టెర్రర్ ఏ స్థాయిలో ఉన్నదీ తెలీదు. తన జీవితం చాలా భద్రంగా ఉందనే ధీమాతో ఉంటాడు. అదెంత భ్రమో మిలిటెంట్ల టెర్రర్‌ని చవిచూసేదాకా అతనికి అర్థంకాదు. అతన్ని ఎవరు ఎందుకు ఆ భ్రమలో ఉంచారో తర్వాత కూడా అర్థం కాదు.

అతని గురువు అమ్రేష్‌పురి దగ్గరికి సలహాకి వస్తాడు. మిలిటెంట్లు ఎవరి తప్పుల్లోంచి పుట్టారో గ్రహించమంటాడు. తానైతే అంతిమ విజయం [illegible]లదేనని నమ్ముతానంటాడు. ఓంపురి ఎదురుగానే అమ్రేష్‌పురిని అరెస్ట్ చేయడానికి సిఐడి అధికారులు వస్తారు. ఇప్పుడే వస్తానని హుందాగా నడుచుకుంటూ మేడమెట్లెక్కి మేడపై గదిలో ఆత్మహత్య చేసుకుంటాడు అమ్రేష్‌పురి. అమ్రేష్‌పురిలా ఇచ్ఛికంగా ద్రోహం చేయలేడు ఓంపురి. కేవలం భయపడి మాత్రమే ఇన్ఫార్మర్‌గా మారతాడు. అంగీకారం లేని మనిషిని టెర్రర్‌తో ఇన్ఫార్మర్‌గా మార్చుకుంటే అతను ఏదో ఒక రోజున తిరగబడతాడని చూపించాడు నిహలానీ. కానీ తన ఉద్యమాన్ని ద్రోహుల్నుండి రక్షించడానికి మిలిటెంట్ కమాండర్‌కి మరో మార్గం లేదు. తమలోకి చొరబడిపోయిన పోలీసు ఇన్ఫార్మర్ ఎవరో పట్టుకోపోతే అతని ఉద్యమమే సర్వనాశనమైపోయి, మొత్తానికి ఉద్యమ లక్ష్యమే మారిపోతుంది. అందుచేత అతను నజీరుద్దీన్‌షాను చిత్రహింసలు పెట్టినా అది అతని పరిస్థితుల్లో ధర్మసమ్మతమే అవుతుంది. అయితే నజీరుద్దీన్ షా అగ్నిహోత్రావధాన్లు లైఫు [illegible] కోసం కలవరించిపోయే "[illegible]" [illegible] అధికార్ల లైఫు. ఒక మిలిటెంట్‌నో, మిలిటెంట్ గ్రూపునో పట్టిపారేస్తే మిలిటెన్సీ పోతుందనే భ్రమలో ఉంటాడు. అందుచేత కమాండర్ బాధేమిటో అర్థం కాక నజీరుద్దీన్‌షా తనను తానే చంపుకుంటాడు. తన గ్రూప్‌లోని ఇన్ఫార్మర్ ఎవరో తెలుసుకునే అవకాశం పోయినందుకు, పైగా ఆ [illegible]కు నైతిక బాధ్యత తన మీద పడినందుకు మిలిటెంట్ కమాండర్ ఇక దిక్కుతోచని స్థితిలో పడతాడు. 'బేవకూఫ్' అని నజీరుద్దీన్‌పై తన అభిప్రాయం ప్రకటిస్తాడు. అతనికి మిగిలిన ఒకే ఒక [illegible] ఓంపురి. అంతవరకూ ఆ కమాండర్ హింస ధర్మపక్షంగానే ఉంటుంది. అతని హింస[illegible] Human Essence ఉంటుంది. అయితే తన శిబిరంలోని మిలిటెంట్ సురేందర్ చేసిన [illegible] పక్షం మారిపోతుంది. హింసలోని Human Essence మారిపోతుంది. అప్పుడు ఓం[illegible] ధర్మపక్షమై పోయి నిరాయుధంగానైనా ధర్మబలంతో మిలిటెంట్ కమాండర్‌ని చంపేసి [illegible]తాడు. ఉద్యమం పోలీస్ ఇన్ఫార్మర్ నాయకత్వంలోకి పోతుంది. అక్కడ ఇక్కడ ద్రోహం [illegible] సురేందర్ పోలీసు ఇన్ఫార్మరై ఉండొచ్చునేమో. యుద్ధం ముగిశాకా అసలు ద్రోహులెవరో ఎవరిది ధర్మపక్షమో, ఎవరిది అధర్మపక్షమో తుపాకులు నిర్ణయించవు. జనం కన్నీళ్లు నిర్ణయిస్తాయి. ఆ కన్నీళ్లకి కారణాలు నిర్ణయిస్తాయి. చెట్ల ధర్మాధర్మాలను అవి మూలాలు నిర్ణయిస్తాయి

నిహలానీ ఈ చిత్రంలో తుపాకి టెర్రర్ మాత్రమే చూపించాడు. మనిషిని టెర్రరైజ్ చేయడానికి ఇంకా అనేక ఆయుధాలున్నాయి. వాటిలో మొదటిది రొట్టెముక్క. రొట్టెముక్కని మాయం చేసి వ్యవస్థ చేసే టెర్రర్‌లోంచే భీతిగొన్న పసివాడు పుట్టాడు. వాడికి ఒక బాలెట్ పేపర్ (చెత్తతుపాకి?) ఇచ్చిందీ వ్యవస్థ నిహలానీ ఈ సంగతి చెప్పలేదు. ఎందుకంటే ఆయన కూడా రొట్టెముక్క టెర్రర్‌లో నిలబడి మాట్లాడుతున్నాడు కనుక. ద్రోహకాల్ చిత్రంలో చూపించినది చాలా తక్కువ ప్రేక్షకుని ఊహాకి వదిలేసింది ఎక్కువ. తుపాకుల విషాదంతో సాగి ద్రోహుల బీభత్సంతో ముగుస్తుంది సినిమా. ఈ విషాద బీభత్సాలకు మూలం ఏమిటనేదని నేటి బుద్ధభగవానుడి ప్రశ్న.

-వసీరా

యుద్ధం కవిత్వమైనపుడు

జీవితమే యుద్ధమైనపుడు ఎవరైనా ఏం చేస్తారు ? వూపిర్లు నిండా యుద్ధం ప్రవహిస్తున్నపుడు ఎవరైనా ఏం చేస్తారు ? బతకడం కోసం చావాల్సి వచ్చినపుడు ఎవరైనా ఏం చేస్తారు ? చుట్టూ తలుపులు మూసుకపోయిన టన్నెల్ లాంటి జీవితంలో వుక్కిరిబిక్కిరయితే ఎవరైనా ఏం చేస్తారు ? పురిటి వాసన స్థానంలో మందుగుండు వాసన వస్తున్నపుడు ఎవరైనా ఏం చేస్తారు ? యుద్ధం చేస్తారు యుద్ధం నుండి యుద్ధాన్ని నేర్చుకొంటారు. యుద్ధంలో తయారయ్యే కొయ్యకాలు యువతులు 'విముక్తికి ద్వారాలు తెరుస్తాం. విఫలమైతే వేగుచుక్కలయి నిలుస్తాం' అని చేతుల మీద పచ్చబొట్లు మొలిపిస్తారు.

యుద్ధం చేసేది ఆయుధాలతోనే కాదు. సకలమానవ విలువల్తో. గొంతెత్తి పాటపాడుతారు. ఎలుగెత్తి నినాదమిస్తారు. అక్షరాన్ని విసుర్తారు. గజ్జెకట్టి, డప్పుకొట్టి అడుగులు వేస్తారు. మౌన సమూహాలుగా కదుల్తారు. చివరికి ఆకలినే ఆయుధం చేసుకొంటారు. నిరాహారదీక్షతో జైళ్ళను కంపింప చేస్తారు. యుద్ధం సర్వవ్యాప్తమైనప్పుడు మనిషి ధిక్కారమౌతాడు. బిగించిన పిడికిలౌతాడు. నిప్పులు చెరిగే కవిత్వమౌతాడు.

జీవితమే యుద్ధమైనపుడు 'యుద్ధాన్ని ధరించిన శరీరాలు' 'కవిత్వమై చెలరేగిపోతాయి'.

పాటకే పరిమితమైపోయిందన్న అజ్ఞాత సాహిత్యం ఇవాళ బహుముఖంగా విస్తరిస్తున్నది. నవల, కథ, కథనం, వార్తా కథనం, నాటిక, గల్పిక, లేఖా సాహిత్యం, స్పందన, కవిత, వ్యాసం .... లాంటి వైవిధ్య పూరితమైనవిగా వికసిస్తున్నది. కవిత్వాన్ని గూర్చి తెలియని వాళ్ళు, కవిత్వం చదవనివాళ్ళు, అసలు అక్షరాలు రానివాళ్లు యివాళ కవిత్వం పూస్తున్నారు. యుద్ధం మధ్యలో వుండి యుద్ధాన్ని నిర్వహిస్తున్నవారు భుజంమీది తుపాకిని చెట్టు కానించి, కిట్టులోంచి పెన్నూ పేపరు తీసి లోపల జరిగే వేయి సంఘర్షణల్ని కవిత్వం చేస్తున్నారు. జీవితంలోని సకల పార్శ్వాలూ యుద్ధమైన వైనాన్ని express చేస్తున్నారు.

రాజకీయ తరగతులలో, సమీక్షా సమావేశాలలో నిర్వహించేటప్పుడు విప్లవకారులు అనేకమంది ఒక చోట చేరుతారు. అన్నిటితో పాటు 'సాహితీవేదిక' లు పుడతాయి. రోజా వుదయం కవితలు. గల్పికలు, స్పందనలు, వ్యాఖ్యానాలు 'సాహితీవేదిక' మీద దర్శనమిస్తాయి. వీటిని కాపీలు చేసి యితర విప్లవకారులకు అందజేస్తారు. యిటీవల దండకారణ్య రచయితలు రాసినవి 'ఝంకార్' పేరుతో సంకలనమై మైదానాల్నీ, అరణ్యాల్నీ చేరుకొని గెరిల్లాల కిట్టుల్లో చేరాయి. దండకారణ్య రచయితలు, నల్లమల రచయితలు, రాయలసీమ రచయితలు ... లాంటి అజ్ఞాత రచయితల బృందా లేర్పడుతున్నాయి. అయితే యిక్కడ సాహిత్యం వృత్తికాదు, ప్రవృత్తి కాదు. అవసరం. విప్లవావసరం. పోరాటాన్ని వ్యక్తీకరించడానికే కాదు. పోరాటాన్ని కొనసాగించటానికి కూడా.

యిలాంటి అవసరం నుంచి పుట్టిందే 'జీవితమే యుద్ధమైనపుడు' - కవితా సంకలనం. యిందులోని కవితలన్నీ అజ్ఞాతకవులు రాసినవే.

ఏ దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలోనైనా మొదటి దశ ఆత్మరక్షణా యుద్ధం . మావో చెప్పిన మూడు మంత్రదండాలలో ప్రజాసైన్యం (Red Army) ఏర్పడని దశ. ఈ దశలో రాజ్యహింస సంస్కరణ

యాపంలో mild గానూ, అణచివేత క్యాంపెయిన్ రూపంలో wild గానూ వుంటుంది. పారామిలిటరీ బలగాలు పాశవికంగా బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తాయి. శవాలను కూడా మాయం చేస్తుంది రాజ్యం. విప్లవ యుద్ధంలో నిన్నదాకా ఒకే కంచంలో తిని, కలిసి పోరాడుతూ, జ్ఞాపకాల్ని పంచుకొని రక్తసంబంధం కాదు, వర్గ సంబంధం మిన్న అంటూ కలిసి తిరిగిన వాళ్ళు హఠాత్తుగా శత్రువుచే హత్యకు గురికాబడినపుడు కడుపులో దుఃఖ సముద్రం పిచ్చిగా హోరెత్తుతుంది. జ్ఞాపకాలు కన్నీళ్ళవుతాయి. కసి .... ఈ ఎలుగుబంటి వ్యవస్థపై కత్తిలా దూసుకుపోయే కసి. అదిగో అలాంటపుడు ఏం చేస్తారు ? కవిత్వమై తమను తాము వ్యక్తీకరించుకొంటారు.

అందుకే ఈ సంకలనంలో 77 కవితలుంటే అందులో దాదాపు 43 స్మృతి కవితలే వున్నాయి. అమరవీరుల్ని ప్రత్యక్షంగా సంబోధించడం, వాళ్ల జ్ఞాపకాల్ని తవ్వుకోవడం, పోరాటంలో వాళ్ల పాత్ర గూర్చి, వాళ్ళిచ్చిన విలువైన అనుభవాల్ని గూర్చి చెప్పడం, వాళ్ళు హత్యకు గురైనపుడు ప్రకృతి ప్రతిస్పందన, శత్రువు దుర్మార్గాన్ని నిరసించటం, ప్రతీకారం తీర్చుకొంటామని ప్రతిజ్ఞ చెయ్యడం - యివి అజ్ఞాత స్మృతి కవిత లక్షణాలు. ఈ 43 కవితల్లో కూడా ఈ లక్షణాలు కన్పిస్తాయి.

యుద్ధంలో చనిపోవడం అనివార్యమని తెలుసు. 'సహజ' మని తెలుసు. కానీ మనసు గాయపడ్డనేల అవుతుంది ఆ నేలలోంచి యినుపబూట్లు త్రొక్కిన జ్ఞాపకాలు సలపరిస్తాయి. వాటిని వ్యక్త పరచకుండా ఉండటం అసాధ్యమౌతుంది.

'ఆకాశమూ అలాగే వుంది/ వెన్నెలా కాస్తూనే వుంది/ కానీ/ జాబిలి జాడ మాత్రం తెలీదు' అని కవి దిగాలు పడి 'ఏ అజాగ్రత్త కబళించిందో/ ఏ మృగం పొట్టన పెట్టుకొందో' అని ఆందోళన పడతాడు. 'మీరు లేరన్న వాస్తవం నమ్మశక్యం కావడంలేదు' అనుకొంటాడు. 'డాక్టర్లు బ్రతికిస్తుంటే/పోలీసులు చంపేశారు' అని పోలీసుల కిరాతకాన్ని శపిస్తారు. వాళ్ళు హత్య చేయబడితే ప్రకృతి ఎలా స్పందించిందో, పక్షులూ, జంతువులూ, ప్రజలూ ఎలా విలపించారో కవిత్వీకరిస్తారు. 'ఒడిలో రాలిన నక్షత్రాలను/ఒంటికంటిన రక్తపు మరకల్ని చూపెడుతూ/ నేలతల్లి లోకానికి చెప్పింది.' 'నీ మరణవార్త విని అడవి గర్భంలోని ఓ మొక్క వంగిపోయింది/ ఓ చిన్నారి చిగురాకు వాడిపోయింది... నాతోపాటు అడవితల్లీ ఏడ్చింది'.

శత్రువు బుల్లెట్ల వర్షానికి గురై నేలకొరిగిన ఎర్రమందారాల్ని చూసి సమస్త ప్రకృతి ఎట్లా దుఃఖించిందో అరణ్య రాసిన 'పోరుబాట' కవిత చెబుతుంది.

సలపరించే జ్ఞాపకాల్ని తడుముతూ 'నీ కళ్ళు నన్ను వెంటాడుతూనే వున్నాయి/అడవిలో, ప్రతిచెట్టులో, చిగురించిన ప్రతి చిగురులో సజీవమైన నీ రూపమే కన్పిస్తుంది' - అంటూ 'రక్తచలన స్మృతి'లో విలాప కవిత్వమౌతుంది. పెద్దక్క కవితల్లో యిలాంటి రక్తచలన స్మృతుల్ని మనం చూడవచ్చు.

అమరవీరులు పోరాటంలో చూపిన తెగువ, సమర శీలత, నిర్భీకత, రాజీలేనితనం, వర్గకసి, చిత్రహింసల్ని ఎదుర్కొన్న తీరు - యివన్నీ ఈ స్మృతి కవితల్లో మనకు కన్పిస్తాయి. 'నీ చిరునవ్వు కోసం/ముఖమంతా వెదికాను/చితికిన పెదవిలో/నువ్వు చెప్పని రహస్యం కనిపించింది' అని మంజీర అన్నపుడు శత్రువు ఎన్ని చిత్రహింసలు పెట్టినా నోరువిప్పని అమరవీరులు మనకు కన్పిస్తారు.

ఈ స్మృతి కవితల్లో రాజ్యం యొక్క స్వభావం, అణచివేత రూపాలు మారే కొద్దీ పోరాట రూపాలు మారటం, ప్రజలు మరింత మిలిటెంట్‌గా కదలటం... వంటి అంశాలు కూడా కన్పిస్తాయి. 'మీ మాయం మర్మం/ పోలీసేవర రంగును బహిరంగ పర్చింది/ మీ హయం తెచ్చిన మార్పులు/ పోరాటరూపాలను మార్చింది' అని 'జనం' అంటారు.

జీవితం యుద్ధ . ' మారిపోయి , 'శ్వాసించినంత సహజంగా యుద్ధం జీవితంలో

భాగమౌతుంది' అని దీపక్ టైటిల్ కవిత 'జీవితమే యుద్ధమైనపుడు...... లో వివరిస్తాడు. యుద్ధమే జీవితమైనపుడు మనిషి అనివార్యంగా నిర్బంధాన్ని ఎట్లా ఎదిరించగలుగుతాడో ఈ కవితలో మనకు చెబుతాడు కవి. అన్నిటిలాగే యుద్ధం నిరంతర చలన ప్రవాహం. ప్రవాహంతో పాటు నడవలేనివాడు గట్టుకి విసరి వేయబడతాడు. 'యుద్ధరంగంలో ప్రజలు రూపొందించే/ఎత్తుగడలతో పాటు ఎదగలేక/సాహసంతో సరితూగలేక/వాడిలో నెత్తురు చచ్చిపోయింది..... నెత్తురు చచ్చిన పిరికివాళ్లకు/ఇక్కడ స్థానంలేదు' అంటాడు ఇంద్రవెల్లి.

విప్లవోద్యమం తీసుకొనే ప్రతి మలుపులోనూ, యుద్ధం గుణాత్మక మార్పు తీసుకొనే ప్రతిదశలోనూ, నిర్బంధం తీవ్రమయ్యే ప్రతి సమయంలో 'నెత్తురు చచ్చిన పిరికివాళ్ళు' శత్రువుకు లొంగిపోతారు. యివాళ ఆంధ్రరాష్ట్ర విప్లవోద్యమంలో సాధారణ విప్లవ కార్యకర్త నుండి రాష్ట్ర నాయకత్వం వరకు అనేకమంది శత్రువుకు లొంగిపోయారు. ఈ లొంగుబాట్ల మీద 3 కవితలున్నాయి ఈ సంకలనంలో. 'వాడికి తన జీవితమే తీపైనపుడు/జనమంతా చేదయిపోతారు .....' అని 'చిన్న లొంగిపోయిన వాళ్ళగుర్చి అంటాడు. 'విద్రోహి/కుంటి సాకులతో/ వెనుతిరుగుతాడు' అంటాడు సాగర్. అయితే కొందరు లొంగిపోయినంత మాత్రాన విప్లవం ఆగదు. అందుకే 'శిశిరంలో ఆకులు రాలినా/ వసంతంలో కొత్త చిగుర్లు తొడిగి/చెట్టు గుబురవ్వక మానదు' అంటాడు అనామకుడు (అనామధేయుడు).

ఈ సంకలనంలో పై అంశాలపైనే కాకుండా స్త్రీ విముక్తి, స్వేచ్ఛ, రాజ్యహింస, హింస - ప్రతిఘటన, శత్రువు, కమ్యూనిజం, నిర్బంధం -నిషేధం, మతం, అన్నలు, సామ్రాజ్యవాదం, వీడ్కోలు, అమ్మ - ఈ అంశాలపై కవితలు వున్నాయి.

ఈ కవితా సంకలనాన్ని సంప్రదాయ విమర్శనా దృష్టితో చూస్తే ఈ కవిత్వం యొక్క వాడి, వేడి అర్థంకాదు. అఫ్సర్ అన్నట్లు ఈ కవిత్వాన్ని నిజాయితీతో కొలవాలి.

పోరాటంలో గన్ను పట్టుకొని పోరాడుతున్నవాళ్లు పెన్ను పట్టుకొని రాయడం వల్ల, వాళ్ళకున్న అనేకానేక పరిమితుల దృష్ట్యా చాలా కవితల్లో కవిత్వం పలచబడింది. కేవలం మాటల్ని పేర్చడం జరిగింది. వున్న అవకాశాన్ని వుపయోగించుకొని వివిధ కవుల కవిత్వం చదవడంపై ఈ కవులు శ్రద్ధ పెట్టాల్సి వుంది. అలాగే కవితా నిర్మాణంపైనా, శిల్పంపైనా శ్రద్ధ పెట్టడంతో పాటు వస్తు వైవిధ్యాన్ని కూడా సాధించాల్సి వుంది.

సంపాదకులు ఈ కవితలు రాసిన లేదా పత్రికలో ప్రచురింపబడిన తారీఖులు వేసి వుంటే వుపయోగకరంగా వుండేది. అలాగే చాలా కవితల్లోని లోపాలను సరిదిద్ది వుండాల్సింది. వుదాహరణకు అజ్ఞాత సూరీడు రాసిన 'సడలని దీక్షతో ...' కవితలో మీరు / కలకూ స్వప్నానికీ మధ్య గీతను చెరిపేశారు' - అని వుంది. కలకూ - స్వప్నానికీ తేడా ఏమిటి? యిక్కడ కలకూ - వాస్తవానికీ అని వుండాలి. యిలాంటి విషయాల్లో ఇంకొంత జాగ్రత్త తీసుకోవాల్సి వుంది. ముఖచిత్రం కొంత అర్థమైయేట్లు వుంటే బాగుండేది.

యిలాంటి అజ్ఞాత సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం యివాళ ఎంతైనా వుంది.

(జీవితమే యుద్ధమైనపుడు - రాడికల్‌మార్చ్ కవితలు (కొన్ని అముద్రితాలు)
వెల : 20 రూపాయలు. విశాఖ విరసం ప్రచురణ
దొరకుచోటు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజమందిరం ఎదురుగా
కాచిగూడ, హైదరాబాద్ 027.)

-దాము

మద్దూర దళిత మహిళల పోరాటం

ప్రజాస్వామిక చైతన్యం పెరిగేకొద్దీ అనేక సమస్యలు ముందుకు వస్తూ ఉంటాయి. వాటి వెంటనో, వెనుకనో సమాధానాలూ వస్తుంటాయి. కొన్ని కొన్ని సార్లు ప్రశ్న సరైందే అయినా, సమాధానం గందరగోళమైంది రావచ్చు. అయితే దాన్ని చరిత్ర మళ్ళీ సవరిస్తుంది.

సమకాలీనంగా వస్తున్న కొన్ని సమస్యలకు కర్నూలు జిల్లా మద్దూరు దళిత మహిళల భూపోరాటం ఒక సమాధానం చెప్పేందుకు ప్రయత్నించింది.

భారతదేశం కులాల దొంతరల నిర్మాణమున్న సమాజం. ఇక్కడ కులదోపిడీ, వర్గ దోపిడీ కొనసాగుతోంది. కులం ఉత్పత్తి సంబంధాల్లో, సాంఘిక సంబంధాల్లో ప్రభావాన్ని కలిగి ఉంది. మళ్ళీ ఇదంతా వర్గ విభజనపై ఆధారపడి వర్గ స్వభావాన్ని కలిగి ఉంటుంది. కులంలో, వర్గంలో ఉన్న చలనాలవల్ల అవి అటూ ఇటూ ఏ రూపానికి వచ్చినప్పటికి స్త్రీలపై లైంగిక దోపిడీ యధావిధిగా కొనసాగుతూనే ఉంది.

ఇలాంటి సంక్లిష్టమైన కులవర్గ పురుషాధిక్య సమాజంలో ప్రత్యేకంగా ఉన్నట్లు కనిపిస్తున్న కొన్ని సమస్యలకు ప్రత్యేక పరిష్కారమార్గాలు ఇటీవల సూత్రీకరించబడుతున్నాయి. విడివిడిగా కనిపించే అంశాలను పరిశీలించి మొత్తంలో భాగంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. కాని, ప్రత్యేక పరిష్కార మార్గాలు సూచిస్తున్నవాళ్ళు అలా పరిశీలించడం లేదు. దీనివల్ల ఒక్కో సమస్యను విడిగా బైటికి తీసి దానికి ఒక్కో కారణాన్ని వెతికి, అందులోనే పరిష్కారాన్ని ఆలోచించే ధోరణి మొదలైంది. ఇలాంటి పరిశీలన పాక్షికసత్యాన్ని మాత్రమే తెలియజేస్తుంది. మనలాంటి అర్ధవలస - అర్థ భూస్వామ్య వ్యవసాయక సమాజాల్లో అన్ని పీడనలకు భూమి కేంద్రస్థానమవుతుంది. అన్ని ప్రజాస్వామిక చైతన్యాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూపోరాటాలనుండి పుట్టినవే ! ఆ చైతన్యం లేవనెత్తిన ప్రశ్నలన్ని చివరకు భూమి సమస్య పరిష్కారంలో శాశ్వత పరిష్కారాన్ని పొందే దిశగా ప్రయాణిస్తాయి. అయితే భూమి సమస్య పరిష్కారం తర్వాత కూడా మిగతా సామాజిక సమస్యల పరిష్కారానికి చైతన్యవంతమైన పోరాటం అవసరం.

స్త్రీ సమస్య పరిష్కారం భూమి సమస్యతో ముడిపడి ఉందన్న విషయాన్ని మద్దూరు దళిత మహిళలు నిరూపించారు.

ఎందరేమన్నా, ఆంధ్రదేశంలో భూపోరాటం యిచ్చిన చైతన్యమే అనేక రూపాల్లోకి మారి కొనసాగుతోంది. అందులో వొకటి సారా వ్యతిరేక పోరాటం. వర్గపోరాటంలో భాగమైన భూపోరాట ప్రభావంతో అది మొదట తెలంగాణాలో ప్రారంభమైంది. సారా వ్యతిరేక పోరాటం సమస్యలకోసం పోరాడాలనీ, పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయనే విశ్వాసాన్ని ప్రజలకిచ్చింది. ముఖ్యంగా మహిళల్లో !

మద్దూరులో సారాపోరాటం మిగతా ప్రాంతాల్లోలాగా జరుగలేదు. కాకపోతే చుట్టుపక్కల జరిగిన పోరాటాల ప్రభావం ఉండవచ్చు. అది మహిళలకు ఉద్యమ చైతన్యాన్ని ఇచ్చింది. భూమికోసం కదిలించింది. ఈ పోరాటంపై కంచె అయిలయ్య "మద్దూరు దళిత స్త్రీల పోరాటం : పెరుగుతున్న కులవర్గ లింగ చైతన్యం" అనే పుస్తకం రాశారు. అందులో సామాజిక శాస్త్రవేత్తగా అయిలయ్య చేసిన ప్రతిపాదనలను సమీక్షించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఆ పుస్తకంలో ఐలయ్య "సారావ్యతిరేక చైతన్యం భవిష్యత్‌లో ఎటువైపు పయనిస్తుందనే అంశంమీదా, దాని ప్రభావం సమాజం మీద ఏ విధంగా ఉండబోతుందనే అంశంమీద మనకు ఓ అంచనా లేకపోయింది".

"ఆ ఉద్యమానికి ఉన్న రాజకీయ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో దాదాపు అందరూ విఫలమయ్యారు" అన్నారు. దాదాపు అందరూ అంటే - మార్క్సిస్ట్ -లెనినిస్ట్ విప్లవకారులతో సహా అని ఆయన అర్థం. కాని వాస్తవంలో సారాపోరాటాన్ని సమూల సామాజిక మార్పుకు నాయకత్వం వహించే విప్లవపార్టీలు వాటికున్న స్పష్టమైన ప్రాపంచిక దృక్పథంనుండి, రాజకీయాలనుండి ప్రారంభించాయి. ఒక రాజకీయ చైతన్యంతో, లక్ష్యంతో ప్రజలను కదిలించి ప్రారంభించిన ఉద్యమం భవిష్యత్‌లో ఎలాంటి ప్రభావాన్ని చూపేదీ ఆయా విప్లవ పార్టీలకు స్పష్టంగా తెలుసు.

మరోచోట : "సారా వ్యతిరేక పోరాట చైతన్యం - భూమికోసం స్త్రీలు" అనే పోరాటంగా మారింది అన్నారు. ఇది వాస్తవాన్ని తిరగేసి చెప్పడమే అవుతుంది. ఎన్ని పరిమితులు ఉన్నా తెలంగాణాలో, దండకారణ్యంలో నడుస్తున్న భూపోరాటంలో స్త్రీలపాత్ర గొప్పగా ఉంది. మొదటినుండీ అనేక పోరాటాల్లో భూమిలేని రైతాంగంతోపాటు మహిళలూ భూమి సాధించుకోవడం కోసం కదలిన సందర్భాలున్నాయి. 'భూమికోసం స్త్రీలు' అనే చైతన్యం వర్గపోరాట క్రమంలో వచ్చిందే ! అది అనేక చైతన్యాలకు ప్రేరణయింది. ఈ చైతన్యమే కుటుంబ సమస్యలను, లైంగిక సమస్యలను, పితృస్వామ్యాన్ని ప్రశ్నించే అవగాహననిచ్చింది. అయితే ఈ అన్ని సందర్భాలలో మహిళలకు ప్రత్యేకంగా భూమి పంచడం అనే అవగాహన లేకపోవచ్చు గానీ 'భూమికోసం స్త్రీలు' అనే చైతన్యం వర్గపోరాట క్రమంలో వచ్చిందన్న విషయాన్ని అయిలయ్య వదిలేయడం సరైందికాదు. మద్దూరులో దళిత మహిళలు భూమి తమహక్కుగా గుర్తించాలని ఉద్యమించారు. మనం వెతుకుతున్న సమాధానాన్ని ఆచరణలో సాధించారు.

"ఇప్పటిదాకా జరిగిన అన్ని ఉద్యమాలు స్త్రీలపై సాగుతున్న అణచివేత నుండి స్త్రీలు విముక్తి చెందడానికి, స్త్రీలకు భూమిహక్కు కల్పించడానికీ గల సంబంధాన్ని చూడ నిరాకరించాయి ....." అన్నారు.

తెలంగాణా పోరాటంలోగాని, శ్రీకాకుళపోరాటంలోగాని స్త్రీవిముక్తిని స్త్రీలకు భూమిహక్కుతో ముడేసి చూడలేదు. అయిలయ్య 'చూడటానికి నిరాకరించాయి' అనడం తప్పు. ఆ మాటకొస్తే ఆ పోరాటాల్లో ఇంకొన్ని సమస్యలు కూడా అప్పటికి వెలుగులోకి రాలేదు. ఇవన్నీ ఆ పోరాటాల పొరపాట్లు కాదు. అది చారిత్రక పరిమితికి సంబంధించిందేగాని, కావలసీ నిరాకరించడం లేదు. నడుస్తున్న చరిత్రనుండి ఉద్యమాలు ఎప్పటికప్పుడు కొత్త పార్శ్వాలను రూపొందించుకుంటూ ఉంటాయి. ఆచరణలో ఎదురైన అనేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటాయి.

అలా ఆలోచిస్తే మద్దూరు దళిత స్త్రీల పోరాటం జరగకపోతే అయిలయ్య పై స్ఫూర్తీకరణకు వచ్చే అవకాశం ఉండదు. ఈ అవగాహన ఆ పోరాటానికి ముందు అసలే లేదు. మద్దూరు మహిళల పోరాటం 'భూమిసమస్య-స్త్రీలు' అనే విషయాన్ని చర్చలోకి తెచ్చింది.

సాధారణంగా సామాజిక శాస్త్రవేత్తలు అనేక అంశాలను క్రోడీకరించుకొని మొత్తంగా పరిశీలించి ఒక నిర్ధారణకు వస్తూ ఉంటారు. మద్దూరు మహిళలు సొంత భూమి కావాలనే లక్ష్యంతో, ఆ దృష్టితో పోరాడారేగాని, అలా భూమి సంపాదించుకుంటేనే తమ విముక్తి సాధ్యమని, లైంగిక దోపిడీ అంతమవుతుందనే ఉద్దేశ్యంతో చేయలేదు. అసలు భూమికి, తమ స్త్రీ పరమైన లైంగిక అణచివేతకు, పితృస్వామ్యానికి సంబంధం ఉందని వాళ్లకు తెలియదు. వాళ్ళకు అంత చైతన్యం లేదు. వాళ్ళకు

కావలసింది భూమి అంతే ! 'దేశంలో మొట్టమొదటిసారిగా స్త్రీలైంగిక సమస్యను భూమితో జతపరచబడింది' అంటూ మహిళలు భూమిపై హక్కు సంపాదించుకోవడంలోనే తమ విముక్తి ఉంటుందని గుర్తించారని ఐలయ్య వాళ్ళకు లేని చైతన్యం ఉన్నట్లు రాశారు.

దీన్ని బలంగా చెప్పడం కోసం విప్లవోద్యమాలకు లేని ఉద్దేశ్యాన్ని అంటగట్టే ప్రయత్నం చేశాడు. మనం స్పష్టంగా అర్థం చేసుకోవలసింది ఏమంటే, ఏ ఉద్యమమైనా మొదలవడానికి ముందుగాని, జరుగుతున్నపుడుగాని సంపూర్ణ అవగాహన కలిగి ఉండదు. చైతన్యం ఒక క్రమంలో మొదలై మొత్తం సామాజిక పరిణామంలో ఆచరణద్వారా విస్తృతం అవుతుంది. సామాజిక శాస్త్రవేత్తలు ఇక్కడే జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా సామాజిక పురోగమన క్రమాన్ని పరిశీలించవలసి ఉంటుంది. శ్రీకాకుళ పోరాట చారిత్రిక సందర్భాన్ని పరిమితులను అర్థం చేసుకోకుండా మద్దూరు పోరాటం ఇచ్చిన అవగాహనతో ఆనాటి ఉద్యమంలో 'స్త్రీలు-భూమి' అనే అంశం లేదనడం చారిత్రిక దృష్టికాదు.

కొంతమంది సామాజిక శాస్త్రవేత్తలు- తాము కొన్ని సామాజిక సంఘటనలను పరిశీలించి విశ్లేషించినపుడు, అంతకుముందే తాము ఏర్పరచుకున్న అభిప్రాయాల చట్రంలోకి ఆ సంఘటన వాస్తవాలను యిరికించే ప్రయత్నం చేస్తారు. సామాజిక పురోగతిక్రమం ఆధారంగా వాస్తవాలను, సంఘటనలను పరిశీలించడం, విశ్లేషించడం సరైన పద్ధతి. ఈ పద్ధతి పాటించకపోవడం వల్లనే అయిలయ్య పరిశీలనలో తప్పులు దొర్లాయి.

అలాగే "దేశంలో భూమి పంపకం సమస్య మర్చిపోతున్న సమయంలో మద్దూరు స్త్రీలు భూమి సమస్యను మళ్ళీ ఎజెండాపైకెక్కించారు" అన్నారు. శ్రీకాకుళంతో ప్రారంభమైన వర్గపోరాట ఎజెండాలో అప్పటినుండి ఇప్పటిదాక భూమి సమస్య, భూపంపకం ప్రధానాంశంగానే ఉన్నాయి. విప్లవ పార్టీలు భూమిసమస్యను పట్టించుకున్నట్లు మిగతా సమస్యలను పట్టించుకోలేదనే ఆరోపణ ఒకవైపు ఉండగా అయిలయ్య పైమాట అన్నాడంటే ఎం.ఎల్. పార్టీల ఉద్యమాల చరిత్ర ఆయనకు సరిగా తెలియదని అర్థమవుతున్నది. అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి, మొత్తంగా ప్రజల విముక్తికీ భూమిసమస్యనే కేంద్రంగా చేసుకొని విప్లవోద్యమం నడుస్తోంది. ప్రభుత్వాలు కూడా విధిలేక బంజర్లు పంచడానికి అనేక సందర్భాలలో సిద్ధమైనాయి. నక్సల్‌బరీ తర్వాతనే ప్రభుత్వం భూసంస్కరణలు చేపట్టింది. వంగరలో నరసింహారావు భూములను విప్లవపార్టీ నాయకత్వంలో ప్రజలు ఆక్రమించుకోవడం ప్రారంభించాకనే ప్రభుత్వం దిగివచ్చి లెక్కలు తీసి తనే 'మిగులు భూమి పంపకం' కార్యక్రమాన్ని చేపట్టవలసి వచ్చింది.

ఐలయ్య ఈ వాస్తవాలు మర్చిపోతే ఎలా ?

రెండు దశాబ్దాలకుపైగా వందలాది మంది భూపంపక కార్యక్రమాలకే త్యాగాలు చేస్తున్నారు. ఇన్నేళ్ళలో విప్లవోద్యమం భూమి సమస్యను మర్చిపోయిన సందర్భమే లేదు. అయిలయ్య విప్లవోద్యమ ఫలితాలను విస్మరించిన , చూడ నిరాకరించిన సందర్భంలో మాత్రమే ఆ మాట అనగలిగాడు.

"నూతన ఆర్థిక విధానం కమ్యూనిస్టు పార్టీలతో సహా జాతి అంతా భూమి సమస్యను మర్చిపోయేటట్లు చేసింది" అన్నారు. నిజానికి భూపోరాటాలతో పోల్చుకుంటే నూతన ఆర్థిక విధానాలకు, గాట్‌కు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విప్లవ కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్నది తక్కువే !

అయిలయ్య ఒక ఉద్యమం ఎలా ఉండాలని తను ఆశిస్తున్నాడో, దాన్ని జరిగిన ఉద్యమానికి ఆపాదిస్తాడు. ఉద్యమాన్ని సామాజిక పరిణామంగా చూడక, కేవలం ఫలితాన్ని తను ఏర్పరచుకున్న చట్రంలో ఇమిడ్చాడు. వాస్తవాలను వదిలేసి, చరిత్రను, సామాజిక వాస్తవాలను వక్రీకరించాడు. ఒక నిర్దిష్టత నుండి జనరల్ నిర్ధారణకు రావలసిందిపోయి, తను ముందే ఏర్పరచుకున్న ఒక జనరల్ నిర్ధారణ చట్రంలో మద్దూరు పోరాటాన్ని పరిశీలించారు. ఆ పోరాటం పట్ల తనకున్న అభిమానం కొద్దీ

ఒక్కో సన్నివేశాన్ని అతిశయంగా వర్ణించారు. ప్రతిచిన్న విషయాన్ని దానిస్థాయిని పెంచి సిద్ధాంతీకరించే ప్రయత్నం చేశాడు. జరగనివాటిని వీరోచితంగా చిత్రించాడు. పంటచేలో దిగడానికి ముందే భూస్వాములను ఎలా ఎదుర్కోవాలో ట్రైనింగ్ అయ్యారని, క్యాంపును మహిళలు నడపడమేగాక శత్రుదాడిని తిప్పికొట్టేందుకు సాంప్రదాయక ఆయుధాల శిక్షణ పొందారని, క్యాంపు వడుస్తున్నంతకాలం సాయుధ దళాలు తిరిగాయనే ఘట్టాలు అతికించనవసరం లేదు. అవేవీ లేకపోయినా మహిళలు తమకున్న చైతన్యంతో పోరాడారు.

ఆ ఉద్యమ పరిమితులు గుర్తించకుండా అతిశయంగా కీర్తించడం భవిష్యత్‌లో ఆ ఉద్యమానికి నష్టం కలిగిస్తుంది.

ఈ పోరాటానికి చట్టపరిధిలో లభించిన సహకారం గురించి రాస్తూ, "ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపే అధికారులు దళితకులాలనుండి వచ్చినవారైతే, దళిత ప్రజాస్వామిక ఉద్యమాలకు ఎక్కువ సానుభూతి చూపిస్తారు ..... ఇది కీలక పాత్ర వహిస్తుంది ....." అని కూడా సూత్రీకరించారు. అంతేగాక "రిజర్వేషన్ల వల్ల ప్రభుత్వ యంత్రాంగాన్ని దళితీకరించడం ఈ విధమైన పోరాటాలకు బాగా సాయపడ్తుంది " అన్నాడు.

ఒకవేళ ఈ పోరాటానికి ప్రత్యేకించి చట్టపరిధిలో కొంత న్యాయం జరిగి ఉండవచ్చు. అది వ్యక్తుల సహకారం మాత్రమే! కానీ దీన్ని జనరలైజ్ చేయడానికి వీలుకాదు. ఎందుకంటే, అదే రిజర్వేషన్లవల్ల పైకి వచ్చి ప్రభుత్వ యంత్రాంగంలో కీలకపాత్ర నిర్వహించిన D.T. నాయక్, S.P.మీనా, S.I. మర్రిస్వామి మొదలైనవాళ్ళు పేదప్రజలపై, దళితులపై చేసిన కిరాతకాల మాటేమిటి? వీళ్ళు అగ్రకుల ప్రయోజనాలను కాపాడ్డంకోసమే దళితులపై దాడులు చేశారు. హింసను అమలు చేశారు. కర్నూలుజిల్లా జాయింట్ కలెక్టర్ సతీష్‌చంద్ర అయిలయ్య అనుకున్నట్లు దళితుడు కాదు. మన దేశంలో రిజర్వేషన్లు దళితులకు మేలు చేస్తాయి. కాని అయిలయ్య చెప్పిన అర్థంలోకాదు. దేనికంటే ఆయనకు కులవర్గ సమాజంలో... అగ్రకుల 'రాజ్యం'లో రాజ్యం ప్రభావం ఏమిటో స్పష్టంగా తెలియదు. అందువల్లనే పై సూత్రీకరణకు వచ్చాడు. ఇలాంటి సిద్ధాంతాలు దళిత విముక్తి పోరాటాలను తప్పుదోవ పట్టిస్తాయి.

మద్దూరు పోరాటానికి ఉన్న యింకో ప్రగతిశీల లక్షణం ఐక్యకార్యాచరణ. కర్నూల్లో ఉన్న అనేక సంఘాలు ఈ ఐక్యకార్యాచరణలో పాల్గొన్నాయి. కానీ ఈ పోరాటం గురించి వచ్చిన రిపోర్టుల నుంచి (జనశక్తి అధికార పత్రిక విమోచనతో సహా) అయిలయ్య రాసిన ఈ పుస్తకం వరకు ఎందులోనూ అందులో పాల్గొన్న సంస్థల పేర్లు ప్రకటించలేదు. కేవలం దళిత, పౌరహక్కుల సంఘాలు గురించి, స్త్రీ విముక్తి POW ల గురించి మాత్రమే ప్రస్తావించాడు. అందులో పాల్గొన్న ప్రజాభ్యుదయ సంస్థ విప్లవ రచయితల సంఘాల పేర్ల ఊసే లేదు. ఐక్యత గురించి మాట్లాడేవాళ్ళు ఇలాంటి కనీస ప్రజాస్వామిక పద్ధతులను తప్పనిసరిగా పాటించాలి.

[మద్దూరు దళిత స్త్రీల పోరాటం :
పెరుగుతున్న కుల, వర్గ, లింగ చైతన్యం
రచన : డా॥ కంచె అయిలయ్య
ప్రచురణ : మద్దూరు సంఘీభావ కమిటి
వెల : 2-00
ప్రతులకు: సహచర బుక్‌హౌస్, కుత్బీగూడ, కాచిగూడ స్టేషన్‌రోడ్, హైదరాబాద్-500 027.]

-పాణి, కర్నూలు.

లేఖలు

[illegible]

అరుణతార ఎడిటర్‌గారికి ముందుగా నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అరుణతారలో జరుగుతున్న చర్చను పురస్కరించుకొని సంక్షిప్తంగా నా అభిప్రాయాల్ని మీ ముందు ఉంచుతున్నాను.

రచయితలు రాసే రచనల్లో, మాట్లాడే మాటల్లో తమ వైఖరిని ప్రదర్శిస్తుంటారు. కొందరి వైఖరిని సులభంగా అర్థం చేసుకోవచ్చు, మరికొందరిని లోతుగా అర్థం చేసుకోవలసి వుంటుంది. ఈ రెండవ కోవకు చెందినవారే బాలగోపాల్‌గారు. వేర్వేరు సందర్భాల్లో బాలగోపాల్‌గారు ప్రస్తావించిన వాటిని స్థూలంగా పరిశీలన చేయటంలో తప్పు లేదనుకుంటా.

(1) సెప్టెంబరు, 1993 అరుణతారలో బాలగోపాల్‌గారి వ్యాసం 'చరిత్ర, మనిషి, మార్క్సిజం' సుదీర్ఘమైన చర్చకు దారి తీసింది. సంవత్సరంపైగా తన వ్యాసంపై జరుగుతున్న చర్చకు కనీసంగానైనా 'మార్క్సిజం లేమితో నష్టపోతున్న ' తెలుగు పాఠకులకు సమాధానం ఇవ్వకుండా, ఆగస్టు 21, 1993 EPW లో సుమంతా బెనర్జీ రాసిన 'సంఘ పరివార్ - ప్రజాస్వామిక హక్కుల'కు స్పందనగా జనవరి 7, 1995 EPW లో బాలగోపాల్‌గారు 'ప్రజాస్వామ్యం - మతతత్వంపై పోరాటం' రాసారు. దీనికి సమాధానంగా మే 20, 1995 EPWలో అరున్ కె. పట్నాయక్ 'మార్క్స్ మరియు నీతుల యొక్క భారం' రాసారు. ఇందులో బాలగోపాల్‌గారి వ్యాసాన్ని అరున్ కె. పట్నాయక్ మూడు వాదనలతో భౌతికవాదానికి వ్యతిరేకం, గతితర్కానికి వ్యతిరేకం, చరిత్ర వక్రీకరణ - విశ్లేషించారు. ఇది తప్పనిసరిగా చదవదగింది. రాగో నవలని సమీక్షిస్తూ మార్క్సిజంలో ఖాళీలున్నవని ఎలా ఆరోపించారో అదే విధంగా బెనర్జీ వ్యాసాన్ని విశ్లేషిస్తూ మార్క్సిస్టు పునాదులే లోపభూయిష్టమైనవని తీవ్రమైన ఆరోపణ చేసారు. ఉదాహరణకి మార్క్స్ చారిత్రక భౌతికవాద దృక్పథం, పునాది-ఉపరితలం, మావో తాత్వికత మొ॥వి లోపభూయిష్టమైనవని పేర్కొన్నారు. అరుణతారలో బాలగోపాల్‌గారి వ్యాసానికి స్పందనగా వచ్చిన అనేక వ్యాసాల్లో మార్క్సిస్టు సిద్ధాంత ఔన్నత్యాన్ని తెలిపే సవివరమైన వివరణలు వచ్చాయి. అయినప్పటికీ, బెనర్జీ వ్యాసానికి స్పందనగా బాలగోపాల్‌గారు రాసిన వ్యాసంలో మార్క్సిస్టు పునాదులే లోపభూయిష్టమైనవని పేర్కొంటూ మార్క్సిజానికంటే దూరంగా మానవజాతి (human species) నైతిక భాండాగారం నుంచి జనించే పోరాటాల ద్వారా ప్రత్యామ్నాయ విలువల్ని తెలుసుకోవచ్చని, ఇందులో గ్రామ్‌సీ పౌరసమాజం ద్వారా ఈ విలువల్ని వ్యవస్థీకరించినట్లు, ఫ్రాయిడ్ తన కృషిని పరిపూర్తి చేయలేకపోయారని పేర్కొంటూ, నైతిక విశ్వం పట్ల విమర్శనాత్మక వైఖరి రాడికల్ రాజకీయ కార్యాచరణలో ఒక ముఖ్యమైన భాగంగా వుండాలని కోరుతూ (బహుశ ఇప్పటివరకు అటువంటి వైఖరి వారికి లేదని లేక లోపించిందని భావించారేమో !), మానవజాతి నైతిక జీవితాన్ని, మానవ చైతన్యాన్ని, మానవ మనస్తత్వాన్ని (గీతల వక్కాణింపు బాలగోపాల్‌గారిది) అవగాహన చేసుకోవాలని పిలుపునిచ్చారు. వర్గ వైరుధ్యాలు, వర్గ నీతి దాటని నేటి చారిత్రక పరిస్థితుల్లో సమాజ నిర్మాణానికి, ఉన్నతికి గల మూలాల్ని నైతిక దృక్కోణంలో చూడటం బాలగోపాల్‌గారి భావవాద ఊహాజనిత చిత్రణ తప్ప మరొకటి కాదు. "వర్గ వైరుధ్యాలను అధిగమించి, నిత్య జీవితంలో వీటి గురించి మరచిపోయే సామాజిక దశలో మాత్రమే, వర్గ వైరుధ్యాలను ఆలోచనలోని వారసత్వాన్ని మార్చే వాస్తవమైన మానవనీతి

సాధ్యమవుతుందని" ఎంగెల్స్ పేర్కొన్నారు (వక్కాణింపు ఎంగెల్స్‌ది). నైతిక చరిత్ర భౌతిక చరిత్ర నుంచి ఉద్భవిస్తుందని మార్క్స్ చెప్పిన విషయం ఖచ్చితంగా నిజం కాదంటారు బాలగోపాల్‌గారు. అంటే భావం నుంచి భావం వస్తుందనుకోవాలా? మధ్యేమార్గం వుండదు. మార్క్స్ చెప్పినదాన్ని తలక్రిందులుగా చూడటమే బాలగోపాల్‌గారు చేసింది. అంతేకాకుండా 'మార్క్స్‌లో నిజమైన దాన్నంతా' తిరిగి వ్యాఖ్యానించవలసిందిగా కోరారు. 'మార్క్స్' లో కూడా నిజం అబద్ధాలు వుంటాయా? లేకుంటే 'నిజమైన దాన్నంతా' అని ఎందుకు అనవలసి వచ్చింది ? మార్క్స్ భవిష్య దర్శనమంతా విఫలమయిందనే నిర్ణయానికొచ్చారు బాలగోపాల్‌గారు.

(2) అందుకే విజయవాడలో మార్చి 5, 1995న "మార్క్స్ సిద్ధాంతంలో లోపాలు ఏమైతే వున్నాయో వాటిని ఎదుర్కొనే క్రమంలోనే తర్వాత వచ్చిన వక్రీకరణ, యాంత్రికత అంటే నా (బాలగోపాల్‌గారు) ఉద్దేశంలో మార్క్స్‌లో తప్పులేమి లేవు తర్వాత వచ్చిన మార్క్సిజంలో అనేక లోపాలున్నాయి అనేది కరెక్టుకాదు దీనికి తాత్విక లోపం మార్క్స్‌లో ఎక్కువుంది అనేదే ఇప్పుడు నేనెదుకుతున్న విషయం" (కాసెట్స్‌లో రికార్డయిన బాలగోపాల్‌గారి మాటలు) అనే నిర్ణయానికొచ్చారు. ఇవి వినికిడి జ్ఞానం ద్వారా విన్న మాటలని బాలగోపాల్‌గారు భావించవచ్చు. అయినప్పటికీ ఇది కొట్టి పారవేయవలసిన విషయం కాదు. ఎందుకంటే "మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలను ఉల్లంఘించరాదు. లేదా అలా ఉల్లంఘిస్తే తప్పులు సంభవిస్తాయి ..... మార్క్సిజం మౌలిక సూత్రాలను అభావం చేయటమంటే రివిజనిజం లేదా మితవాద అవకాశవాదం అవుతుంది" (మావో). బాలగోపాల్‌గారు మౌలికంగా చేసిన తప్పు మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలు తప్పని భావించటం. బహుశ 1975లో భగవద్గీత గురించి కోశాంబి రాసినది చదివి, ప్రభావితుడినై మార్క్సిస్టు నయానని చెప్పుకున్న బాలగోపాల్‌గారు 1993 లేదా 1995లో మార్క్స్‌లో తాత్విక లోపాలు వెతకటం ప్రారంభించారు. తత్ఫలితంగా, బాలగోపాల్‌గారి విశ్లేషణలో చోటు చేసుకొన్నదంతా అమార్క్సియం, యాంటీ-మార్క్సిజంల ఆలోచనల గుబాళింపే. మార్క్సిజాన్ని వదిలేస్తే చేరుకునేదెక్కడకో తెలిసిన విషయమే.

(3) మరో సందర్భంలో బాలగోపాల్‌గారు పేర్కొన్న విషయం : 'సమాజంలో న్యాయం కోసం జరిగే పోరాటాలు చేపట్టే చర్యలన్నీ న్యాయమైనవేనని చెప్పలేము. ఆ చర్యలకు గురయ్యేవాళ్ళందరూ దుర్మార్గులేనని చెప్పలేము' (చూడండి 'ఉద్యమం' మార్చి 1995, పేజీ 7). ఇందులో బాలగోపాల్‌గారు నొక్కి చెప్పే సూత్రం ఒకటుంది. అదేమంటే, ఏదీ విభజనీయం కాదు. అంటే ప్రతిదీ అవిభాజ్యం. దీని ప్రకారం, సమాజంలో న్యాయంకోసం జరిగే పోరాటాలు చేపట్టే చర్యలన్నీ న్యాయమైన వేనని చెప్పలేము. ఈ వాదననే పొడిగిస్తూ ఒకరి హక్కులకు మరొకరి హక్కులు పోటీపెట్టలేమని చెప్పవలసి వస్తుంది. ఇలా 'చెప్పలేకపోవటానికి', 'పోటీకి పెట్టలేక పోవటానికి' గల కారణాన్ని సమాజంలో వెదకవలసిందని బాలగోపాల్‌గారు పేర్కొన్నారు. సమాజం అంటే మరలా అందులో వర్గాలు, పీడక కులాలు, హక్కులు కూడా ఉంటాయి. ఇందులో సమాజంలో పీడిత వర్గాలు, కులాలు చేసే పోరాటాలన్నీ, వీరు చేపట్టే చర్యలన్నీ న్యాయమైనవేనని చెప్పలేమనేదే బాలగోపాల్‌గారి ఉద్దేశమా ? అవిభాజ్య సూత్రాన్ని బట్టి చెప్పలేమనే అనుకోవాల్సి వస్తుంది. లేదా ప్రతిదీ విభజనీయం అనుకుంటే న్యాయం కోసం పీడిత వర్గాలు, కులాలు చేసే పోరాటాలన్నీ న్యాయమైనవేనని చెప్పాలి. అలానే పీడక వర్గాలు, పీడక కులాలు చేసే పోరాటాలు అన్యాయమైనవేనని చెప్పాలి. బాలగోపాల్‌గారి సూత్రీకరణలో అంతర్లీనంగా వున్న అవిభాజ్యసూత్రాన్ని అంగీకరిస్తే 'న్యాయం కోసం చేసే పోరాటాలు న్యాయమైనవేనని' చెప్పలేము అనుకోవాలి. ఇటువంటి అవిభాజ్య సూత్రమనే శుద్ధ తప్పుడు అభిప్రాయాన్ని కొన్ని పౌరహక్కుల గ్రూపులు, ఉదారవాద మేధావులు వదలుకోవాలనే సుమంతా బెనర్జీ కోరింది. దీనికి భిన్నంగా, బెనర్జీ వాదనకు వ్యతిరేకంగా, పౌరహక్కుల గ్రూపులు 'అందరి' హక్కుల పరిరక్షణకు పూనుకోవాలనే

బాలగోపాల్‌గారు పేర్కొన్నది. అందుకే, అపవిత్ర సంఘపరివార్ హక్కుల కంటే అనేక వేలమంది మతతత్వ బాధితుల ప్రాణరక్షణే బెనర్జీకి ముఖ్యమని బాలగోపాల్‌గారు ఎద్దేవా చేసారు.

(4) గ్రామ్‌సీ, ఫ్రాయిడ్‌లను బాలగోపాల్‌గారు పేర్కొనటం యాదృచ్ఛికం కాదు. ఆనాడే ఫ్రాయిడ్ భూతాన్ని రష్యాలో తరిమి కొట్టిన వైనం తెలిసిందే. ప్రస్తుతం అరుణతారలో ఫ్రాయిడ్ భూతాన్ని తరిమికొట్టుతున్నారు. ఇక గ్రామ్‌సీ కొందరికి సమస్యగా మారాడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరుగా ఇటలీ దేశానికి సంబంధించి గ్రామ్‌సీ సేవల్ని కొనియాడవలసిందే. అయితే గ్రామ్‌సీలో అస్పష్టతలు, వైరుధ్యాలు, మార్క్సిజానికి వ్యతిరేకమైన ఆలోచనలు ఉన్నాయి. ఉపరితలమే అగ్రతర ప్రాధాన్యం వహిస్తుందని, శ్రామిక వర్గం నుంచి వచ్చే మేధావులే కీలక ఆధిపత్య పాత్రని నిర్వహిస్తారని గ్రామ్‌సీ ఆశించాడు. శ్రామిక వర్గం నుంచి శ్రామికేతర వర్గం నుంచి, వచ్చిన కొందరు మేధావులు కీలక ఆధిపత్య స్థానాలను పొంది తర్వాత దిగజారి, విద్రోహకరపాత్రను నిర్వహించిన ఉదాహరణలున్నాయి. గ్రామ్‌సీ ఆశించిన సజీవ మేధావుల (organic intellectuals) భావన నిరాశాజనకమైంది. మేధావులుగా ఎవరూ పుట్టరు, వారు తయారు చేయబడతారు, విప్లవ క్రమం వారిని తీర్చిదిద్దుతుంది. 'ఆచరణలో ప్రత్యక్షంగా పాల్గొనే అట్టడుగున వుండేవారే అత్యంత విజ్ఞానవంతులు..... పామరులు చాలా తెలివైనవాళ్ళు - పండితులు శుద్ధ శుంఠలు' అన్న మావో మాటలు గుర్తుంచుకోవాలి. సందర్భోచిత సంక్షోభంలో (conjectural crises - గ్రామ్‌సీ ఉపయోగించినది, ఇది సందర్భోచితం, యాదృచ్ఛికం, శాశ్వతం కానిది) చిక్కుకొన్న కొందరు మేధావులు తమ సంక్షోభాన్ని మార్క్స్‌కు, మార్క్సిజానికి అంటకట్టడం తప్పు. ఇటువంటి సంక్షోభ "పరిస్థితులే" ఒక 'చరిత్ర' గా 'మనిషి' చే సమాజ వ్యతిరేక, దురాక్రమణపూరిత ప్రవృత్తి గల తప్పుల్ని 'మార్క్సిజం'కి వ్యతిరేకంగా చేయిస్తాయి. ఇది మనకు విచారాన్ని, మరికొందరికి సంతోషాన్ని కల్గిస్తాయి. ఇటువంటి వాటిల్లో నుంచి కొత్త కొత్త ఆలోచనలు పాత ముసుగుల్ని తొలగించుకొని పుట్టుకొస్తాయి. ఇలా ఫ్రాయిడ్, ట్రాట్స్కీ, యమ్. యన్. రాయ్, జిడ్డు కృష్ణమూర్తి వగైరాల ఆలోచనలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. మన దృష్టిలో మార్క్సిజానికి, లెనినిజానికి అభివృద్ధిగా పరిగణింపబడ్డ మావో ఆలోచనా విధానానికి వ్యతిరేకమైన ఏ ఆలోచనైనా పీడిత తాడిత ప్రజలు, వర్గాలు, కులాలు, తెగలు చేసే పోరాటాలకు తీవ్రమైన హాని కల్గిస్తుంది.

మహాకవి శ్రీ శ్రీ గారన్నట్లు,

'అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం'

అనే మహాప్రస్థాన దిశలోనే భూమి, భుక్తి, విముక్తి కోసం దేశవ్యాప్తంగా తమదైన రీతుల్లో ఉద్యమిస్తున్నది నేటి ప్రజ. ఔనన్నా కాదన్నా ఇదే చారిత్రక భౌతికవాద దృక్పథం చెప్పే వర్గపోరాటం యొక్క తార్కికాభివృద్ధి క్రమం. ప్రజల జీవితాలు 'పచ్చపచ్చగా' వుండాలంటే ఎందరెందరో అమరవీరుల రక్తసిక్త బలిదానాలతో ఎరుపెక్కిన ఎర్ర జెండా 'ఎర్రఎర్రగా ' వుండాల్సిందే.

- పి.పి.

28-7-1995.

[illegible]

'సరిహద్దు'గా పేరు మార్చబడిన అడవిలో అన్నలు నవలను సమీక్షిస్తూ పేరును మార్చటానికి సహేతుకమైన కారణాలులేవని రాశాను. అదే సమీక్షలో "నవల పేరు ఏదిపెట్టినా వచ్చే పేచీ ఏదీలేదు" అని కూడా రాశాను. పుస్తక సమీక్ష మొత్తంలో పేరు మార్పు చెయ్యటం ఒక అంశంగా మాత్రమే తీసుకున్నాను. అది కూడా "అడవిలో అన్నలు" అనే పేరుతో అరుణతారలో వరుసగా రావటం మూలంగా ఒక పేరు స్థిరపడిపోయి వుండటమే ఇందుకు గల కారణం. అసలు ముందే ఏదో పేరు స్థిరపడిపోయిన తర్వాత దానిని మార్చటానికి చాలా సహేతుక కారణాలుంటేనో లేదా వివాదాస్పదమైతేనో మార్చటం మంచిదనే ఉద్దేశ్యంతోనే అలా వ్రాయటం జరిగింది.

ఆగష్టు అరుణతారలో "అడవిలో అన్నలేనా? అక్కలు లేరా?" అనే శీర్షికతో సుమనగారు ఉత్తరం రాయడం దీనికి జవాబుగా చెంచయ్యగారు "పురుషాధిక్య వ్యవస్థ తాలూకు భావాలు మనకు తెలియకుండానే మనలో ఉంటాయనేందుకు ఇదొక ఉదాహరణ" అని ఒక కన్‌క్లూజన్‌కు రావటం చూసిన తర్వాత ఈ ఉత్తరం రాయాలనిపించింది.

"అడవిలో అన్నలు" అని పేరు పెట్టడం పురుషాధిక్య వ్యవస్థ భావజాలం ప్రభావం నుంచో లేదా అక్కల్ని తక్కువచేసి చూడాలన్న ఉద్దేశ్యంతోనో కాదనేది సుమనగారికి కూడా అర్థం అయివుంటుంది. ఎందుకంటే సాధన ఆచరణనంతటినీ (మహిళా ఉద్యమ నిర్మాణంలోనూ) పక్కన పెట్టి ఆ టైటిల్‌ను ఒక్కదాన్నీ చూడటం తన అభిమతం కాదని కూడా సుమనగారు చెప్పారు. అలాగే నవల అరుణతారలో సీరియల్‌గా వచ్చినప్పుడు తాను ఎంతగా ఎదురుచూసేదో, అలాగే జిరాక్స్ కాపీలు చేయించి పుస్తకంగా బైండ్ చేయించి విస్తృతంగా మిత్రులందరిచేతా చదివించటం కూడా ఇందుకు నిదర్శనం.

నవలలో - దళ జీవితంలో - మహిళలపట్ల ఎటువంటి అవగాహనతో వున్నారు ? అంటే సైద్ధాంతిక, రాజకీయ నిర్మాణపరంగా మహిళల్ని చిన్నచూపు చూస్తున్నారా ? ఉద్యమంలో తప్పుడు అవగాహనలు ఏమైనా వున్నాయా ? అప్పుడప్పుడే దళాలలోకి వచ్చిన పురుషుల్లో అటువంటి లక్షణాలు ఉన్నప్పుడు వాటిని పోగొట్టటానికి సరైన పోరాటం జరుగుతున్నదా ? లేదా ? అనే విషయంలో చర్చ ఏమీ కొనసాగలేదు. "ఆదివాసీ యువతుల్లో నిద్రాణంగా వున్న శక్తినంతటినీ బైటకు తీసి అద్భుతమైన మహిళా ఉద్యమాన్ని దండకారణ్యంలో నిర్మిస్తున్నట్టు"గానూ, "ఎందరో అక్కల్ని దళాల్లోకి రిక్రూట్ చేసుకుంటున్నా"రనీ సుమనగారు ఉత్తేజాన్ని ప్రకటించారు. ఇంత ఉత్తేజం పొందిన సుమనగారే "ఆ నవల ప్రారంభమైనప్పటి నుండీ ఆ నవల పేరు నన్ను ఒక ములుకులా బాధిస్తూనే వుండిన మాటా అంతే నిజమ"ని తెలిపారు.

ఉద్యమాన్ని చూసి అంతగా ఉత్తేజం పొందిన సుమనగారు ఇంతగా బాధపడటానికి పైన చెప్పిన ఉత్తేజంతోపాటు అక్కల్ని తక్కువ చేసి చూస్తున్నారనే భావనకు గురికావటమే కారణం అయివుండాలి. ఒకవైపు అన్నలు అనే పేరు ఎంతో పాపులర్ అయ్యిందనే వాస్తవం తెలిసివున్నా ఎందుకో కన్విన్స్ కాలేకపోయారు. ఉద్యమం, ఉద్యమ మహిళలపట్ల అనుసరిస్తున్న వైఖరితో ఏకీభవిస్తున్నప్పుడు

ఇంతగా బాధపడవలసిన అవసరం లేదు కదా ! అయితే పేరు అర్థవంతంగా లేనప్పుడు సూచించటం, సరిదిద్దటం బాధ్యతగానే గుర్తించాలి గాని బాధపడకూడదు కదా !

అడవిలో అన్నలు అంటే అన్నలని మాత్రమే కాదు. అది నక్సలైట్ పార్టీకి ప్రజల్లో వున్న పేరని కూడా తెలుసు. మొదట్లో అడవుల్లోకి దళాలు వెళ్ళినప్పుడు అన్నలని కాదు, "చీకటోల్లు" అని పిలిచేవారు. అదిలాబాద్ జిల్లాలో "పారకల సార్లు" అని అంటే, గడ్‌చిరోలి జిల్లాలో "గెడెతోరు" అని, బస్తర్‌లో "రాత్‌వాలా" అని పిలవటం పరిపాటయ్యింది. దళాల్లో ఒకరికొకరు అన్నలని సంబోధించుకోవటం, ప్రజల్ని అన్నలని సంబోధించటంతో A.P. లో "అన్నలు" గా మారితే, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో "దాదల్" (అన్నలు) అనే పేరు స్థిరపడిపోయింది. దళాల్లో మహిళలు వుంటే వాళ్లు "అక్కలు" అయ్యారు.

ప్రాథమిక దశలో అన్నలు మాత్రమే దళాల్లో ఉండటం వల్ల "నక్సలైట్లు" మొత్తంగా అన్నలుగా మారారు. ఆ తరువాత దళాలలోకి మహిళలు వచ్చినా "అన్నలు" పేరు మారలేదు. కొన్ని ప్రాంతాలలోని దళాలకు అక్కలే కమాండర్‌లుగా, డిప్యూటి కమాండర్‌లుగా ఉన్నప్పటికీ నాయకత్వంలో వున్నవారిని 'అక్క'గా పిలిచి మొత్తం దళంను "అన్నలు"గా వ్యవహరిస్తుంటారు.

అసలు "అన్నలు" అని పిలిపించుకోవటమే తప్పని ఆ మధ్య ఎవ్వరో (సత్యమూర్తి అనుకుంటా !) విమర్శించారు. దళం ఏదైనా ఊళ్ళోకి వెళ్ళినప్పుడు 60 ఏళ్ళ ముసలివాళ్ళు కూడా 20 ఏళ్ళు లేని దళ సభ్యుడిని "అన్నా !" అని పిలవటం, దళ కమాండర్‌ని "పెద్దన్న" అని పిలవటం చూడటానికి ఏం బాగుంటుంది చెప్పండి ! కాని ఒక చారిత్రక పరిస్థితి నుంచి విడదీసి చూస్తే ఇది ఎంతో తప్పుగా కనిపిస్తుంది. ఏదో ఒక ఆజ్ఞ జారీ చేసి దీనిని మార్చలేం. ప్రజల్లో క్రమంగా పెరిగే చైతన్యం నుంచే ఇవి పోతాయి. ఒకప్పుడు కమాండర్ పేర్ల మీదుగానే దళాలను గుర్తించేవారు. కాని ఈ రోజు కొండలో, నదులో, వాగులో, ఏదో ఒక ప్రాంతం పేరుమీదనో మాత్రమే దళాల పేర్లను వ్యవహరిస్తున్నారు. ఈ మార్పుకు చాలా కాలమే పట్టింది. అలానే అన్నలు అనేది క్రమంగా పోయి దళాల పేర్లు, కమాండర్, DC అనే పదాలు ప్రజలు వాడటం మొదలుపెడుతున్నారు. కాబట్టి అన్నలు, అక్కలు అనేది క్రమంగా పోతుంది. అది ఉద్యమాభివృద్ధితోనే సాధ్యమవుతుంది.

పై నేపథ్యంలో చూసినపుడు నవల రాసిన కాలంలో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం పొందిన పేరును దృష్టిలో పెట్టుకుని నిర్ణయించిందే కాని వేరే కాదు. కొంతకాలానికి ఈ వ్యవహారం వుండదు. తప్పకుండా మారుతుంది. నిర్దిష్ట కాలంలో రాసిన నవలగానే "అడవిలో అన్నలు" ఉంటుంది.

మరో మంచి టైటిల్ దొరకలేదా ? అని ప్రశ్నించారు. దొరకదని కాదు. అప్పుడు సాధనగారికి ఏ మాత్రం సూచించినా స్వీకరించేవారు. అందులో ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. అంతేకాని దీనికి పురుషస్వామ్య వ్యవస్థ తాలూకు భావంగా గుర్తించకూడదని మనవి.

నవల కుండే టైటిల్ నుండి కాక నవలలో చూయించిన ఉద్యమం- దళ జీవితం-లో మన పరిశీలనను పెంచితే అందులో వుండే తప్పుడు ధోరణులను పసిగట్ట గలిగితే ఉద్యమానికి మనమెంతో మేలు చేసిన వాళ్ళమవుతాం. అందుకే టైటిల్స్‌పై చర్చను కొనసాగించకపోతే మంచిదని నా అభిప్రాయం.

తేదీ : సెప్టెంబర్ 23, '95. - "సముద్రం"

విరసం విశేషాలు

జాషువా సాహిత్య సమాలోచన

సెప్టెంబర్ 17న విశాఖ విరసం యూనిట్ యూనివర్శిటీ తెలుగు శాఖ సెమినార్ హాలులో జాషువా సాహిత్యంపై చర్చా గోష్ఠి నిర్వహించింది. చర్చను ప్రారంభిస్తూ చలసాని ప్రసాద్ కవికి సమాజానికి మధ్యగల సంబంధాన్ని విరసం ఏ విధంగా చూస్తుందో చెప్పారు. విశ్వనాథ, చలం, జాషువాలు సమకాలీనులుగా ప్రసిద్ధులవడానికి సమాజంలో అదే కాలంలో నెలకొని ఉన్న సంక్లిష్ట సామాజిక సంబంధాలే కారణమని చెప్పారు. సంప్రదాయబద్ధ రచనా పద్ధతిలో జాషువా ఎవరికి తీసిపోడనీ, పద్య కవితా శైలిలో మంచి నడకని ప్రదర్శించాడనీ, సాంప్రదాయేతర వస్తువుని విషయంగా తీసుకోవడంలోనూ ఆయన ప్రతిభ, సృజనాత్మకత గోచరిస్తాయనీ అన్నారు.

పెద్దిరాజు జాషువా సాహిత్య దృక్పథాన్ని వివరించారు. స్వానుభవం నుంచి కులం పట్ల నిరసన ప్రకటించగలిగినా, సాహిత్య దృక్పథంలో పురోగమనంతోబాటు ఆయన పయనించలేక పోయాడనీ, తదనంతర కవులైన శ్రీశ్రీ లాంటి వాళ్ళు ప్రదర్శించిన . పరిణత దృక్పథమే దళితుడినైన తనను ప్రభావితం చేసిందనీ అన్నారు.

చిన్నారావు, రమణ మాట్లాడుతూ కవుల మధ్య పోలికలు చూసేటప్పుడు వాళ్లు జీవించిన కాలాన్నీ, వాళ్ల సాహిత్యం ప్రతిఫలించిన ఘర్షణనీ చూడాలని అభిప్రాయపడ్డారు.

జాషువా ఆవేదన నివురుగప్పిన నిప్పని, కన్నీట దాగిన బడబాగ్ని అని వెంకటేశ్వర్లు అన్నారు.

దళితుల దైన్య స్థితిని హృదయాలు కదిలేలా జాషువా చెప్పాడనీ, దైన్యం తరువాత పిడికిలి బిగించి ప్రతిఘటించడం అనే స్పృహని తదనంతర వామపక్ష ఉద్యమాల ద్వారా దళితులు అందుకున్నారనీ వేణుగోపాలరావు అభిప్రాయపడ్డారు.

వర్మ మాట్లాడుతూ జాషువాపై బ్రాహ్మణేతర సాంస్కృతిక, హరిజన, స్వయం ప్రతిపత్తి ఉద్యమాల ప్రభావం ఉందన్నారు. హిందూ సమాజంలో అంతర్భాగంగా, గాంధీ తరహ ఉద్యమాలు ప్రతిపాదించిన మార్గాన్నే దళితుల స్థితిగతుల్లో మార్పు వస్తుందని జాషువా నమ్మాడన్నారు. అయితే జాషువా సాహిత్యం అప్పటి తరం దళితుల ఆత్మగౌరవ పతాకని ఎగుర వేసిందన్నారు.

సవరణ

సెప్టెంబరు (170) 'అరుణతార'లో విషయ సూచికలో 'ప్రజలబిడ్డలు' కదను పి. రామకృష్ణారెడ్డి రాసినట్టు తప్పు పడింది. ప్రజల బిడ్డల కథా రచయిత 'వాణి' అని గమనించ గలరు. పనిపిల్ల కథపై చర్చా వ్యాసాన్ని రామకృష్ణారెడ్డిగారు రాశారు. ముందు ముందు ఇలాంటి తప్పులు జరగకుండా చూడగలం.

ప్రకాశం

★ **అడవి పుత్రిక** (ఆత్మకథాత్మక నవల)

రాగో ప్రచురణలు
రచన : వనజ
వెల : 16 రూ
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
ఆర్య సమాజ్ ఎదురువీధి, కాచిగూడ
హైద్రాబాద్; సహచర బుక్ హౌస్
కాచిగూడ, హైదరాబాద్
ప్రగతి బుక్ హౌస్, విజయవాడ

★ **పోటెత్తిన పోరువంక** (విప్లవ కవితా సంకలనం'

గుంటూరు జిల్లా విరసం ప్రచురణ
వెల : 15 రూ
ప్రతులకు : సి.ఎస్.ఆర్. ప్రసాద్, సి - 132
ఎస్.వి.ఎన్. కాలనీ
గుంటూరు - 522 006

★ **ఆమె నడిచినంత మేరా** (కవితలు, వ్యాసాలు, కథ)

రచన : పద్మ, విరసం ప్రచురణ
వెల : 15 రూ
ప్రతులకు : వి. చెంచయ్య
6-5-13, కావలి - 524201, నెల్లూరు జిల్లా

★ **కథ 94**

సం॥ వాసిరెడ్డి నవీన్
పాపినేని శివశంకర్
కథాసాహితి ప్రచురణ
వెల : 28 రూ
కాపీలకు : విశాలాంధ్ర బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్, హైద్రాబాద్
పల్లవి పబ్లికేషన్స్, ఏలూరు రోడ్
విజయవాడ
నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్

అస్త్రము కాదు అగ్గిని

ఏదేమి, అస్త్రమురా
[illegible] ఉల్లాసినాను
[illegible] వాన్ని
[illegible] వాన్ని
[illegible]
  [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible] పోయినవాన్ని, మెరుగు పెట్టినదాన్ని
  నేను నీ అస్త్రమురా
[illegible]

దొడ్డుదానిగా బతికినదాన్ని
మాతృత్వం మధురం అనే
  మత్తులో జోగాడినదాన్ని
కుటుంబం అనే కొలిమిలో
  కాకలు తీరినదాన్ని
ఇక నేను అస్త్రము కాదురా! అగ్గిని
ప్రజాయుద్ధ అగ్నిలో వెలుగుతున్న
  దున్నదాన్ని
వెలుగుతున్నా అడవులనుంచి
పల్లెలు, నగరాలను చుట్టుముడుతున్న
నేను అస్త్రము కాదురా! అగ్గిని

—చంద్రవతి

సెంట్రీ

నక్షత్రాలు పొదిగిన ఆకాశాన్ని
దుప్పటిగా కప్పుకొని
పచ్చపొలాలను పక్క చేస్తూ
[illegible] చేస్తూ
[illegible]
పగలంతా పరిశ్రమించిన

నా దళం, నా దండు, నా ప్రజ
పచ్చపల్లె ఒడిలో ఆదమరచి నిద్రిస్తోంది
నిద్రిస్తున్న నా దళాన్ని, నా దండును,
  నా ప్రజని
గోతులు తవ్వుతున్న గుంటనక్కలనుండి
పొదలచాటున పొంచివున్న
ప్రమాదాల పులులనుండి కాపాడటానికి
నా కనులలోని కాంతితో
ఈ కటిక చీకటిని చీల్చుకొని
శత్రురాకను గమనించడానికై
ఒళ్ళంతా కళ్ళు చేసుకుని
[illegible], [illegible], [illegible]
శత్రువుపై దాడికి సంసిద్ధుడనై
[illegible]లోకి నా చూపులను [illegible]
కదులుతున్న కాలాన్ని
చేస్తున్న గడియారంతో చెలిమిచేస్తూ
వేకువకై సాగిపోతున్నవాణ్ణి
ఉదయించే సూర్యుడికై ఎదురుచూస్తు
  న్నవాణ్ణి

  నేను సెంట్రీని
  నా దళానికి సెంట్రీని
  నా దండుకి సెంట్రీని
  నా ప్రజలకు సెంట్రీని
  ప్రజాపోరాటానికి సెంట్రీని
  సాధించనున్న విజయాలకు సెంట్రీని
  నేను సెంట్రీని

(రచనాకాలం-1994)

—సహచరి

KLVA101M109 62

171 ARUNATARA OCTOBER, 1995 H/GTR-70-
Annual Subscription Rs. 50/- Single Issue Rs. 5/-

గల్పిక :

అక్షరాలు ఆయుధాలై భయపెడితే...

“ప్రియమైన ప్రజలారా! అన్నలారా! అక్కలారా! మన దేశం ఈ రోజు వెనకబడి పోవడానికి మీరంతా నిరక్షరాస్యులుగా ఉండిపోవడమే కారణం. కాబట్టి మీరందరూ చదువుకోవాలి. అప్పుడే దేశం ముందుకుపోతుంది. ప్రభుత్వం మీకు పలకలూ, పుస్తకాలూ ఉచితంగా యిస్తుంది. మీకు చదువు నేర్పే టీచర్లను పంపిస్తుంది. ప్రభుత్వం ఇంత కృషి చేస్తుండగా మీరు చదువుకోకపోతే మీ తప్పే అవుద్ది. కాబట్టి మీరందరూ అక్షరాలు నేర్వాలి.”

* * *

“ఏమిరా- ఒళ్ళు కొవ్వెక్కిందా మీకు? అక్షరాలు నేర్చి వూర్లేలుతార్రా? మీరందరూ నక్సలైట్లేరా మాకు తెలుసు! మీ అన్నలు చదువు నేర్వమంటే ఈడి కొచ్చి ప్రభుత్వమిచ్చిన పలకల్తో, పుస్తకాల్తో చదువులు నేరుస్తార్రా మీరు? ఇప్పటికే తెలివి మీరిపోయార్రా మీరు! చదువుకొంటే ఇంకా నెత్తిమీది కెక్కుతారు. అయినా మీరు చదివేదంతా నక్సలైట్ల చదువేగదరా, మీ టీచర్లందరూ నక్సలైట్లేరా! మళ్ళీ నైట్‌స్కూల్ మాటెత్తారో మీ ఊరు నాశనం చేస్తాం. టీచర్లను ఎన్‌కౌంటర్ చేస్తం. చదువు గిదువు జాంతానై – సమ్‌ఝే?”

* * *

ఈ శతాబ్దాంతానికల్లా దేశంలో నిరక్షరాస్యతను పారద్రోలతామని ఐక్యరాజ్య సమితికి భారత ప్రభుత్వం మరోసారి హామీ యిచ్చింది.

* * *

నైట్‌స్కూల్ టీచర్ రాజేందర్‌ను నక్సలైటనే అనుమానంతో కిరాతకంగా చిత్రహింసలు పెట్టాయి ఖాకీమూకలు.

* * *

ప్రజలు రహస్యంగా అక్షరాల్ని మండిస్తూనే ఉన్నారు.

—తస్నిమ్

Printed at Nagendra Press, VJA-2 on behalf of Venkataramana Printers, Guntur - 1, for 'Revolutionary Writers' Association

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M109
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	పైల
వెనుక అట్ట	పైల
మొత్తం పేజీలు	65
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	susmitha
పేజీలు విడదీసినది	susmitha
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good